సంపుటి: 43
సంచిక: 2

ఫోన్ నెం:
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సిప్లిమెంట్) 84 రూపాయలు.
హోమ్ డెలివరీ (సభ్యత్వ రుసుము) 10 రూపాయలు.

సెప్టెంబరు, 1986

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. పీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

అపరాధ పరిశోధన పోటీ-216

[ఫలితాలు]

జులై '86 నెల "అపరాధ పరిశోధన పోటీ—216" కి సరియైన సమాధానాలు:

1. అమెరికా
2. తలనొప్పి
3. గోడమీది పిల్లులు
4. పువ్వుల పరిమళాలు
5. టెలిఫోన్

పై జవాబుల ప్రకారం ఒక్కరు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి అక్టోబరు '86 నెలనుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

బహుమతి గ్రహీత:—

శ్రీ ఏ. బాలాజీ,
S/O అంబాజీ సీనయ్య,
శ్రీ బాలాజి మెడికల్ స్టోర్స్,
మెయిన్ రోడ్,
ధర్మవరం—515 617
(అనంతపురం జిల్లా)

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. ప్రేమ రుమాలు—వసుంధర
23. శ్రీమతి కోరిక—కె బి. యస్. కుమార్
35. శత్రువు శవం—భీమవరపు పురుషోత్తం
48. కలర్ టి.వి.—జొన్నలగడ్డ రామలక్ష్మి
68. రాక్స్ రాకెట్—సుంకరి రాంప్రసాద్
91. గంపెడు మల్లెలు—కె.బి.యస్. కుమార్
107. నరసింహావతారం—(సీరియల్) వసుంధర
143. ప్రేమరోగి—కె.వి.యస్.యస్. మూర్తి
156. ప్రాణ భీతి—బి. వి. ఈశ్వర్
173. మరణ యాత్ర—(సీరియల్) ప్రతాప రవిశంకర్

నవలలు (సప్లిమెంట్)

3. లై డిటెక్టర్—వసుంధర
47. నకిలీ సంపద—భీమవరపు పురుషోత్తం
80. పులి పంజాలు—సుంకరి రాంప్రసాద్
112. రావణ ప్రేమ—ఎమ్ వి.వి. సత్యనారాయణ
169. అన్వేషణ—(సీరియల్) వి. యస్. రావ్

ఇంకా—ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

ప్రేమ రుమాలు

వసుంధర

పార్కులో గులాబిపొదల పక్కన కూర్చున్నారిద్దరు ప్రేమికులు.

అతడిపేరు మురళి.

ఆమెపేరు శోభ.

ఇద్దరూ ఒకరికొకరు ఎదురుగా ఉన్నారు.

ఇద్దరి ముఖాల్లోనూ దిగులు.

"మా నాన్నకి పెళ్ళి ఇష్టంలేదు మురళీ!" అంది శోభ.

"ఆ విషయం నాకు తెలుసు...." అన్నాడు మురళి.

"మనం త్వరగా ఏదో ఒకటి చేయాలి...."

"నీకు కష్టాలు తెలియవు. అందుకే నేను ధైర్యం చేయలేకపోతున్నాను...."

"నువ్వు పక్కనుంటే నాకు కష్టమంటే తెలియదు. భయపడకు. నువ్వేం చెప్పినా చేస్తాను...."

"నా అధైర్యానికి కారణం కృతజ్ఞత కూడా!" అన్నాడు మురళి.

"ఏమిటా కృతజ్ఞత?" అంది శోభ.

"అమ్మా నాన్నా లేని నన్ను నాలుగేళ్ళ వయసునుండి పెంచి పెద్దవాణ్ణి చేశాడు మామయ్య. అలాంటి మామయ్య నెలా మోసం చేయగలను నేను?"

"ఆ మామయ్య కూతుర్నే నేను. నువ్వు నన్ను పెళ్ళి చేసుకోకుంటే ఆత్మహత్య చేసుకుని చచ్చిపోవాలనుకుంటు న్నాను. నీ కృతజ్ఞత నీ మామయ్యకు పుత్రికా వియోగం కలిగించమంటోందా?" అంది శోభ.

మురళి ఆమె కళ్ళల్లోకి చూశాడు.

శోభ కళ్ళు ప్రేమను వర్షిస్తున్నాయి.

"లేదు శోభా! నిన్ను నేను తప్పక పెళ్ళిచేసుకుం టాను" అన్నాడతడు.

"అయితే మనం వెంటనే పెళ్ళిచేసుకోవాలి!"

"ఆ విషయం నాకు తెలుసు...." అన్నాడు మురళి.

మర్నాడే శోభకు పెళ్ళితాంబూలాలు.

నెలరోజుల క్రితం శోభని చూసుకుందుకు పెళ్ళివా రొచ్చారు.

వరుడు అమెరికాలో ఉంటూ పెళ్ళిచూపులకోసం ఇండియా వచ్చాడు. శోభ అతడికి నచ్చింది.

అతడిక్కడ ఇంకో నెలరోజులు మాత్రం ఉంటాడు. ఈలోగా తాంబూలాలు, పెళ్ళికూడా అయిపోవాలని మగ పెళ్ళివారు చెప్పారు. పెళ్ళికాగానే వధూవరులు అమెరికా వెళ్ళిపోతారు.

వరుడు స్ఫురద్రూపి.

శోభ ఇంట్లో అందరికీ ఈ సంబంధం నచ్చింది.

కానీ శోభ మురళిని ప్రేమిస్తోంది.

చిన్నతనంనుండీ తెలుసామెకు మురళి.

మురళి ఆమెను ప్రత్యేకంగా చూసుకునేవాడు. అది క్రమంగా ఇరువురి మధ్యా ప్రేమకు దారితీసింది.

తండ్రి తనకు సంబంధాలు చూడ్డం ప్రారంభించగానే శోభ ఇంట్లో తను మురళినే చేసుకుంటానని చెప్పింది.

శోభ తండ్రి మురళిని పిలిచి "అభం శుభం తెలియని పిల్లను వల్లో వేసుకుని నా ఆస్తికి వారసుడివి కావాలనుకుంటున్నావేమో! దిక్కులేనివాడివని జాలితలచి పెంచిన నామీద ఏమాత్రం కృతజ్ఞత ఉన్నా మళ్ళీ శోభ జోలికి రాకు" అన్నాడు.

అప్పటికి మురళి ఓ కంపెనీలో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. మామయ్య ఆదేశం మీద అతడిల్లు మారిపోయాడు.

కానీ కథ అక్కడితో ఆగిపోలేదు. శోభ తరచుగా మురళిని కలుసుకుంటోంది. తన్ను పెళ్ళిచేసుకోమని బతిమాలుతోంది.

రేపు తండ్రి తాంబూలాలకు వెడుతున్నాడు.

ఈలోగా ఆమె మురళిని ఎట్లైనా చేయమంటోంది.

"మీ నాన్నను వెళ్ళిపోనీ—ఆయన తిరిగొచ్చేలోగా ఏదైనా చేద్దాం" అన్నాడు మురళి.

"నీ ఆలోచనేమిటో నాకు చెప్పు. ధైర్యంగా ఉంటుంది."

"ఆలోచనకేమీలేదు. గుళ్ళో పెళ్ళిచేసుకుందాం."

"నిజంగా?!" అంది శోభ ఉత్సాహంగా.

"ఊఁ" అన్నాడు మురళి సాలోచనగా.

"నాకున్న ఉత్సాహం నీలో కన్పించడంలేదు" అంది శోభ.

మురళి నవ్వి—"అన్నీ తర్వాత చెబుతానుగా...." అన్నాడు.

అయితే తమ సంభాషణంతా శ్రద్ధగా మూడోవ్యక్తి వింటున్న విషయం శోభకి తెలియదు.

ఆ వ్యక్తి పొదల కటుగా యథాలాపంగా కూర్చున్నట్లు కనిపిస్తున్నప్పటికీ వారిమాటలు వినడం మినహా ఆమెకు వేరే పనిలేదు.

2

తండ్రి ఎప్పుడు బయటకు వెడతాడా అని ఎదురు చూస్తోంది శోభ.

తాంబూలాలకు ఆయన, బాబాయి. తాతగారు కలిసి కార్లో వరుడి ఊరికి బయల్దేరుతున్నారు.

బయల్దేరేటప్పుడు తండ్రి శోభతో "నువ్వుకూడా రావా లమ్మా!" అన్నాడు.

"ఎక్కడికి?" అంది శోభ.

"ఊరిక్కాదులే—నాగరాజారావు గారింటికి...."

"అక్కడికెందుకు?"

"రమణికి మాటిచ్చాను నిన్న—నిన్ను వాళ్ళింటిదగ్గర

దిగబెడతానని" అన్నాడు శోభ తండ్రి.

"ఎందుకు?"

"విడియోలో మంచి ఇంగ్లీషు పిక్చరొచ్చిందిట. నీతో కలిసి చూడాలని తను మనసుపడింది."

అంటే నాగరాజారావింట్లో రమణితో తనకీ రోజంతా గడిచిపోతుంది. రమణి ఓ పట్టాన వదిలే మనిషికాదు.

మురళినెప్పుడు కలుసుకునేది?

"నిన్ను రమణి వాళ్ళ కార్లో డ్రాప్ చేస్తానందిలే!" అన్నాడు తండ్రి నెమ్మదిగా.

శోభ మాట్లాడకుండా కారెక్కింది.

పది నిముషాల్లో కారు నాగరాజారావిల్లు చేరింది.

వాళ్ళింటికి తాళంపెట్టి వుంది. వాకబు చేయగా ఉదయమే ఊరికి వెళ్ళినట్లు తెలిసింది.

"అనుకోకుండా ఏదో పనితగిలి ఉంటుంది. నువ్వింటికెలా వెడతావూ?" అన్నాడు శోభ తండ్రి.

సరిగ్గా అప్పుడే వారికో టాక్సీ ఎదురయింది.

"టాక్సీ!" అంటూ చప్పట్లు కొట్టాడు శోభ తండ్రి.

టాక్సీ ఆగింది.

శోభ టాక్సీ ఎక్కింది.

కారొకవైపూ టాక్సీ మరొకవైపూ పయనించాయి.

అయితే టాక్సీ సందుమలుపు తిరుగుతూండగా ఓ అమ్మాయి చేయెత్తి టాక్సీని ఆపింది.

టాక్సీవాలా ఆపి—"నాకు బేరముంది" అన్నాడు.

"బేరంకోసంకాదు. ఈ అడ్రసుకెలా వెళ్ళాలో చెప్పగలవా?" అందామె ఓ కాగితాన్నతడి కందిస్తూ.

టాక్సీవాలా ఆ కాగితాన్నందుకుని అడ్రసు గట్టిగా పైకి చదివి—"అద్బే నాకు తెలియదు" అంటూ పెదవి విరి

చాడు.

శోభమాత్రం ఉలిక్కిపడింది.

టాక్సీవాలా చదివినది మురళి అడ్రసు.

"నీకీ అడ్రసుతో ఏం పని?" అందామె అప్రయత్నంగా.

"ఆ అడ్రసు నీకు తెలుసా?" ఆశగా అడిగిందా యువతి.

"ఊఁ"

"అయితే ఎలా వెళ్ళాలో చెప్పు...."

"టాక్సీ ఎక్కు" అంది శోభ.

ఆ యువతి టాక్సీ ఎక్కింది. శోభ పక్కనే కూర్చుంది.

శోభ టాక్సీవాలాకు దారి వివరించింది.

టాక్సీవాలా ఇంజన్ స్టార్టుచేశాడు.

"మురళి నీకేమవుతాడు?" అంది శోభ.

"ఇంకా ఏమీ కాదు...."

"అంటే!"

"మే మిద్దరం పెళ్ళి చేసుకోబోతున్నాం...."

ఆ యువతి ముఖం సిగ్గుతో ఎర్రబడింది.

శోభ షాక్ తిని—"నీ వివరాలు చెప్పు" అంది.

ఆమె మురళి పనిచేస్తున్న కంపెనీలోనే పనిచేస్తోంది. ఇద్దరూ ఒకరినొకరు అమితంగా ప్రేమించుకున్నారు.

మురళి నామె పూర్తిగా నమ్మింది. కానీ మురళి మాత్రం ఆమెను తనింటికి తీసుకువెళ్ళడం లేదు. పెళ్ళెప్పుడో చెప్పడంలేదు.

మురళికి వేరే ప్రేమ వ్యవహారాలున్నాయని ఎవరో ఆమెకు చెప్పారు. అందుకని ఆమె మురళి నింటిదగ్గరే కలుసుకోవాలనుకుంది. తన అనుమానాలన్నీ వెలిబుచ్చి

త్వరగా పెళ్ళిచేసుకోవాలనుకుంటోంది.

ఆమె పేరు అరుణ.

"మురళిని ప్రేమించావు గదా — అనుమానించతగ్గ వ్యక్తిలా కనిపించాడా?" అంది శోభ.

"లేదు. కానీ నిన్న నేనతణ్ణి పార్కులో ఒక యువతితో చూశాను. వాళ్ళిద్దరూ పెళ్ళిగురించి మాట్లాడుకున్నారు. దాంతో నా అనుమానం బలపడింది."

"ఏ పార్కులో ఎవర్ని చూశావు?" అంది శోభ.

"అన్నీ నీకు తెలుసు. నేను నిన్న మురళితో నిన్నే చూశాను. నీ వతడికి మరదలివి. మీ నాన్నకు మీ పెళ్ళిష్టం లేదు. నీకు మాత్రం నీ పెళ్ళి మురళితోనే జరగాలని ఉంది. అతణ్ణి బ్రతిమాలుకుంటున్నావు. అన్నీ విన్నాను నేను...."

"నీకు చాలా తెలుసు" అంది శోభ.

"అవును. మురళి అడ్రసుకూడా నాకు తెలుసు. నిన్ను కలుసుకుని అసలు విషయం చెప్పడమే నా ఉద్దేశ్యం. అందుకే నీ టాక్సీని ఆపాను."

"నేను నీ మాటలు నమ్ముతాననుకున్నావా?"

"నమ్మమని నేనననులు. నీకు చక్కగా అమెరికా వరుడు దొరికాడు. నీ ఆస్తి చూసి మురళి మోజుపడుతున్నాడు తప్ప అతడికి నీపై ప్రేమలేదు. నాకు మురళి తప్ప వేరే ఆధారం లేదు. ప్రస్తుతం అతడి మనసు పరిపరివిధాల ఊగుతున్నా-పెళ్ళయితే తిన్నగా ఉంటాడని నా నమ్మకం. నువ్వు నాదారికి అడ్డురాకు. ఇది నీకు నా విన్నపం...." అంది అరుణ.

శోభ ఆలోచిస్తోంది.

అరుణ నిజం చెబుతోందా? అబద్ధం చెప్పేమాటైతే

ఆమెనందుకెవరు ప్రోత్సహించారు?

ఇదంతా తండ్రి పథకమా?

టాక్సీ చిన్నకుదుపుతో ఆగింది.

"ఇల్లిదేనా అమ్మా?" అన్నాడు టాక్సీవాలా.

"ఊఁ" అని టాక్సీ దిగింది శోభ.

ఆమె వెనుకనే అరుణకూడా టాక్సీ దిగింది.

శోభ టాక్సీవాలాకు డబ్బిచ్చి పంపేసింది.

మురళి ఇల్లు తాళంపెట్టి వుంది.

"నేను మురళిని ప్రేమిస్తున్నాను. నిజానిజాలు మురళినే అడిగి తేల్చుకుందాం" అంది శోభ.

"కానీ ఈరోజు మురళి నీకు దొరకడు" అంది అరుణ.

"ఎందుకని?"

"అతడికి నేను నిన్ను కలుసుకుంటానని తెలుసు."

"నువ్వొక్కటీ తిన్నగా చెప్పడంలేదు. మురళితో నా గురించి మాట్లాడాలని బయల్దేరానని ఇందాకా చెప్పావు" అంది శోభ.

"అదంతా షాక్ ట్రీట్‌మెంటు. నిజానికి నేను మాట్లాడాలనుకుంటున్నది నీతోనే. నేను పేదరాలిని. మురళి వంటివాడు నాకు పెన్నిధి. నీకు మురళి తగ్గవాడు కాదు. అతడి అవసరమూ నీకు లేదు. అతడి గురించిన నిజం తెలుసుకున్నాక నీ వెలాగూ అతడిని ప్రేమించలేవని నా నమ్మకం. అందుకే నిన్ను కలుసుకుని మాట్లాడాలనుకున్నాను."

"ప్రేమ గుడ్డిదే కాదు—చెవిటిదికూడా — అది నీ మాటలు వినడంలేదు" అంది శోభ.

అరుణ ఆమెను బ్రతిమాలుకుంది.

శోభ నవ్వింది.

మురళిని నమ్ముకుంటే నీ బ్రతుకు నాశనమవుతుందంది అరుణ బెదిరింపుగా.

"కాసేపట్లో మురళి వస్తాడు. అప్పుడు నీ బండారం బయటపడుతుంది. నా అభిప్రాయంలో నీ కెవరో డబ్బిచ్చి ఈ మాటలు చెప్పిస్తున్నారు" అంది శోభ.

"అలాగే అనుకో—నా అభిప్రాయంలో మురళి ఇక నీకు కనబడడు."

"ఎందుకని?"

"అతడు నిన్ను మోసగించిన మాట నిజం. అయితే అతడు నిన్నారాధిస్తున్నాడు కూడా. తన మోసం నీకు తెలియకూడదని అతడి భావన" అంది అరుణ.

అరుణ వివరించిందాన్నిబట్టి శోభ కర్థమైనదిది.

మురళి శోభని ప్రేమించిన మాట నిజం. కానీ మామయ్యపట్ల అతడికి కృతజ్ఞతాభావం, భయంకూడా ఉన్నాయి.

ఆయన్ను కాదని శోభని పెళ్ళి చేసుకోనడం అతడివల్ల కాదు.

అలాగని శోభ ప్రేమనూ కాదనలేడు.

ఈ పరిస్థితిలో అతడికి అరుణతో పరిచయమైంది. అతడు తన ప్రేమ సమస్య నామెకు చెప్పుకోలేదు. కానీ ఆమెవద్ద సానుభూతికి ప్రయత్నించసాగాడు. అరుణ అతడి కన్నివిధాలా సానుభూతి నందించేది.

క్రమంగా ఇద్దరిమధ్యా ప్రేమ బలపడింది.

మురళి విచిత్ర పరిస్థితుల్లో ఇరుక్కున్నాడు.

అరుణ అతణ్ణి పెళ్ళిచేసుకోమని వేధిస్తోంది.

మురళి బాగా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాడు.

అతడు అరుణను పెళ్ళి చేసుకుంటే మామయ్య సంతోషిస్తాడు.

అతడు తన ప్రేమను త్యాగం చేసినట్లు శోభ భావిస్తుంది.

అందుకని అతడు అరుణను పెళ్ళి చేసుకుంటానని చెప్పాడు.

అరుణ అతణ్ణి నమ్మి పెళ్ళికి ముందే తన సర్వస్వమూ అతడికి అప్పగించింది.

అప్పుడామెకు తెలిసింది - ఇతరుల - ద్వారా శోభ గురించి.

ఆమె మురళిని నిలదీసింది.

మురళి నిజం ఒప్పుకున్నాడు.

అరుణ అతని నిజాయితీని మెచ్చుకుని క్షమించేసింది.

కానీ అతడి మనసింకా శోభ విషయంలో ఊగిసలాడుతున్నదని తెలిసిందామెకు నిన్న.

అందుకే ఆమె నిన్నటి దినం పార్కులోని ప్రేమికులు విడిపోయాక మురళిని కలుసుకుని నిలదీసింది.

"శోభను కాదనలేకపోతున్నాను. కానీ నన్ను నమ్ము. నీ కన్యాయం చేయను" అన్నాడు మురళి.

"మన పరిచయ మెంతవరకూ వెళ్ళిందో శోభకు తెలియాలి. అప్పుడామె నిన్ను తనే మరిచిపోతుంది" అంది అరుణ.

"ప్లీజ్ - జరిగిందంతా ఆమెకు చెప్పకు. మన పరిచయాన్ని దాచినందుకామె నన్ను వంచకుడిగా భావిస్తుంది. ఆమె నన్ను వంచకుడిగా భావించిందంటే-నేను ఊహలో కూడా భరించలేను. అది నన్ను ఆత్మహత్యకూ్కడా పురిగొల్పవచ్చు" అన్నాడు మురళి.

మామయ్యపట్ల కృతజ్ఞతా భావంతో శోభను కాదంటు న్నాడని అంతా భావించాలి. బలహీనతతో ఓ ఆడదానికి లొంగిపోయిన విషయం - ఎవరికీ తెలియకూడదు. ముఖ్యంగా శోభకి.

"నువ్వు నీ గురించి ఆలోచిస్తున్నావు. నేను నా గురించి ఆలోచిస్తున్నాను. శోభకీ విషయం చెప్పి తీర తాను" అంది అరుణ.

"అయితే కొంతకాలంపాటు నన్ను చూడవు" అన్నాడు మురళి.

"నీ బెదిరింపుకు నేను భయపడను" అంది అరుణ.

అంతగా అవకాశంవస్తే మురళి శోభను పెళ్ళాడ్డానికి వెనుదీయడని అరుణ అనుమానం.

అందుకే ఆమె శోభను కలుసుకుని మాట్లాడటానికే నిర్ణయించుకుంది.

ఇప్పుడిద్దరూ మురళి ఇంటి అరుగుమీద కూర్చుని ఉన్నారు.

అరుణ కథ పూర్తయ్యేసరికి - శోభ కళ్ళలో నీళ్ళు....

"నువ్వు చెబుతున్నదంతా అబద్ధం...." అందామె.

"అబద్ధమైతే నీకంటే ఎక్కువగా నేనే సంతోషి స్తాను" అంది అరుణ.

ఇద్దరూ అక్కడ చాలాసేపు కూర్చున్నారు.

ఆ రోజు ఆఫీసుకు సెలవు. మురళి అంతసేపెక్కడికి వెళ్ళాడో శోభకి అర్థం కాలేదు. ఏ సినిమాకయినా వెళ్ళి ఉంటాడన్న భ్రమలో ఆమె రాత్రి ఎనిమిదివరకూ అక్కడే కూర్చుంది.

ఆమె ఓపికకు ఆశ్చర్యపడుతూ అరుణ కూడా అక్కడే ఉండి ఆమెకు కంపెనీ యిచ్చింది.

మురళి మాత్రం రాలేదు.

ఉస్సురంటూ లేచింది శోభ.

"నా కథ గుర్తుంచుకో" అంటూ హెచ్చరించింది అరుణ.

ఇద్దరూ విడిపోయారు.

3

ఆ రోజు ఆఫీసుకు సెలవు.

మురళి సాయంత్రం పార్కులో శోభను కలుసుకోవాలనే అనుకున్నాడు. గతదినం అతడు బాగా ఆలోచించి - శోభను పెళ్ళాడాలన్న నిర్ణయానికి వచ్చాడు.

ఫలితం గురించి అతడాలోచించదల్చుకోలేదు.

అతడి మదినిండా శోభ.

స్టవ్ మీద వంట చేసుకుని - పదింటికల్లా భోంచేశాడు మురళి.

అప్పుడే ఎవరో అతడింటి తలుపు తట్టారు.

మురళి వెళ్ళి తలుపు తీశాడు.

ఇంటి ముందు కారు, గుమ్మం దగర ఓ మనిషి.

"అమ్మగారు పంపారు నన్ను...." అన్నాడతడు.

"ఏ అమ్మగారు?"

"శోభ."

"ఎందుకు?"

"అర్జంటుగా కార్లో రమ్మన్నారు...."

మురళి ఎక్కువగా ఆలోచించలేదు.

త్వరగా బట్టలు మార్చుకుని ఇంటికి తాళంవేసి కారెక్కాడు.

కారు - సందులు గొందులు తిరుగుతూ ఓ యింటి ముందాగింది.

పాడుపడిన యిల్లది.

"అమ్మగారు లోపల వున్నారు...." అన్నాడతడు.

మురళీ యింట్లోకి వెళ్లాడు.

అక్కడ అతడు చూసింది శోభను కాదు. ఆమె తండ్రిని.

ఆయన మురళిని చెడామడా తిట్టాడు.

మురళి తలవంచుకున్నాడు.

"నా కూతురు అమెరికాలో సుఖంగా కాపురం చేసుకునే యోగం లేకుండా చేయాలనుకుంటున్నావు కదూ! నీ ఆటలు సాగనివ్వను. నీ అంతు చూస్తాను...." అన్నాడాయన.

"మామయ్యా! ఇందులో నా తప్పేమీ లేదు" అన్నాడు మురళి.

"ఎందుకు లేదో చెప్పు...."

"అమెరికాలోనే కాదు-మరెక్కడయినాసరే శోభ నేను లేకుండా సుఖపడలేదు. మేమిద్దరం ఒకరి నొకరు మనసారా ప్రేమించుకున్నాం. మా పెళ్ళికి నీ ఆశీర్వాదం కావాలి" అన్నాడు మురళి.

"నీది ప్రేమ కాదు. స్వార్థం...."

"మాది నిజమైన ప్రేమ మామయ్యా!" అన్నాడు మురళి.

"అయితే నేను నీ ప్రేమను పరీక్షిస్తాను...."

మురళి తలూపాడు.

"ఏ పరీక్షకయినా సిద్ధమేకదా నువ్వు?"

"ఊ!"

"అయితే తిండీ తిప్పలు లేకుండా ఈ యింట్లో పడుండు. నాలుగు రోజుల తర్వాత నేనొచ్చి నువ్వింకా

బ్రతికున్నావేమో చూస్తాను...."

"బ్రతికుంటే మా పెళ్ళి చేస్తావా?"

"నువ్వు బ్రతికుండాలికదా!"

"నా ప్రేమ నన్ను బ్రతికిస్తుంది...."

"సరే-అదీ చూద్దాం....నీకిక్కడ నా మనుషులు కాపలా ఉంటారు. పచ్చి మంచినీళ్ళు కూడా ముట్ట కూడదు. అప్పుడే నీ పెళ్ళి జరుగుతుంది" అన్నాడు శోభ తండ్రి.

ఆ యింట్లో ఇద్దరు దృఢకాయులు మురళికి కాపలాగా ఉన్నారు.

శోభ తండ్రి పెళ్ళి తాంబూలానికి వెళ్లాడు.

4

"తాంబూలాల కార్యక్రమం జయప్రదంగా అయి పోయింది. పెళ్ళివారు మహా మర్యాదస్థులు...." అన్నాడు శోభ తండ్రి.

ఆ మాటలు విన్న శోభకు మనసు మనసులో లేదు.

బావ ఏమయ్యాడు?

అరుణ చెప్పిన కథ నిజమా?

మురళి తనకు ముఖం చూపించాలంటే భయపడు తున్నాడా?

ఎందుకో శోభ కదంతా నమ్మబుద్ధి కావడంలేదు.

మురళి గురించి చిన్నతనం నుంచీ ఆమెకు తెలుసు. పరిచయమున్న తన దగ్గరే ఎప్పుడూ చొరవ తీసుకో లేదు. అలాంటిది స్వల్ప పరిచయంతో అరుణ దగ్గర చొరవ తీసుకున్నాడంటే ఎలా నమ్ముతుంది?

మరి మురళీ ఏమయ్యాడు?

అప్పుడే మూడు రోజులు గడిచాయి - అతడ్ని కలుసుకుని.

తండ్రి పెళ్ళిముహూర్తం కూడా నిర్ణయించుకుని వచ్చాడు. సరిగ్గా రెండువారాలే ఉంది.

వాకబు చేయగా మురళి ఆఫీసు కూడా రావడం లేదని తెలిసింది.

ఒకరోజామె తండ్రితో "నాన్నా-మురళిని చూడాలని ఉంది" అంది.

"వెధవ పనులు చేసినవాళ్ళు ముఖం చూపించలేరు" అన్నాడాయన.

"బావ మంచివాడు నాన్నా!" అంది శోభ.

"అదంతా నీ భ్రమ: ఓ అమ్మాయి నన్ను కలుసుకుని అతడి కథంతా చెప్పింది. నేను మురళిని కలుసుకుని ఆ అమ్మాయి ముందే నిలదీసి అడిగాను. వాడు తల వంచుకుని ఈ విషయం శోభకు చెప్పొద్దు మామయ్యా-నేనిక మళ్ళీ నీకు నా ముఖం చూపించనని మాటిస్తున్నాను-అన్నాడు. ఆ మాట మాత్రం నిలబెట్టుకున్నాడు...." అన్నాడాయన.

శోభ మాత్రం వెంటనే "నీ మాటలు నేను నమ్మను. బావను ఏదో చేశావు నువ్వు. బావ కనపడకపోతే నేను పోలీసు రిపోర్టిస్తాను...." అంది.

"పోలీసు రిపోర్టా?" అన్నాడామె తండ్రి కంగారుగా.

"అవును. తప్పు చేసినా ఒప్పు చేసినా అదేదో బావ నోటే వింటాను నేను...."

"సరే - ఈ రాత్రికల్లా బావను నీ ఎదుటకు తెస్తాను.... ఊరికే కంగారుపడి ఏ రిపోర్టులూ యివ్వకు...." అన్నాడాయన.

శోభ సరేనంది.

అయితే సాయంత్రానికల్లా ఆమెకు హృదయవిదారక మైన వార్త తెలిసింది. ఓ మారుమూల సందులో పాడు పడిన యింటి పెరట్లోని బావిలో ఎవరిదో శవం తేలు తున్నట్లు ఓ పోలీసు స్టేషనుకు కబురందింది.

ఆ శవం మురళిది!

శోభ పోలీసుస్టేషనుకి వెళ్ళిన మురళి శవాన్ని చూసి గొల్లున ఏడ్చింది.

"తను చేసిన వెధవపనికి మొహం చెల్లక ఆత్మహత్య చేసుకున్నాడు ఇంత పని చేసాడని నేనూ అనుకోలేదు" అంటూ బాధపడ్డాడు శోభ తండ్రి.

పోలీసులు ఆయన చెప్పిన వివరాలు నోట్ చేసు కున్నారు. ఆయనవద్ద అరుణ అడ్రసు కూడా తీసుకున్నారు.

క్షణాలమీద అరుణ అక్కడకు రప్పించబడింది. ఆమె, శోభ, శోభ తండ్రి ముగ్గురు చెప్పిన వివరాలూ సరి పోయాయి.

మురళి ఆత్మహత్య చేసుకున్నాడని నిర్ణయించారు పోలీసులు.

శవం పోస్టుమార్టంకు పంపబడింది.

5

ఆ రాత్రంతా శోభకు నిద్రపట్టలేదు.

ఎంత పని చేశాడు మురళి?

అతడు నిజంగా తన్ను మోసం చేయాలనుకున్నాడా?

రాత్రి కలలో ఆమెకు మురళి కనిపించి "నాతో వచ్చేయి శోభా!" అని పిలిచాడు.

కానీ శోభ ఏ నిర్ణయానికీ రాలేకపోతోంది.

ఇది తండ్రి మోసమా? మురళి మోసమా?

మురళి చేతులు చాపి పిలుస్తున్నాడు.

అమాయకంగా ఆశగా ఆమె వైపు చూస్తున్నాడు.

ఆమె ఆలోచిస్తోంది. అతడు మోసగాడైతే?

సందిగ్ధంలోనే తెల్లారిపోయింది.

పొద్దు పొడిచేసరికల్లా ఇంటి తలుపుతట్టారు పోలీసులు

ఇంట్లో కలకలం....హడావుడి....

శోభ వేచి వెళ్ళేసరికి "యూ ఆరండరరెస్ట్...." అంటున్నాడు పోలీసినస్పెక్టర్ తండ్రితో.

"ఏం జరిగింది?" అందామె కంగారుగా.

జరిగింది వెంటనే తెలిసిందామెకు.

తండ్రి తన ప్రేమను భగ్నం చేయడానికి అరుణను నియమించాడు. అందుకామెకు బాగా డబ్బిచ్చాడు. అరుణ తన పాత్ర చక్కగానే నిర్వహించింది. కానీ యిప్పుడు పోలీసులు బెదిరించగా నిజం ఒప్పేసుకుంది.

అరుణకూ, మురళికీ ఏవిధమైన సంబంధమూలేదు.

తాంబూలాలకు వెడుతూ తండ్రి మురళినో యింట్లో బంధించాడు. శోభను పెళ్ళి చేసుకోవాలంటే నాలుగు రోజులపాటు అన్న పానాలు లేకుండా ఉండాలన్నాడు. అతడికిద్దరు మనుషుల్ని కాపలా కూడా పెట్టాడు.

మురళి ఆ షరతుకు ఒప్పుకున్నాడు.

తన చుట్టూ ఉండే మనుషులు తన ఎదురుగా అన్నీ తింటున్నా మురళి సహించి ఊరుకున్నాడు తప్ప బలహీనతకు గురై తిండి తింటాననలేదు.

శోభ కోసం....అతడు పచ్చి మంచినీళ్ళు కూడా తాగలేదు.

అలా ఒకటి కాదు....రెండు కాదు....నాలుగురోజులు.

మురళి రాజకీయవాది కాదు. బిచ్చగాడు కాదు. సంఘ

సంస్కారి కాదు. కార్మిక నాయకుడు కాదు. విద్యార్థిగా ఉన్న రోజుల్లో కూడా అతడే ఉద్యమాల్లోనూ పాల్గొనలేదు.

నిరాహారదీక్ష అతడి కలవాటు కాదు.

అయినా నాలుగు రోజులు అన్నపానాలు లేకుండా జీవించి తన ప్రేమ బలాన్ని నిరూపించుకున్నాడు.

అతడు కోన ప్రాణంతో నీరసంగా ఓ గదిలో ఉన్నాడు.

గది కవతల శోభ తండ్రి తను నియమించిన మనుషులతో మాట్లాడి విషయం తెలుసుకున్నాడు.

మురళి ప్రేమకు అద్భుతం, ఆశ్చర్యపడలే దాయన.

ఆయనలో కోపం రేగింది.

"ఓ రాయి కట్టి బావిలో పడేయండి. మొండి వెధవ. ఇలాంటివాడు బతికుంటే నా కూతురు కెప్పటికయినా ప్రమాదమే!" అన్నాడాయన.

పక్క గదిలో మురళి ఆ మాటలు విన్నాడు.

తన జీవితం ముగుస్తోందని గ్రహించాడు.

తనను శోభ తండ్రి హత్య చేస్తున్నాడు. కానీ ఆ హత్యకు ఋజువుండదు.

ప్రపంచంలో ప్రేమికులను విడదీయడానికి మించిన ఘోర ముండదు. ఆ ఘోరం చేసినవాడు తప్పించుకో కూడదు.

తానిప్పుడు ఏదో ఒకటి చేయాలి.

ఈ నేరాన్ని బయట పెట్టాలి.

తాను తప్పించుకుని పారిపోలేడు. తను చేయవలసిం దల్లా మామయ్య తప్పించుకోకుండా చూడడం.

అతడి జేబులో ఒక తెల్ల రుమాలుంది.

అది మామూలు రుమాలు కాదు. శోభ **అతడికి**

ప్రేమతో యిచ్చిన రుమాలు.

అతడి చొక్కా జేబులో బాల్ పెన్నుంది.

చిన్న చిన్న అక్షరాలతో ఆ రుమాలు మీద జరిగిందీ, జరగనున్నదీ రాశాడతడు.

ఆ రుమాలు తన అండర్ వేర్ లోపల దాచాడు!

ఎవరూ ఊహించని ఆధార మది!

పోలీసులకు నేరం గురించి తెలిసిపోయింది. వారు శోభ తండ్రి నరెస్టు చేయడానికి వచ్చారు.

"ఇన్స్పెక్టర్ - నేనోసారి ఆ రుమాలు చూడ వచ్చా?" అంది శోభ.

ఇన్స్పెక్టర్ ఆమెకా రుమాలు నందించాడు.

శోభ చదువుతోంది.

అందులోని ప్రతి అక్షరమూ ఒక పిలుపై ఆమెను పిలుస్తోంది.

ఆమె కప్పుడు మురళి చేతులు సాచి కనిపించాడు.

"వస్తున్నా-మురళీ!" అని అరిచిందామె. ఇప్పుడామె నిర్ణయంలో సందిగ్ధావస్థలేదు.

మరుక్షణం ఆమె నేల కూలింది.

"ఏమయింది?" అంటూ అంతా ఆమె చుట్టూ మూగారు.

క్రింద పడిన శోభలో ప్రాణం లేదు. అయినా ఆమె చేతులు-మురళి రుమాలును గట్టిగా పట్టుకునే వున్నాయి.

బహుశా శోభ తండ్రికి - అప్పటి కతను చేసిన తప్పు అర్థమయుండవచ్చు. కానీ అప్పటికే చాలా ఆలస్య మయింది.

తప్పు చేసే ముందే ఆలోచించాలి. తర్వాత ఆలోచించి లాభం లేదు. □

శ్రీమతి కోరిక

కె.బి.యస్. కుమార్

"ఇవాళైనా మామిడికాయ పచ్చడి పెడదామండీ...."

అంది మా శ్రీమతి.

నా గుండె ఆగిపోయినంత పనైంది. ఈ మాసంలో నాకొన్ని అదనపు ఖర్చులున్నాయి.

"వచ్చే మాసం చూసుకుందాం లేద్దూ" అని తప్పించుకో జూశాను.

"వచ్చే మాసానికి మనం కళ్ళుజూసుకోడాని కూడా కాయలుండవ్. ఒకరి మొహం మరొకరు చూసుకో వాల్సిందే!"

"దానికేం భాగ్యం!! అలాగే చూసుకుందాంలే...." అన్నాను.

"జోకులు కట్టిపెట్టండి. సంవత్సరకాలం నిలవుండే పచ్చడి. సకాలంలో పెట్టుకోకపోతే చెడిపోగలదు. అసలు ఊరగాయ పెట్టాల్సిన సరైన సమయం ఇదే. తొలి జల్లులూ మలిజల్లులూ పడ్డాయ్. వాతావరణం చల్లబడింది. గత మాసం పెట్టివుంటే ఎండ తీవ్రతకి మగ్గిపోయి వుండేది వచ్చే మాసం పెడదామంటే మంచి కాయలు దొరకవు సరికదా పిచ్చల్లో పురుగులుపడ్డ నాసిరకంకాయలు దొరుకుతాయి. ముచ్చటగా మూడు మాసాలు కూడ నిలవున్న పాపానపోదు పచ్చడి...."

"కాత్యాయనీ, నాకు తెలీక అడుగుతాను, యిప్పుడు మనకి నిలవ పచ్చడితో పనేమిటి చెప్పు! ప్రతిరోజూ ఏదో ఒక పచ్చడి తింటూనే వున్నాంగా" అన్నాను.

అప్పుడు నన్ను పిచ్చివాణ్ని చూసినట్టుగా చూసింది కాత్యాయని.

"మీకు మతిపోయిందా ఏమిటి? పచ్చడికి మనంరోజూ దాదాపు రెండ్రూపాయలు ఖర్చుపెడుతున్నాం. అలా కాక తెగించి ఒకేసారి రెండొందలు పోసి నిలవ పచ్చడి పెట్టేశామనుకోండి - సంవత్సరంపాటు హాయిగా కాలిమీద కాలేసుకొని పచ్చడి తింటూండొచ్చు. ఎంత ఆదానో చూడండి...." ఇల్లాలన్పించుకుంది కాత్యాయని.

రోజుకి రెండ్రూపాయలు ఎలాగోలా జేబులోంచి బైటికి తియ్యొచ్చు. కాని ఒకేసారి రెండొందలు 'పచ్చడి' కోసం కేటాయించడం నాలాంటి సామాన్య సంసారులకి సాధ్యంకాదని కాత్యాయనికి తెలీదు. ఈ విషయంలో కాత్యాయన్లు సమాజంలో బోలెడు మందున్నారు.

అసలు నాకో పని కోసం కనీసం అయిదువందలు కావాలి. గత నెలే పెట్టిపలద్దామన్న డ్రా చేశాను. అనుకోకుండా బంధువు లూడిపడి - రెండొందలనవసరంగా ఖర్చు కావడంతో నా ఆలోచన్ని డ్రాప్ చేసుకున్నాను. ఈ నెల జీతంలోంచి రెండొందలూ తీసి 'ఆ'ప కోసం మొత్తం పైకాన్ని వినియోగిద్దామనుకుంటే యిదో-యిదొహటీ—

అసలే కరువు - ఆపై అధికమాసం అన్నట్టుంది. యిప్పుడు మరో రెండొందలూ ఖర్చయిపోతే ఆచారిగాడి కిచ్చినమాటేం కావాల్రా భగవంతుడా అనుకున్నాను.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" గద్దిస్తున్నట్టుగా అడిగింది కాత్యాయని.

ఏమీ లేదన్నట్టుగా తలాడించాను.

మనసంతా నీరసం ఆవహించుకుంది.

"పుదయం ఆరున్నరకల్లా కింగ్ మార్కెట్‌కి వెళ్ళి పచ్చడి కాయలు పట్టుకురండి...."

"అలాగే...." కసిగా తలాడించాను.

"పచ్చడికాయలు అంటే యివ్వరు. యిచ్చినా ఈ మహానుభావుడికి ఏమీ తెలీదనుకొని పనీషాకాయలిస్తారు."

"పనీషాకాయలో తానీషాకాయలో, పేరుచెప్పి తగలడు" అన్నాను విసురుగా.

"అబ్బ! అంతకోపం ఎందుకండీ!? ఎప్పుడూ మీ మాటే నెగ్గాలనుకుంటే ఎలా? భార్యని 'అర్ధాంగి' అని

పిలుస్తారని కూడ కాస్త గుర్తుంచుకోండి....'' అంది కాత్యాయని నవ్వుతూ.

"యింతకీ వాటిపేరు చెప్పనేలేదు....'' అన్నాను చెప్పులు వేసుకుంటూ.

"ఆచారి కాయలు అని అడగండి. వాటిలో పెద్దాచారీ చిన్నాచారీ అని రెండు రకాలుంటాయి. సైజూ ధరా చూసి పెద్దవైతే పాతికా చిన్నవైతే యాభై తెచ్చుకుంటే సరిపోతుంది. కొంపదీసి యిప్పుడే బయల్దేరుతున్నారా ఏమిటి?''

జవాబివ్వకుండా బైటపడ్డాను.

2

"ఆచారి వున్నాడమ్మా....'' అడిగాను.

"నువ్వా మోహన్! రారా....ఏమిటీ బొత్తిగా కన్పించడమే మానేశావ్?'' అంది ఆచారి వాళ్ళమ్మ.

"ఎక్కడికెళ్ళాడమ్మా!?'' అడిగాను.

"యివాళ సెలవుకదా!'' అందామె దిగులుగా.

ఆచారి మా ఫొరుగాఫీసువాడు. కాస్త విలాస పురుషుడనే చెప్పాలి. ఎప్పుడూ ట్రిమ్‌గా వుంటాడు. చాలమంది అమ్మాయిలు వాడికి సులభంగా లొంగిపోతుంటారని ప్రతీతి. వాళ్ళకోసం వాడు కాస్త అధికంగా ఖర్చు చేస్తుంటాడని వాడి ఆఫీసు బృందం లోపాయికారీగా చెప్పుకుంటూ వుంటారు. ఆ ఖర్చుకక్కావలసిన డబ్బు వాడికెక్కడినుండి వస్తుందో తెలీదు.

ఆచారిగాడికి లేని వ్యాపకంలేదు. సెలవురోజొస్తే చాలు. వాడి అడ్రసు కనుక్కోవడం కష్టం. ఎక్కడ తిరుగుతుంటాడో ఏం చేస్తుంటాడో ఎప్పుడొస్తాడో ఎవ్వరికీ తెలీదు.

ఆ విషయం తల్చుకుంటూ ఆచారిగాడి భార్యా వాళ్ళమ్మా దిగులుపడుతూంటారు.

"....సరే. నేవస్తానమ్మా. వాడొస్తే నేనొచ్చి వెళ్లానని చెప్పండి...." అన్నాను.

"అదేమిటి బాబూ! రాక రాక వచ్చావు. కాస్త కాఫీ అయినా తాగి వెళ్ళు" అందామె.

కాఫీ తాగాను మొహమాటపడుతూనే.

కాఫీ దగ్గర ముఖ్యంగా మొహమాటం పనికిరాదనీ అది కినీస మర్యాదనీ నొక్కి చెప్పిందామె.

"తెల్లవారుఝామున నేనూ ఆచారీ క్యాంపు వెళదామనుకున్నాం. కాని నా కత్యావసరమైన పనిబడింది. అందువల్ల రాలేకపోతున్నాను. ఈ విషయం వాడితో చెప్పి మరోసారి వస్తానని చెప్పమన్నట్టుగా చెప్పండి...." అన్నాను.

"వాడు వస్తే అలాగే చెబుతాను," అందావిడ.

3

ఆచారిగాడు నాకు ఫ్రెండు కావడంతో మామిడీ కాయల పేరు నాకు బాగా గుర్తుండిపోయింది. వుదయాన్నే లేచి ఏడుగంటలకల్లా మార్కెట్లో పడ్డాను.

కాయగూరలు ఒక్కో అయిటమే దిగుతున్నాయి. ఓ మూలన మాత్రం చేపల మార్కెట్టులావుంది. దాదాపు యాభై మంది గుంపుగాచేరి గట్టిగా అరుస్తున్నారు. పోట్లాటలా వుందా అరుపు. కుమ్ములాటలా వుందాదృశ్యం.

"ఏమిటాగోల? ఏదైనా యాక్సిడెంటు జరిగిందా?" ఎదురొచ్చిన మనిషి నడిగాను.

నాకేసి వింతగా చూసి, "మామిడికాయలు, చట్నీ కాయలు, ఆచారి కాయలు. మీరు వాటికోసమే వచ్చినట్ట

యితే త్వరగా వెళ్ళండి. వెధవ కాయలూ వాడూను....''
అని గొణుగుతూ వెళ్ళిపోయాడా శాస్త్రి.

''వెధవ కాయలంటూనే వెళ్ళమంటాడేమిటీ?!'' అనుకుంటూ ముందుకు సాగాను.

బాగా రష్‌గా వున్న సినిమాకి సైతం బుకింగ్‌లో దూరి టికెట్ను పట్టుకొని క్షేమంగా బైట పడగలగటం నాకు దేవుడిచ్చిన వరం. అదిప్పుడు బాగా వుపయోగపడింది.

జేబుని జాగ్రత్తగా పట్టుకొని గుంపులోకి దూసుకుపోయాను. పెద్దావారి కాయలే అన్పించింది వాటినిచూశాక. ఎందుకంటే పీచు తీసిన కొబ్బరికాయ సైజులో వున్నాయవి.

''ఎలా ఇస్తావ్ వంద?'' అడిగాను.

వాడు తిట్టాడు.

''మామిడికాయలు వంద ఎలా ఇస్తావ్ అని అడిగితే తిడతావేమిటయ్యా'' అన్నాను.

''ఏమని తిట్టాను?'' గట్టిగా అన్నాడు.

''ముండమోపి....''

''కాస్పార్! మూడువందలు,'' అన్నాడు వాడు.

''వంద ధర చెప్పమంటే వెయ్యిధర చెబుతావేం?'' అన్నాను.

అప్పుడు వాడు నన్ను వింతజంతువుని చూసినట్టు చూసి కంచరగాడిద అరుపులా నన్నాడు. ''ఎప్పుడైనా మామిడికాయలు చూసిన మొహమైతేకద! తప్పుకోవయ్యా పక్కకి?!'' అని మరొకర్ని పలకరించటంలో నిమగ్నమైపోయాడు.

నాక్కోపం వచ్చింది. కాని ఇలాంటి సమయాల్లో

మన కోపం మనకే చేటు. కిమ్మనకుండా బేరం చెయ్య బోయి మళ్ళీ చీవాట్లు తిని - యిరవై కాయలు సంచిలో వేయించుకొని పైకం వాడి చేతిలోపోసి పద్మవ్యూహం నుండి బైటపడ్డవాడిలా బైటపడ్డాను.

4

"యివాళ మీరు ఆఫీసుకి శలవుపెట్టాలి." అంది కాత్యాయని.

"ఎందుకూ?" అడిగాను.

"ఎందుకేమిటి? మామిడికాయలు తెస్తే సరిపోయిందా? ఎండు మిరపకాయలూ ఆవాలూ వగైరాలు తేవద్దూ!? ఆ తర్వాత పచ్చడి పెట్టడంలో నాకు సాయం చెయ్యొద్దూ!"

'హతోస్మి' అనుకున్నాను.

దేవుడు అనుకూలిస్తే యివాళ 'ఆ'పని గురించి శలవు పెట్టాల్సింది. వెధవది, పచ్చడికోసం పెట్టాల్సి వస్తోంది.

'ఏం చేస్తాం? విధి నిర్ణయం' అనుకున్నాను.

"ఈ మాత్రం దానికి లీవు ఎందుకు? నీక్కావలసినవి తెచ్చిచ్చి వెడతాలే" అన్నాను.

అప్పుడు కాత్యాయని గయ్యిమని లేచింది.

"బజారుకెళ్ళి తేగానే సరిపోయిందా? మామిడికాయల్ని ఎవరు కొడతారు....?"

"మామిడికాయల్ని కొట్టడమేమిటి? పాపం ఏం తప్పు చేశాయవి?"

"అబ్బా! అ కొట్టడం కాదండీ! ముక్కలుగా కొట్టాలి. తరిగితే పచ్చడి చెడిపోయే అవకాశం వుంటుంది. టెంకతో సహా తరగాలంటే మనబలం చాలదు. అందుకని మేదరివాళ్ళ కత్తి తీసుకుని నరకాలి...."

"అదెవరిస్తారు మనకి?"

"మీ ఫ్రెండు సుబ్బరాజు వాళ్ళింట్లోవుంది. అడిగి పట్రండి."

సుబ్బరాజు నా ఫ్రెండే. వన్-టవున్ పోలీస్‌స్టేషన్లో హెడ్ కానిస్టేబులు. అతని భార్య పార్వతమ్మ కాత్యాయని ఫ్రెండు.

"ఎందుకులేద్దూ....ఎవరికైనా అంతో యింతో యిస్తే వాళ్ళేవచ్చి కొట్టిపోతారు" అన్నాను.

"ఆఁ....ఎందుకూ దండగ? మనమే కాస్త కష్టపడితే ఆ డబ్బుతో ఆవాలో ఇంగువో కొనుక్కోవచ్చు...."

అప్పుడప్పుడూ కసురుకుంటానుగాని మా శ్రీమతి మంచి పొదుపరే!

"గుడ్ గర్ల్...." ఆమెపై ఓ కామెంటు పారేసి అన్ని పనులూ పూర్తిచేసుకోవడం కోసం బైలుదేరాను.

*　　*　　*

ఎండు మిరపకాయలు, ఆవాలు, మెంతులు వరసగా మా శ్రీమతి దంచివ్వగా నేను మెత్తగా జల్లించాను. టేబుల్ సాల్ట్ ప్యాకెట్లు వూడదీసి అదీ జల్లించి ఎండలో పెట్టాను. నువ్వుల నూనె బాగా కాగనిచ్చి అందులో నూరిన ఇంగువవేసి - తొట్టిలోని నీటిలో చల్లార నిచ్చింది కాత్యాయని.

గూట్లోంచి ఆవకాయ జాడీతీసి శుభ్రంగా తోమి కడిగి తుడిచి ఎండలో ఆరనిచ్చింది కాత్యాయని.

అరగంట కష్టపడి మామిడికాయలు కత్తితో నరికాను. ముందే వాటిని కూడ నీటిలో నాననిచ్చి పై జీడిని కడిగి పొడిగుడ్డతో తుడిచి బొడ్లు తరిగి సిద్ధంగా వుంచింది అప్పటికే. మామిడికాయలు 'ముక్కల' రూపం దాల్చేసరికి

మధ్యాహ్నం ఒంటిగంటైంది.

ఇక భోజనానికి లేద్దామంది కాత్యాయని. భోజనాలు కానిచ్చాం.

కాత్యాయని కంచాలూ అవీ తోముకునేలోగా ఓ కునుకు తీద్దామనుకొని ఈజీఛేర్‌లో నడుం వాల్చాను.

సాయంత్రం నాలుగ్గంటల ప్రాంతంలో లేపింది కాత్యాయని. తనుకూడ బాగా నిద్రపోయింది.

"పచ్చడి పెట్టడం అయిపోయిందా?" అన్నాను.

"ఎండ పొద్దున పెట్టకూడదుట. నారాయణమ్మ పిన్నిగారు చెప్పారు. ఆవిడెంతో మంచివారండీ! వీధిలో అందరికీ మంచి సలహాలిస్తుంటారు. పిల్చిందే తడవుగా వచ్చి మన మామిడికాయ ముక్కలకి ఏవేవి ఏయే నిష్పత్తుల్లో కలపాలో చెప్పి కొలతలు వేయించి మరీ వెళ్లారు. ఎండ తగ్గగానే ఎంచక్కా కలిపెయ్యటమే" అంది ఉత్సాహంగా.

కాఫీ మొహం కడుక్కునేసరికి నాలుగున్నరైంది. ఆ టైముకి సరిగ్గా వీధి పంపుకి నీళ్ళొస్తాయి. నీళ్ళు తెచ్చుకుంది కాత్యాయని. మిగత చిన్న చిన్న పనులన్నీ అయ్యేసరికి ఆరైంది.

నారాయణమ్మగారు మళ్ళీ వచ్చారు. ఆవిడ నేతృత్వంలో మా ఆవిడ మామిడికాయ పచ్చడి పెట్టే కార్యక్రమం నిర్విఘ్నంగా పూర్తయింది.

"తీరిందా శ్రీమతిగారి కోరిక?" చిలిపిగా అడిగాను.

మూతి మూడువంకర్లు తిప్పింది కాత్యాయని, అంతకంటే చిలిపిగా.

"సరే-గబగబా స్నానంచేసి రెడీఅవు....అలా తిరిగొద్దాం" అన్నాను.

అలాగేనంటూ వెళ్ళిపోయింది కాత్యాయని.

బూట్లచప్పుడు విన్పించి తలెత్తాను.

పోలీసులు!!

"....మోహన్ అంటే మీరేనా?" అప్రసన్నంగా అడిగాడు. యస్సై.

"అవును....మీరు" ఆగిపోయాను. మా యింటికి పోలీసుల రాక అసందర్భం అన్పించింది.

"మీకు రామానుజాచారి తెల్సా!?"

ఆచారిగాడి పూర్తిపేరు రామానుజాచారే!!

"తెలుసు" అన్నాను.

"ఈ రోజు తెల్లవారుఝామున మీ రెక్కడున్నారు?"

"ఇంట్లోనే వున్నారు."

"నిజం చెప్పండి."

"అబద్ధం చెప్పాల్సిన అవసరంలేదు." అన్నాను.

"ఆ తర్వాతెక్కడున్నారు?"

"ఇంట్లోనే వున్నాను. ఉదయం అలా బజారుపనులు చూసుకొచ్చానంతే!"

"యివాళ ఆఫీసుకి సెలవు పెట్టారు. కారణం?"

"పర్సనల్ వర్క్."

"వివరంగా చెబితే మంచిది. మీకే...."అన్నాడు ఎస్సై.

"మా శ్రీమతి మామిడికాయ పచ్చడి పెట్టాలంది. మాకు యింట్లో వేరే పెద్దాళ్ళెవ్వరూ లేరు. అంచేత శలవు పెట్టి ఆమెకి సహకరిస్తూ వుండిపోయాను." చెప్పాను.

"ఇందుకు సాక్షులున్నారా?" అన్నాడు ఎస్సై, కాస్త తగ్గి.

"బ్రహ్మాండంగా. వుదయం కాయలు కొనడానికి వెళ్లాను. వాడు మీకు సాక్ష్యం చెప్పగలడు. ఆఫీసుకి స్వయంగా వెళ్ళి వాచ్ మన్ కి లీవ్ లెటర్ యిచ్చి వచ్చాను.

పచారీ కొట్లో సరుకులు కొన్నాను. వన్‌టవున్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఇంట్లో మామిడికాయలు నరికే కత్తి పట్టుకొచ్చాను....యిదిగో చూడండి జీడి తగిలి ఎడమచేతి వ్రేళ్ళు నల్లగా అయ్యాయి. మామిడికాయ ముక్కలు నేలపై ఆరబోసినప్పుడు వాటిలో సిట్రిక్ ఆసిడ్ తగిలి నేలపై తెల్లని మరకలయాయి. ఇంకా ఇరుగు పొరుగుల సైతం నేనింట్లో వున్నట్టు సాక్ష్యం చెప్పగలరు.'' అన్నారు, ఎడమచేతిని చూపిస్తూ.

నల్లగా మారిన వ్రేళ్ళని చూసి పూర్తిగా సంతృప్తి చెందాడు సబ్-ఇన్స్పెక్టర్.

విషయమేమిటని అడిగాను. ఎస్సై చెప్పింది విని అదిరి పడ్డాను.

ఆచారిగాడు యివాళ తెల్లవారుఝామున దొంగనోట్లు తీసుకోబోతూ పట్టుబడ్డాడు రెడ్‌హ్యాండెడ్‌గా. ఎవరో ఇన్‌ఫర్మేషన్ ఇవ్వటంతో పోలీసులు పట్టుకున్నారు.

నేను ఆచారిగాణ్ని కలవనందున నేనే రిపోర్టు ఇచ్చి వుంటానన్న కసితో వాడు నా పేరు కూడ వెల్లడించాడు. పోలీసులు ముందుగా మా ఆఫీసుకి వెళ్ళి, నేను శలవు పెట్టడంతో మరింత అనుమానించి యిప్పుడింటికొచ్చారు.

ఎస్సై నాకు సారీ చెప్పి తన బలగంతో వెళ్ళి పోయాడు.

నాలో వణుకు ఇంకా తగ్గలేదు. మైగాడ్: ఆచారిగాడు నన్ను అయిదువందల రూపాయలు తీసుకురమన్నది ఇందుకా! వన్ ఈస్టూ స్త్రీలో దొంగనోట్లు పంచుతున్నారని ఇటీవల చూచాయగా విన్నానేన్నను.

ఆచారిగాడు తన అనవసర ఖర్చుల నిమిత్తం ఈ పద్ధతిలో డబ్బు సంపాదించాలనుకున్నాడు. తనసీ-విషయం చెప్పకుండా పురిగొల్పాడు.

కాత్యాయని పచ్చడి విషయంలో పట్టుబట్టకుండా ఉండి వుంటే ఆచారిగాడితో బాటు నేనూ వెళ్ళివుండేవాడిని. వాడితోబాటు నేనూ....

ఆ వూహ-తల్చుకోడానికే భయంగా వుంది.

....స్నానం చేసి బాత్రూమ్‌లోంచి బైటికి వస్తోన్న కాత్యాయని నా కళ్ళకి దేవతలా కన్పించింది.

దొంగనోట్లు స్మగ్లింగ్ కేసుల్తో సంబంధమున్న వ్యక్తిగా ఆచారిగాడి ఫోటో మర్నాడువయం పేపర్లో వచ్చింది. □

పోలికలు!



శత్రువు శవం

భీమవరపు పురుషోత్తం

బార్‌లో నుండి బయటికి వచ్చాను—

కాస్త మైకంగా ఉంది. ఎప్పుడూ ఆ కొద్దిపాటి మైకం ఉండడమే నా కిష్టం.

టైమ్ చూశాను. పది దాటింది.

బార్ బయట ఖాళీస్థలం విశాలంగా ఉంది. చాలా కార్లు

ఆగిఉన్నాయి. బార్ కొద్ది రష్‌గా ఉండడం గుర్తొచ్చింది నాకు. ముందుకు నడిచాను. మసక చీకటిలో బ్లాక్ అంబాసిడర్ కారు నాకోసం ఎదురుచూస్తుంది. డోర్ తెర్చి కూర్చున్నాను.

వెంటనే కీ హోల్‌కే గుచ్చివున్న తాళాలపై పడింది నా దృష్టి. "ఓహ్" అనుకొన్నాను అప్రయత్నంగా! తాళాలు కారులోనే మర్చిపోయి వెళ్ళిపోయినట్టున్నాను. చాలా సంవత్సరాలనుండి అప్పుడప్పుడూ ఇలా మర్చిపోతుంటాను నేను.

వాతావరణం చల్లగా ఉండడం గమనించాను. రెండు సార్లు కీ తిప్పితేగాని కారు స్టార్టవదు. తిప్పాను కీ. వెంటనే స్టార్టయింది! ఆశ్చర్యం వేసింది నాకు కొద్దిగా.

ముందుకు కదిలిందికారు గేరుమార్చాక. రోడ్డు దీపాలు అక్కడక్కడ వెలుగుతున్నాయి. సైడ్‌గ్లాసెస్ కొద్దిగా తెర్చి ఉండడంవల్ల ఈదురుగాలి శరీరాన్ని తాకుతూ గిలిగింతలు పెడుతూంది. కారు వేగంగా వెళుతున్నా భారంగా వుంది! బరువు ఎక్కువగా ఉన్నట్టు!!

పదిహేను నిమిషాల్లో ఇల్లు వచ్చేసింది. దాదాపు చీకటిగా ఉంది ఆ ప్రాంతమంతా. మా ఇంటికి అటూ ఇటూ ఇళ్ళున్నా చుట్టూ పిట్టగోడ అడ్డు.

ఇంటి ఎదురుగా రోడ్డు, ఇరకుగా సందులా ఉంటుంది. చిన్న డాబా ఇల్లు మాది. కారాపడానికి వీలుగా ఇంటికి కొద్ది పక్కగా ఖాళీస్థలం వుంది.

కారు పార్క్ చేసి, తాళంతీసి లోపలికి అడుగుపెట్టాను. మా ఆవిడ లేదు. పుట్టింటికి వెళ్ళింది. మూడ్రోజులయింది వెళ్ళి. పిల్లవాడి కూడా తీసుకువెళ్ళింది. అసలు మా ఆవిడ ఉంటే బార్‌లో ఇంతసేపు ఉండి ధీమాగా

రాను ఇంటికి. ఎప్పుడో ఒక్కోసారి గుంభనంగా వెళ్తుంటాను. అయినా దానికి తెలుస్తూనే వుంటుంది.

లైట్లువేసి కాళ్ళూ చేతులూ కడుక్కొన్నాను. కాసేపటికి వీధి అవతలివైపు, మా ఇంటికి సరిగ్గా ఎదురుగావున్న ఇంటినుండి లైట్లు వెలిగాయి.

సరిగ్గా ఒక్క నిమిషం తర్వాత పదిహేనేళ్ళ ఎదురింటి వాళ్ళమ్మాయి స్టీలుకారియర్ వట్టుకొచ్చింది. హోటల్ భోజనం నాకు సరిపడదు. ఎదురింటి వాళ్ళు మాతో బాగా కలసిమెలసి వుంటారు. అందుకే ఈ నాలుగురోజులు కేరియర్ పంపటానికి ఒప్పుకొన్నారు.

"సారీ సుజా లేటయినట్టుంది" ఆ అమ్మాయిపంకచూస్తూ చెప్పాను. మాటలు ముద్దగా రాకుండా జాగ్రత్తపడ్డాను.

సుజాత పెదాలు విచ్చుకొన్నాయి అందంగా. "పర్లేదు అంకుల్ పదిన్నరేగా అయింది." ప్రశాంతమైన కళ్ళతో అదే నవ్వుతో మళ్ళీ అంది "తాగారా ఎక్కువగా!"

టేబుల్‌మీద ప్లేట్లు సర్దుతూ చెప్పింది "మా అమ్మ విన్నట్టుంది కారుశబ్దం. నన్ను లేపి చెప్పింది."

మాట్లాడలేదు నేను. తల వంచుకొని తినడంలో విమగ్నమయ్యాను. బాగా ఆకలిగా వుంది. తినేదాకా మౌనంగా చూసి, తర్వాత చప్పుడు కాకుండా గిన్నెలు కడిగి కారియర్ సర్దుకొంది.

"వెళ్తాను" చెప్పింది.

"గుడ్‌నైట్"

"గుడ్‌నైట్" అని వెళ్ళిపోయింది.

'మంచి నిద్రపడుతుంది' అనుకొంటూ తలుపులు వేసి, లైట్లు ఆర్పి పక్కమీదికి వాలాను. నిద్రపోయే ముందు సాధారణంగా వచ్చే ఆలోచనలు వస్తున్నాయి.

ఇంట్లో నా గదిలో వాడడానికి ప్లాస్టిక్ డస్ట్‌బిన్ కొన్నాను సాయంత్రం. కారులో వదిలేసానది. డిక్కీలో! తీసి లోపల పెట్టేయాలి. రేపు మర్చిపోతాను.

విసుగ్గా లేచాను. కారు తాళాలు అందుకొని బయట లైటుకి స్విచ్చి నొక్కి తలుపుతీసి కారుదగ్గరికి నడిచాను. లైటుకాంతికి నా నీడ పొడుగ్గా పడుతూంది కారుమీద! ఎదిరింట్లో చీకటిగా ఉంది. అంతా నిశ్శబ్దంగా ఉంది. ఇందాక నేను వచ్చేటప్పటికి లాగానే!!!

వంగి, తాళంతిప్పి డిక్కీ తెరిచాను?!!?

సర్రున ఫిరంగిగుండు మొహంమీదికి దూసుకొని వచ్చినట్టు అప్రయత్నంగా వెనక్కి రెండడుగులు తూలాను. గుండె ఝల్లుమంది.

2

కొద్దిక్షణాలు అచేతనంగా ఉండిపోయాను. అప్పటికే చమట్లు శరీరం అంతా ఆక్రమిస్తున్నాయి. చేతివేళ్ళు వణుకుతున్నాయి నాకు తెలీకుండానే!!

డిక్కీలో ఏదో ఆకారం పడుకొని ఉండడం మొదటి క్షణంలోనే అర్థమైంది నాకు! కానీ నన్ను మరింత భయ పెట్టిన కారణం—అ ఆకారం నల్లగా మాడిపోయి ఉంది కాలిపోయినట్టు. బహుశా అది శవం కావచ్చు!?! పెదాలు బిగదీసికొ పోయి తెల్లటి పళ్ళు మెరుస్తున్నాయి.

ఏమిటీ దారుణం! ఇలాంటి స్థితి ఎదురౌతుందని ఏనాడూ నేను ఊహించనయినా ఊహించలేదు కూడా.

చుట్టూ చూశాను బెరుగ్గా. అక్కడక్కడ దూరంగా రెండుమూడు లైట్లు మాత్రమే కనిపిస్తున్నాయి. ఆ క్షణం నాకో అనుమానం వచ్చింది. నన్నేడిపించడానికి ఎవర యినా ఇలా చేశారేమో? కేవలం ఆటపట్టించడానికి ఇలాం

టివి చేసేవాళ్ళెవ్వరు!?

ఒకవేళ పాతశత్రువు లెవరయినా....జగదీష్ మినహా శత్రువులు లేరు నాకు. వాడికి ఇలాంటివి చేసే అవసరం లేదు!

అసలిది డిక్కీలోనికి ఎలా వచ్చింది? బార్‌కి వెళ్ళే ముందు డస్ట్‌బిన్ కాని నేనే డిక్కీలో వుంచాను దాన్ని.

చటుక్కున గుర్తొచ్చింది?! బారు వెలుపల పార్క్ చేసినప్పుడు తాళాలు కారులోనే మర్చిపోయి....మై గాడ్! అప్పుడుగానీ ఎవరయినా కారు తీసికొనిపోయి, ఈ అఘాయిత్యానికి నా కారు వాడుకొన్నారా?!

చెప్పలేనంత నిస్సత్తువ ఆవహించింది నన్ను. ఊబిలో ఇరుక్కుపోయాను. ఇప్పుడీ శవాన్ని ఏం చేయాలి?

పోలీస్ కంప్లెయింట్ ఇస్తే. అమ్మో రిస్కు! శవాన్ని వదిలించుకోవడం కంటే పెద్ద రిస్కు అది!! బీచ్‌కెళ్ళి సముద్రంలో పడేస్తే పోలీస్‌వాన్ తిరుగుతుంటుందా టైమ్‌లో. దొరికితే మొదటికే మోసం వస్తుంది.

ఎవరూ చూడకుండా జాగ్రత్త పడాలి ముందు. వీలయితే రేపు వదిలించుకోవచ్చు. అంతవరకూ ఎక్కడయినా దాయాలి - ఇంట్లోనే!

గుండె చిక్కబట్టుకొని ధైర్యం తెచ్చుకొని పరీక్షగా చూశాను శవాన్ని. శరీరమంతా నల్లగా కాలి వున్నా, బట్టలు మాత్రం ఉతికినవి తొడిగి వున్నాయి. అంతకంటె ఎక్కువగా చూడలేకపోతున్నాను దాన్ని. ఇంత ఒంటరి ప్రదేశంలో అలాంటి దృశ్యం చూడవలసి రావడం నిజంగా నా దురదృష్టం! వెంటనే వెళ్ళి లైటు తీసేశాను.

లోపలికి వెళ్ళి దుప్పటి ఒకటి తీసుకొని వచ్చాను. వణుకుతున్న చేతులతో శవం చుట్టూ చుట్టాను దాన్ని.

కొద్దిగా వాసన వేస్తూంది ఏదోలా! అసహ్యంతో ఒళ్ళు జలదరిస్తూండగా భుజానికెత్తుకొన్నాను.

మామూలు శరీరానికంటె కొద్ది బరువు తక్కువగా ఉంది!! పళ్ళ బిగువున మోస్తూ, హాల్లోకి తీసుకొని వచ్చి పడేశాను. అప్పటికే చమటతో బట్టలు తడిసి పోయాయి నాకు. లైటు వేశాను. ఎక్కడ దాయాలి? వాసన భరించలేం ఎక్కడ దాచినా!

ఎదురుగా ఉన్న ఫ్రిజ్ నా చూపుల్లో పడింది. ఆలస్యం చేయలేదు. వేగంగా ఖాళీ చేసేశానది. శవాన్ని జాగ్రత్తగా ఫ్రిజ్ లోపలికి చేర్చాను, దుప్పటితో సహా. కాళ్ళూ చేతులూ కొద్దిగా ముందుకి వచ్చి వికృతంగా కనిపిస్తున్నాయి బయటికి! ఫ్రిజ్ లాక్ చేసి నిట్టూర్చాను.

ఒళ్ళంతా నీళ్ళతో కడుక్కొన్నాను. ఇంకా వణుకు తగ్గలేదు నాకు. పది నిమిషాల తర్వాత, పక్కమీద వాలి పడుకొన్నాను. కళ్ళు మూసుకొని.

ఎప్పుడో పట్టింది నిద్ర తెల్లవారుజామున.

3

ఉలిక్కిపడి లేచాను—

కళ్ళు తెరవగానే ఎదురుగా అందమైన సుజాత ముఖం కనిపించింది. ఇంకా తట్టుతుంది నన్ను. "అంకుల్ లేవండి."

ఆమె వంక చూశాను. తల స్నానం చేసినట్టుంది. వత్తయిన జుట్టుకి మధ్యగా రిబ్బన్ కట్టింది. ఆకుపచ్చ రంగు పరికిణీ జాకెట్టులో వుంది.

బద్ధకంగా లేచి నిలబడ్డాను. ఒళ్ళంతా నొప్పులుగా వుంది. రాత్రి సరిగా నిద్ర లేకపోవడంవల్ల! టేబుల్ మీద టైంపీస్ వంక చూశాను. తొమ్మిదిన్నర. పదింటికే

ఆఫీస్.

"ఎప్పుడూ లేంది ఈ రోజేమిటి ఇంతవరకూ పడు కొన్నారు?" సుజాత అడుగుతూంది. రాత్రి సంఘటన అంతా కళ్ళ ముందు జరిగినట్టు మరలా గుర్తొచ్చింది నాకు, ఆ అమ్మాయి అలా అడుగుతూంటే:

త్వరగా మొహం కడుక్కొని స్నానం చేశాను. రాత్రి తాలూకు భయం ఇంకా పోలేదు నాలోంచి. డైనింగ్ టేబుల్ దగ్గరికి వస్తూ చటుక్కున నిలబడిపోయాను శిల్పంలా—

సుజాత ఫ్రిజ్‌ను పిన్నిస్‌తో తెరవడానికి ప్రయత్ని స్తూంది.

"ఏ....ఏమిటీ?" అర్చాను.

నా వంక వింతగా చూస్తూ అడిగింది. "తాళం ఎక్కడ పెట్టావంకుల్? ఇల్లంతా వెదికినా దొరకలేదు."

"ఏం కావాలి?" తెల్లబోయి చూస్తున్న సుజాత ముఖం చూసి గ్రహించాను, కంగారులో నేనెంత గట్టిగా మాట్లాడుతున్నది. "ఏం కావాలమ్మా" మృదువుగా అడి గాను కాస్త చిరునవ్వు కలుపుతూ.

"టిఫిన్ తిన్నాక మీకు ఆమ్లెట్ వేయాలిగా, గుడ్లు ఫ్రిజ్‌లోనే ఉన్నాయి."

"అంతేకదా! అవన్నీ వంట గదిలో వున్నాయి. వెళ్ళి తీసుకో" అని అన్యమనస్కంగా, సుజాత తెచ్చిన టిఫిన్ ముగించాను. కాసేపటికి ఆమ్లెట్, కాఫీ పట్టుకొచ్చింది. కాఫీ చాలా బాగా చేసింది.

బట్టలు వేసుకొని తయారవబోతూండగా అడిగింది. "ఫ్రిజ్‌లో సామానంతా వంట గదిలోనే పెట్టారేమిటీ?"

తడబాటును కప్పుతూ చెప్పాను "ఫ్రిజ్ పాడయింది.

కనీసం రెండు రోజులన్నా అలా ఉంచాలి."

ఇంకేం అడగలేదు సుజాత. గిన్నెలు కడిగి తీసుకొని వెళ్ళిపోయింది. నాకు తెలుసు ఆ అమ్మాయి అమాయకురాలు. ఎక్కువగా ఆలోచించలేదు.

ఇల్లు తాళం వేసి కారు స్టార్టువేసి ఆఫీసుకి పోనిచ్చాను. వెళ్ళేసరికి పదిన్నర అవుతూంది. ఆ పెద్ద ఫర్మ్‌లో మేనేజింగ్ డైరెక్టర్ని నేను.

పదకొండున్నరవరకూ ఫైల్సు చూశాను. నా ఆలోచనలు ఎక్కువ భాగం ఇంటిలో ఫ్రిజ్ చుట్టూనే తిరుగుతున్నాయి. తలంతా దిమ్ముగా ఉంది!

నలుగు రయిదుగురు క్లర్కులు గత ఆరు సంవత్సరాలు తమకు ఇంక్రిమెంట్లు లేవని వ్రాసుకొన్నారు. మిగతా చిన్న ఉద్యోగస్తులు ఎన్నో ఏళ్ళుగా సంస్థకు లాభాలొస్తున్నా, జీతాలు పెంచడం మాట అటుంచి కనీసం బోనస్‌లు కూడా ఇవ్వడం లేదని అర్జీలు పెట్టారు. వాటన్నింటినీ తీసి పక్కనపెట్టి మిగతా ఫైల్సు అందుకొన్నాను!

అలాంటి విన్నపాలు పట్టించుకోను నేను!!

ఫోన్ మ్రోగింది—

రిసీవర్ అందుకొన్నాను. "హలో, గోపాలరావు స్పీకింగ్!"

"ఏరా గోపాలరావ్! ఎలా ఉన్నావ్?"

నా కనుబొమ్మలు ముడిపడ్డాయి. ఇద్దరే 'ఏరా' అని పిలిచే స్నేహితులున్నారు నాకు. అందులో ఈ గొంతు ఎవరిదీ కాదు.

"ఎవరూ?" గట్టిగా అడిగాను. గొంతులో కాస్త కర్కశత్వాన్ని కలిపి.

"శవాన్ని ఏం చేశావ్?"

4

త్రుళ్ళిపడ్డాను. నాలో రక్తప్రసరణం హెచ్చింది.

"ఏం శవం!" ఆశ్చర్యంగా అడగడానికి ప్రయత్నించాను.

నవ్వు వినబడుతూంది అవతల నుండి "లాభం లేదు గోపాలరావ్."

నిర్లక్ష్యంగా అడిగాను "ఇప్పుడేమిటంటావ్?"

"పోలీసులకు ఫోన్ చేస్తే నీ గతి ఏమిటో ఆలోచించుకోమంటాను. రాత్రి నువ్వు శవాన్ని కారు డిక్కీలో నుండి ఇంటి లోపలికి తీసుకు వెళ్ళడం చూసాను చీకట్లో నుండి. నువ్వా శవాన్ని అంగుళం కదిపినా తెలిసిపోతుంది నాకు."

అవతల వ్యక్తి స్వరం దూరంగా ఉన్న మైక్‌లో నుండి వినిపిస్తున్నట్టుంది. బహుశా ఏ కర్చీపో అడ్డుపెట్టి ఉంటాడు.

"నేనేం నేరం చేయలేదు. ఎందుకు భయపడాలి పోలీసులకు" అనుకొన్నంత ధైర్యంగా అడగలేకపోయాను.

"నువ్వు నేరం చేయలేవన్న విషయం నాకూ తెల్సు. శవం నీ యింట్లో ఎందుకుందంటే పోలీసులకు ఏం చెబుతావ్? ఒకవేళ జరిగింది చెబితే వాళ్ళు నమ్ముతారా! మొదటే స్టేషన్‌కి రాకుండా ఇంట్లో ఎందుకు దాచావంటే నీ సమాధానం ఏమిటి?

"ముఖ్యమైన విషయం. నీ పాత శత్రువు జగదీష్ తమ్ముడు ఈమధ్యే ఇంట్లోంచి ఎక్కడికో వెళ్ళిపోయాడు ఏవో గొడవలొచ్చి. అది నీకూ తెలుసు. వాళ్ళు రిపోర్టు కూడా ఇచ్చారు.

ప్రస్తుతం నీ ఇంట్లో శవంగా ఉంది జగదీష్

తమ్ముడే! కొందమంది రౌడీలు డబ్బుకోసం అతడ్ని చంపి, శవాన్ని కాల్చిపడేశారు గుర్తుపట్టకుండా.

జగదీష్‌కి ఈ విషయం తెలియబ‌ఁస్తే అతడు నిన్ను వదుల్తాడా?! ఆలోచించుకో. కేవలం రెండు ఫోన్లతో నిన్ను కటకటాలు లెక్కపెట్టేలా చేయగల్ను" అవతలి వ్యక్తి తాపీగా చెప్పాడు విషయమంతా.

అర్థమైంది నాకు. ఉచ్చులో ఇరుక్కున్నాను పూర్తిగా. మొదట శవం కనిపించగానే పోలీసులకు తెలియబర్చక పోవడమే నేను చేసిన పెద్ద పొరపాటు!!

"ను....నువ్వేకదూ శవాన్ని నా డిక్కీలో ఉంచింది?"

"అది అప్రస్తుతం. శవాన్ని యథాతథంగా వాపసు తీసుకుంటాను. నీ సమస్య చిటికెలో తొలగిపోతుంది."

"ఎంతివ్వాలి అందుకు?" ఏడుస్తున్నట్టు అడిగాను.

"వెరీగుడ్! ఇప్పుడు దారికి వచ్చావ్. ముప్ఫయి వేలివ్వు. చాలు!"

"ముప్ఫయి వేలా!?" కీచుగా అర్చాను.

"నాకు తెల్సు. నువ్వెంత పిరికివాడివో అంత భయస్తుడివి. నే నడిగింది నీ ప్రాణం ఖరీదు. సరే పాతికకు ఖాయం చేస్తున్నాను. ఇంకేం మాట్లాడకు.

ఈ రోజు రాత్రి ఎనిమిదింటికి కాకుండా, తొమ్మిదింటికి బార్‌కి రా. వచ్చేటప్పుడు, ఆ శవాన్ని మళ్ళీ డిక్కీలో వేసేసి, దానితోపాటే పాతికవేలు కూడా డిక్కీలో ఉంచు. తాళాలు మునుపటిలాగానే కారులో మర్చిపో.

బార్‌లో పదిన్నర వరకు కూర్చో. తరువాత బయటికి వచ్చి హాయిగా ఇంటికిపోవచ్చు నువ్వు. బార్‌లో పోలీసులకు ఫోన్ చేయడం లాంటి పిచ్చిపనులు చేస్తే- కేవలం

సి కారు, అందులో శవం మాత్రమే పోలీసులకు పట్టు బడతాయి" ఫోన్ పెట్టేశాడు అవతలి వ్యక్తి.

"రాస్కెల్" స్వగతంగా తిట్టుకొన్నాను.

జగదీష్ తమ్ముడు ఇంట్లోంచి వెళ్ళిపోయాడన్నది నిజమే. వాడెవడో నా గురించి పూర్తిగా తెలిసినవాడే అయ్యుంటాడనిపించింది. ఎక్కడ ఇరికించాలో అక్కడ ఇరికించాడు. ప్రస్తుతం వాడడిగింది ఇవ్వటం తప్ప, శవం పక్కలో పెట్టుకొని నేను చేయగలిగింది ఏం లేదు.

5

రాత్రి ఎనిమిదిన్నర అయింది—

బార్‌కి తయారయ్యాను. అనుకొన్నట్టే సుజాత వచ్చింది. "ఇదేమిటి అంకుల్, ఇవాళ ఇంత లేటుగా వెళుతున్నారు బార్‌కి?" అడిగింది. నేను తాగుతానన్న విషయం సుజాత ఇంట్లో కూడా సరిగ్గా తెలీదు. సుజాతకి తెలుసు. కానీ ఎవరికీ చెప్పదు.

"ఆఫీసులో పనెక్కువగా వుందమ్మా ఇవాళ."

"మ్యాగజైన్సు ఉంటే ఇవ్వండి. రాత్రి మీరొచ్చే టప్పటికి నిద్ర పట్టేస్తుంది-పైగా ఇవాళ లేటుగా వెళు తున్నారు కూడా."

నాలుగు మ్యాగజైన్సు బీరువాలో నుండి తీసిచ్చాను. చదువుతూ అక్కడే కూర్చుంది.

"నేను వెళ్ళాలమ్మా బార్‌కి" నసిగాను.

"వెళ్ళండి అని ఆశ్చర్యంగా చూసింది. ఇంతలో వాళ్ళమ్మ పిలిచింది. "త్వరగా రండి" అంటూ వెళ్ళి పోయింది. నిట్టూర్చాను.

వెంటిలేటల్ ఇరుకులో దాచిన ఫ్రిజ్ తాళం తీసాను. వరండాలో లైటు ఆర్పేశాను. ఫ్రిజ్ తెరిచాను.

శవం ఎప్పటిలాగానే ఉంది. మెల్లగా భుజాని కెత్తు కొని విక్రమార్కుడిలా బయటికి వచ్చాను. చల్లగా ఉంది దుప్పటి.

కారు దగ్గర మసగ్గా పడుతూంది కాంతి. శవాన్ని డిక్కీలో సర్దేశాను. మధ్యాహ్నం బాంకు నుండి డ్రా చేసిన పాతికవేలు పేపర్ం చుట్టి డిక్కీలో ఉంచి తాళం వేసేసాను. కళ్ళ నీళ్ళు తిరిగాయి నాకు పాతికవేలు డిక్కీలో ఉంచుతూంటే.

ఇల్లు తాళంవేసి బయలుదేరాను. బారు వెలుపల ఆపాను కారు. తాళం అలాగే వదిలేసి లోపలికి నడిచాను. జీవితంలో ఇంకెప్పుడు అలా తాళం వదలకూడదని భీష్మ ప్రతిజ్ఞ చేసుకొంటూనే!

పదిన్నరయింది. మెల్లగా లేచాను. ఎక్కువగా తాగ లేదు, టెన్షన్‌గా ఉండడంవల్ల. బయటికి వచ్చాను.

మసక చీకటిలో కారు కనిపిస్తూంది. గబగబా నడి చాను. ముందు డిక్కీ తెరచాను. లాక్ చేయలేనట్టుంది తెరుచుకొంది వెంటనే.

ఖాళీగా ఉంది.

కొద్ది రిలీఫ్ వచ్చింది. డోర్ తీసి తాళాలు అందు కొన్నాను. డిక్కీ లాక్ చేసేసి, కారు స్టార్టుచేసి పోని చ్చాను. చలిగాలి గిలిగింతలు పెడుతుంది దేహాన్ని.

ఇంటికి వెళ్ళగానే ఫోనొచ్చింది.

“గోపాలరావ్! మేమెవరో కాదు - ఇంక్రిమెంట్లు, బోనస్‌లు లేవని లాభాలొచ్చినా జీతాలు పెరగడం లేదని,

ఎన్నోసార్లు ఎన్నో సంవత్సరాలుగా నీకు వ్రాసుకొన్నాం. వాటిని చింపి చెత్తబుట్టలో వేస్తూనే వచ్చావు ఎప్పటి కప్పుడు. పైగా గట్టిపట్టు పట్టామని, ప్రొప్రయిటర్‌కి రిపోర్టు పంపి, మమ్మల్ని ముగ్గుర్ని ఆరు నెలల క్రితం ఏదో సాకుతో ఉద్యోగంలో నుండి తీసివేయించావ్.

దాదాపు ఎనిమిదేళ్ళు మాకు సంస్థనుండి రావల్సిన దానికంటే కాస్త తక్కువే తీసికొన్నాం నీ దగ్గర.

పోతే నీ చపటాయ్ తనానికి జాలేస్తుంది! ఎందుకో తెలుసా! రెండు మూడొందలు పారేస్తే ఏ కెమికల్‌లాబ్‌లో నయినా రహస్యంగా - నిన్న రాత్రి నువ్వు చూసిన శవం తయారు చేసిస్తారు కృత్రిమంగా. బరువు, వాసన, రంగు అన్నీ మనకి కావలసిన విధంగా!!!...."

అంతే! నా చేతిలోని రిసీవర్ జారిపోయింది. □

భయం!!

కలర్ టీవీ

జొన్నలగడ్డ రామలక్ష్మి

కలర్ టెలివిజన్ కొనమని మా ఆవిడ ప్రాణాలు తోడేస్తోంది.

మా యింట్లో టెలివిజన్ లేదు. కొంటే కలరు కొనాలి గానీ బ్లాకండ్ వైటెందుకూ అన్నాను నేను. కలరుది కొనాలంటే ఎనిమిది వేలు కావాలి. అంత డబ్బు ఒక్క

సారి ఎక్కణ్నించి తేగలను?

ఓ ఏడాదిపాటెదురు చూసింది మా ఆవిడ.

మా పొరుగింటి వాళ్ళకి టీవీ ఉంది. బ్లాకండ్ వైట్. వాళ్ళు చాలా మంచివాళ్ళు. మంచి ప్రోగ్రాం ఏదొచ్చినా మమ్మల్ని పిలుస్తారు.

టీవీ గురించి వాళ్ళింటికి చాలామంది వస్తూంటారు.

వాళ్ళవల్ల తనకు కలుగుతున్న యిబ్బందులన్నీ పొరుగింటావిడ మా ఆవిడకు గొప్పగా చెప్పుకుంటుంది.

నిజానికావిడకు వచ్చేపోయేవాళ్ళంటే ఇబ్బంది లేదు. తనింటికి లభించిన ప్రాధాన్యత గురించి ఆవిడ చెప్పుకునే పద్ధతి అది.

"టీవీ లేదు వదినగారూ - నిజంగా మీరు అదృష్టవంతులు" అంటుందావిడ తరచుగా.

మా ఆవిడకు ఆవిడ మాటల్లో అభినందనకు బదులు జాలి కనపడుతుంది.

"మీరు మంచివాళ్ళు కాబట్టి ఇబ్బంది పడుతున్నారు గానీ - ఆ రామారావుగార్ని చూడండి. వాళ్ళింటికొక్కరయినా వెడుతున్నారా?" అంటుంది మా ఆవిడ.

రామారావుగారి కుటుంబం తరచుగా అందరి నోళ్ళలోనూ ఆడుతూంటుంది. ఆయన తన చుట్టూ వున్నవారి కోసం కాక తన కోసమే జీవిస్తూంటాడు. ఊళ్ళో టీవీ రాగానే అందరికంటే ముందాయనే టీవీ కొన్నాడు. చూడ్డానికి రమ్మని కూడా ఎవర్నీ ఆహ్వానించలేదు.

అయినా కొందరు వెళ్లారు.

"నాకు టీవీ ప్రోగ్రాములంటే చాలా ఆసక్తి. అందుకే ఇది కొనుక్కున్నాను. ఆసక్తి ఉన్నవారు వచ్చి నిశ్శ

ద్దంగా చూసి వెళ్ళొచ్చు" అన్నాడాయన మొట్ట మొదటి రోజునే.

సినిమా హాల్లోలా నిశ్శబ్దంగా కూర్చొని టీవీ చూడ్డం ఎవరికి సాధ్య పడుతుంది?

క్రమంగా ఆయనింటికి జనం తగ్గిపోయేరు.

ఈలోగా ఆ వీధిలో మరికొందరు టీవీలు కొన్నారు. వారిలో మా పొరుగింటావిడ ఒకతె.

ఆవిడలో విశేష మేమిటంటే - టీవీ వున్నా లేకపోయినా తను మాత్రం ఏదో మాట్లాడుతూనే వుంటుంది. టీవీ ప్రోగ్రాములవుతూంటే-అంతకు ముందు ప్రోగ్రాముల గురించి చెబుతూంటుంది.

మా ఆవిడకు ఆవిడింట్లో టీవీ చూడ్డమే యిష్టం. ఎందుకంటే కబుర్లు చెప్పుకుంటూ టీవీ చూడొచ్చు.

తను టీవీ కొనుక్కున్నాక ఆవిడలా కబుర్లు చెప్పాలని మా ఆవిడ మనసు. అందుకని ఆవిడ మాటలన్నీ ఓ పుస్తకంలో రాసుకోవడం మొదలెట్టింది.

ఏడాదిలో ఇప్పటికి మూడు బైండు పుస్తకాలై పోయాయి.

మేమింకా టీవీ కొనుక్కోలేదు.

మా ఆవిడ కోపమంతా నామీదే.

అన్నింటికీ మించి తనకింకో అవమానం....

ఊళ్ళో ఇప్పుడు టీవీ జబ్బు చాలామందికి పట్టుకుంది.

మా యింటి కెవరయినా వస్తే - అయిదున్నర కాగానే "మీ యింట్లో టీవీ లేదుకదూ - ఆరింటికల్లా టీవీ వచ్చేస్తుంది. ఉంటాం మరి" అంటూ లేచి వెళ్ళిపోతున్నారు.

వాళ్ళలో కొందరు టీవీలున్నవాళ్లు. కొందరు టీవీ

లున్నవాళ్ళింటి కెళ్ళేవాళ్ళు.

మా పొరుగింటావిడకు నేను నిజంగానే కలర్ టీవీ కొనేస్తానేమోనని భయం. అప్పుడు తన టీవీ విలువ తగ్గిపోతుంది గదా....మా వీధిలో కలర్ టీవీ లెవరికీ లేవు. నేనూ కొనలేను. ఊరికే మా ఆవిడను మరిపించడానికి అన్నాను. చెప్పాలంటే బ్లాకండ్ వైటే కొనలేను.

నేను డబ్బులు పోగుచేసేస్తున్నానేమోనన్న భయంతో మా పొరుగింటావిడ నాకు సమయం చిక్కకుండా చేయాలని రోజూ మా ఆవిడతో-మగాళ్ళకు లక్ష కాలక్షేపాలు. టీవీ ఆడాళ్ళకే కావాలి. కలర్ టీవీ అంటే డబ్బుతో పని. మనబోటి గాళ్ళ కది సాధ్యపడదు. మీ ఆయన కసలు టీవీ కొనడం ఇష్టం లేక అలా దాటేస్తున్నాడని నా నమ్మకం. అయినా అదే మంచిది. ఈ రోజుల్లో టీవీ లేకపోవడమే ఒక అదృష్టం" అని పురి ఎక్కించేది.

ఏడాది గడిచినా నేను కలర్ టీవీ కొనకపోయేసరికి మా ఆవిడ పొరుగింటావిడ మాటలు నమ్మడం మొదలు పెట్టి-నన్ను సాధించసాగింది.

"కలరక్కరలేదు. బ్లాకండు వైటే కొనండి" అని కూడా అంది.

"ఇన్నాళ్ళుండి బ్లాకండ్‌వైట్ కొనడమా?" అన్నాను.

"ఫరవాలేదు, ఎన్నాళ్లాగినా కలర్‌ది రాదు...." అంది మా ఆవిడ.

తను నాకు సరిగా ఒకే ఒక్క రోజు వ్యవధి ఇచ్చింది.

ఏం చేయాలో నాకు పాలుపోలేదు.

అంత తక్కువ వ్యవధిలో బ్లాకండ్ వైట్ టీవీ మాత్రం ఎక్కడ్నించి వస్తుంది?

నా బ్యాంకులో పదిహేను వందలున్నాయి. ఇంకో అయిదు వందలు ఖర్చు పెడితే పోర్టబుల్ టీవీ రావచ్చు. కానీ పొరుగింటావిడ దగ్గర మరీ చిన్నతనంగా ఉండవచ్చు.

ఇంక జాప్యం చేయడానికి లేదు. ఏదో ఒకటి చేయాలి.

టీవీ గురించి సంసారంలో కలతలు తెచ్చుకోలేనుగా!

2

ఆ రోజు ఆఫీసు నుంచి ఇంటికి వెళ్ళలేదు.

మధ్యాహ్నం లంచి సమయంలో బ్యాంకు నుంచి పదిహేను వందలూ తీసుకున్నాను. సాయంత్రం బజారుకి వెళ్లాను.

చాలా పెద్ద బజారది.

ఆ బజారు నా పేదరికాన్ని పరిహసిస్తున్నట్లుగా ఉంటుంది.

అక్కడ ఎన్నో షాపులుంటాయి. ఎందరో కొనేవాళ్ళుంటారు.

వాళ్ళని చూస్తే నా కసూయగా ఉంటుంది.

నేను టీవీ షాపులమీంచి వెడుతున్నాను. ప్రతి బోర్డునూ శ్రద్ధగా చదువుతున్నాను. ఎక్కడయినా వాయిదాల పద్ధతి ఉంటుందేమోనని నా ఆశ!

అప్పుడు నన్నో షాపు ఆకర్షించింది.

స్వల్ప వాయిదాలపై కలర్ టీవీ లమ్ముతున్నారక్కడ....

షాపులో ప్రవేశించాను.

వివరా లడిగాను.

కలర్ టీవీకి ముందు మూడువేలు కట్టాలి. ఆ పైన

నెలకు అయిదు వందలు.

నేను నిరుత్సాహపడ్డాను.

ప్రొప్రయిటర్ నా ముఖంలోని నిరుత్సాహాన్ని చదివి నట్లున్నాడు. నన్ను పలకరించి నా యిబ్బంది అడిగాడు.

"నేను పదిహేను వందలు అడ్వాన్సు కట్టగలను. నెల నెలా వంద రూపాయలు వాయిదాగా యివ్వగలను. నాకా కలర్ టీవీ యివ్వగలరా?"

"కూర్చోండి" అన్నాడు ప్రొప్రయిటర్.

అతడి మాటల్లో మర్యాద ధ్వనించినందు కాశ్చర్య పడ్డాను.

అప్పుడతడు నే నింకా ఆశ్చర్యపోయేలా కూల్ డ్రింక్ కూడా ఇచ్చాడు. తాగింది గోల్డుస్పాట్ అయినా - అది డబుల్ సెవెన్‌లాంటి కిక్కిచ్చింది.

"మీకు కలర్ టీవీ చవగ్గా కావాలి-అవునా?" అన్నా డతడు.

"ఊఁ" అన్నాను.

"వెయ్యి రూపాయల్లో కలర్ టీవీ వస్తుంది తీసు కుంటారా?" అన్నాడతడు స్వరం తగ్గించి.

"వాయిదా ఎంత కట్టాలి?" అన్నాను భయంగా. నేను పదిహేను వందలని అడిగితే - వెయ్యికే కలర్ టీవీ యిస్తాననడం అదృష్టమనిపించింది నాకు.

"వాయిదాలేదు! టీవీ ధరే వెయ్యి రూపాయలు...."

నేనాశ్చర్యపోయాను. అసలది పని చేస్తుందా?

నా అనుమానం కళ్ళలోకి వస్తే అదతడు చది వుండాలి.

"ఒక్కసారి లోపలకు దయచేయండి—" అన్నా డతడు.

షాపు నానుకునే ఉందో చిన్న ఎయిర్ కండిషన్డు గది. అందులో ఓ చిన్న టేబుల్ పై ఉంది అందాల టీవీ.

"ట్రాన్స్మిషన్ ప్రారంభం కావడానికింకా నలభయి నిముషాలు వ్యవధి వుంది. ఈలోగా మీరీ పుస్తకం చదువుతూండండి" అని నాకో పుస్తకం అందించి వెళ్ళిపోయాడతడు.

గదిలో చల్లగా హాయిగా ఉంది.

ఓ కుర్చీలో కూర్చున్నాను.

వెయ్యి రూపాయలకు కలర్ టీవీ అంటే అదింకా కలా నిజమా అన్న విషయం నమ్మలేకపోతున్నాను.

అతడిచ్చిన పుస్తకం చూశాను.

టేబుల్ మీద ఉన్న టీవీ ఇన్‌స్ట్రక్షన్స్ మాన్యూలది.

వివరాలు ఇంగ్లీషులో వున్నాయి.

నౌ యూ ఆర్ ది ప్రౌడ్ ఓనర్ ఆఫ్.... అంటూ ప్రారంభమైంది.

నేను పుస్తకం శ్రద్ధగా చదివాను. పావు గంటలో అయిపోయింది.

తర్వాత లేచి టీవీ దగ్గరకు వెళ్ళాను.

ఎంతో అందంగా ముద్దొస్తోందది.

తొలి రాత్రి నా భార్యను చూసి కూడా నేనంతగా పరవశించి ఉండను.

కొత్తదనంతో తళతళ మెరుస్తోంది టీవీ.

అది స్మగుల్డుది కాదు. ఇండియన్ మేక్.

అంటే కస్టమ్స్ సమస్య ఉండదు.

స్విచెస్ ఆపరేట్ చేయబోయినా - పుస్తకంలో టీవీని వర్ణనతో పోల్చి చూసుకున్నాను.

కాసేపటికి ప్రొప్రయిటర్ వచ్చాడు.

"ఎలా ఉంది టీవీ?" అన్నాడు.

"చూడ్డానికి చాలా అందంగా ఉంది" అన్నాను.

"పెర్ఫార్మెన్స్ కూడా అద్భుతం" అన్నాడతడు.

"అయితే అంత చవగ్గా ఎందుకిస్తున్నారు?"

"వెర్రి వెయ్యి విధాలు...." అన్నాడతడు.

"అంటే?"

"మాకు బాగా తెలిసిన వ్యక్తి దీన్ని సరిగ్గా వెయ్యి రూపాయలకు అమ్మిపెట్టమని మమ్మల్ని కోరాడు....."

"ఎందుకు?"

"ఈ టీవీ కొన్నప్పట్నించీ అతడికి అన్నీ కష్టాలేనట. జ్యోతిష్కుణ్ని సంప్రదించాడు. టీవీని తెలియనివాళ్ళ కెవరికైనా వెయ్యిరూపాయల కమ్మమనీ—ఆ డబ్బు అత డికి తిరిగి అదృష్టాన్ని తెస్తుందనీ జ్యోతిష్కుడు చెప్పాడు. అతడు నాకీపని అప్పగించాడు...."

"నష్టానికమ్మితే ఆ డబ్బు అదృష్టమెలా తెస్తుంది?" అనడిగాను.

"ఈ టీవీ ఖరీదు మామూలుగా అయితే తొమ్మిదివేలు. దీన్ని వెయ్యిరూపాయలకు పొందే వ్యక్తి ఎంతో అదృష్ట వంతుడు. అతడి మనసుకు కూడా ఎంతో సంతోషం కలుగుతుంది. ఆ సంతోషం—ఆ వెయ్యి రూపాయలకూ అదృష్టాన్నిస్తుంది...."

"అలాంటప్పుడు మీరీ టీవీని రహస్యంగా అమ్మడ మెందుకు?" అన్నాను.

"నాది టీవీల వ్యాపారం. పబ్లిగ్గా అమ్మితే—మిగతా టీవీల ధరకూ దీనికీ సరిపడక చాలా అనుమానాలకూ అపార్థాలకూ దారితీసి నా వ్యాపారాన్నే దెబ్బతీస్తుంది. నాకు తోచిన అపరిచితుడి కిది అమ్మాలనుకున్నాను. ఈ

రోజు మిమ్మల్ని చూడగానే మీరే యిందుకు తగినవారని తోచింది నాకు-" అన్నాడు ప్రొప్రయిటర్.

"ఇది సరిగ్గా పనిచేస్తుందా?" అన్నాను.

"టైము అరవుతోంది. మీరే ఆపరేట్ చేసి చూడండి" అన్నాడతడు.

అతడి సాయం తీసుకుంటూ స్విచాన్ చేశాను.

తక్షణం టీవీ స్క్రీన్ మీద ఇంద్రధనుస్సు వెలిసింది. కొద్దిక్షణాల్లో అనౌన్సరు వచ్చింది. రంగుల్లో ఆమె ఎంతో అందంగా మెరిసిపోతోంది.

టీవీ సౌండ్ కూడా ఎంతో బాగుంది.

"ఎలా ఉంది?" అన్నాడతడు.

"ఎల్లకాలం ఇలాగే పనిచేస్తుందా?" అన్నాను.

"ఆరునెల్లు గ్యారంటీ యివ్వగలను టీవీ మావాళ్ళే వచ్చి మీయింట్లో ఫిక్స్ చేస్తారు. ట్రాన్స్మిషన్ తృప్తికరంగా ఉంటేనే మీరు వారికి డబ్బివ్వండి. వ్రాతపూర్వకంగా మీకు నేను కాగితం రాసిస్తాను. కానీ అది బిల్లులా చెల్లదు. నమ్మకంమీద జరగాల్సిన విషయమిది. మీ యిష్టం...." అన్నాడతడు.

బిల్లు లేదనగానే నామనసు కాస్త ఊగిసలాడింది.

ఇందులో ఏదైనా మోసముండదుగదా అని భయం కూడా వేసింది.

కానీ—

అది స్మగుల్డు వస్తువుకాదు.

కలర్ టీవీ వెయ్యిరూపాయలకు వస్తోంది.

ఇంట్లో అన్ని ఏర్పాట్లూ చేసేక—బొమ్మ బాగావస్తేనే వెయ్యిరూపాయలూ వాళ్ళకిస్తాను.

అంతా నా అదృష్టం?

"మోసగిస్తారనుకునేందుకు ఒక్క నా కలర్‌టీవీ గురించి దుకాణం మూసి పారిపోడు.

నడిబజార్లో నలుగురికీ తెలిసిన షాపు. బాగా పేరున్న షాపు.

ఇందులో మోసముండదు.

సిరిరా మోకాలొడ్డరాదు.

అనుమానాలతో అదృష్టాన్ని కాలదన్నకూడదు.

"సరే!" అన్నాను.

అతడు వెంటనే కలర్‌టీవీ ఆఫ్‌చేసి అట్టపెట్టెలో ప్యాక్ చేశాడు.

ఓ మనిషిని లోపలకు పిలిచి—నా యింటి అడ్రస చెప్పాడు. చెప్పాను.

"వీరింటికి ఓ రిక్షా బేరమాడి తీసుకునిరా. రెండ్రూపాయలు చాలు. రిక్షా రాగానే టీవీ అందులోపెట్టు—" అని అతడా మనిషికి చెప్పాడు.

అతడు వెళ్ళిపోయాడు.

"కూర్చోండి"-అన్నాడు ప్రొప్రయిటర్.

నాలో అప్పుడు త్వరగా ఇంటికిపోయి టీవీ చూడాలన్న ఉత్కంఠ ప్రారంభమయింది. కూర్చునేస్థితిలో లేను.

ప్రొప్రయిటర్ నావైపు వంగి—"ఈ టీవీని ఎంతకమ్మానో—మీకూ నాకూ తప్ప ఎవరికీ తెలియకూడదు. అందువల్ల నాకు చాలా ఇబ్బందులు. మా షాపులోని వాళ్ళకు కూడా అసలు విషయం తెలియదు. ఎవరడిగినా మీరు దీని ధర ఎనిమిదివేల ఏడువందలు-అని చెప్పండి." అన్నాడు.

బుద్ధిగా తలూపి "అలాగే!" అన్నాను.

"టీవీ చాలా మంచిది. మంచి కండిషన్లో ఉంది. దీని యజమాని పట్టుమని నెలరోజులుకూడా వాడలేదు దీన్ని." అన్నాడు ప్రొప్రయిటర్.

"ఇందాకా బొమ్మ చూశానుగా—నిజమే ననిపించింది-" అన్నాను.

వెయ్యి రూపాయలకు కలర్ టీవీ యిస్తూ-ఇంకా దాని గొప్పతనాన్ని వర్ణించి చెప్పే ప్రొప్రయిటర్ ఎంతో మంచివాడై ఉండాలి. నేను మంచివాళ్ళదగ్గర వినయంగా ఉంటాను.

ప్రొప్రయిటర్ ఓ కార్డు నా కందించి-"మీకేమాత్రం ఇబ్బందనిపించినా-ఓ ఫోన్ కొట్టండి. వెంటనే మా సర్వీస్ ఇంజనీర్ వస్తాడు. ఆఫ్టర్ సేల్స్ సర్వీస్ మా ప్రత్యేకత....మీరు—అండర్ లైన్ చేసిన ఫోన్ నంబరు తిప్పారంటే—సరాసరి నేనే మాట్లాడతాను" అన్నాడు.

కార్డందుకున్నాను.

అది ఆ షాపుకు సంబంధించినది. దానిపై నాలుగు టెలిఫోన్ నెంబర్లున్నాయి. అందులో ఒకటి అండర్లైన్ చేయబడి ఉంది.

నేను బుద్ధిగా తలూపాను.

"అసలు మీరు ఫోన్ చేయాల్సిన అవసరం రాదు..." అన్నా డతడు.

అప్పుడు లోపలికో మనిషివచ్చి—"రిక్షా వచ్చింది సార్?" అన్నాడు.

అతడు టీవీపెట్టె తీసుకుని బయటకు వెళ్ళిపోయాడు.

"గుర్తుంచుకోండి. టీవీ అసలు ధర ఇంకెవరికీ చెప్పొద్దు. ఆఖరికి మీ భార్యకు కూడా!" అని హెచ్చరించాడు ప్రొప్రయిటరు.

నేను కాస్త బాధపడుతున్నా. అందుకని—"క్షమించాలి. ఇంకెవ్వరికీ చెప్పనని మాటివ్వగలను కానీ నా భార్యకు చెప్పనని మాటివ్వలేను" అన్నాను.

నా నిజాయితీకి అతడు సంతోషించి "అయితే ఆమెకు వీలైనంత ఆలస్యంగా చెప్పండి" అన్నాడు.

"సరే!" అన్నాను.

ఇద్దరం బయటకు వచ్చాం.

నేను రిక్షాలో కూర్చున్నాను.

"మీ వెనుకే మా సర్వీస్ ఇంజనీరు, హెల్పర్ వస్తారు. వారిద్వారా నేనే రసీదు పంపిస్తాను. వెయ్యిరూపాయలూ ఇచ్చేయండి" అన్నాడు ప్రొప్రయిటర్.

మాట్లాడుదామంటే మాటలురాక సరేనని తలూపాను.

రిక్షా కదిలింది.

పది నిమిషాల్లో ఇల్లు చేరినా పదియుగాల ప్రయాణంలా తోచింది నాకు.

మా ఆవిడ నన్నూ, కలర్ టీవీని చూసి తెల్లబోయింది.

కలో, నిజమో తెలియక కాసేపామెకు మాటరాలేదు.

ఈలోగా మోటారుసైకిలుమీద సర్వీసింజనీరు, హెల్పరూ వచ్చారు.

ఓ గంట టైములో ఇంట్లో టీవీ-దొడ్లో యాంటెన్నా ఫిక్సయ్యాయి.

అందాల రంగుల బొమ్మలు మా డ్రాయింగ్ రూంకు ప్రత్యేకతనిచ్చాయి.

డబ్బు తీసుకుని సర్వీసింజనీరు వెళ్ళిపోయాడు.

"ఎలా కొన్నారండీ?" అంది మా ఆవిడ.

"నేను మాటంటే మాటే!" అన్నాను.

"కానీ నాకు తెలియకుండా మీ దగ్గరింత డబ్బె క్కడిదీ?" అంది మా ఆవిడ.

"కలర్ టీవీ కావాలా—నీ ప్రశ్నలకు సమాధానాలు కావాలా?" అని గద్దించాను.

ఏమనుకుందో అప్పటికి నా భార్య ఊరుకుంది.

3

ఉన్నట్లుండి మా వీధిలో నా పలుకుబడి పెరిగిపోయింది. రోజూ మా యింటికి వచ్చేపోయే జనం.

నా టీవీ అద్భుతంగా పనిచేస్తోంది.

రంగులంత సహజంగా వచ్చే టీవీలు ఊళ్ళోనే లేవుట....

బ్లాకండ్వైట్ టీవీతోనే రామారావు మహా గర్వపడి పోతున్నాట్ట. అతడితో పోల్చి అంతా నన్ను మెచ్చుకునే వారు.

మా పొరుగింటావిడ తన అసూయను దాచుకోలేక— "పక్కనే వుండగా నాతో ఒక్క మాటైనా చెప్పకుండా టీవీ కొన్నారు, ముందుగా చెబితే సంతోషించరూ—" అని కోపాన్ని నటించి—మా ఆవిడతో మాట్లాడ్డం మానేసింది.

నాలుగు రోజులుదాకా మా ఆవిడ బాగానే ఉంది కానీ అయిదో రోజున గోముగా—"నాకో ముత్యాల హారం చేయించండీ—" అంది.

"డబ్బున్నప్పుడు చూద్దాంలే" అన్నాను.

"మీరలాగే అంటారు. కావాలంటే టీవీ కొనలేమా!" అందామె.

యధాలాపంగా నేనా మాటల్ని కొట్టిపారేశాను గానీ ఆమె అంతటితో నన్ను వొదిలిపెట్టలేదు. హారంకోసం

పెద్ద రాద్ధాంతం చేసింది.

చివరికి నేనామె కసలు విషయం చెప్పక తప్పలేదు.

"నమ్మమంటారా?" అందామె తెల్లబోయి.

"నిజం—నీమీదొట్టు" అన్నాను.

"అయితే టీవీ మంచిదికాదేమో" అందామె.

"నిక్షేపంలా పనిచేస్తూంటే మంచిది కాదంటావేం?" అన్నాను.

"అదికాదండీ—అంత ఖరీదైన టీవీని ఆయనెవడో అయినకాటికి అమ్మేశాడంటే—దానివల్ల ఏమరిష్టాలుం టాయో ఏమో" అంది నా భార్య.

"ఆయన అరిష్టముందనుకోవడం మన అదృష్టం...."

ఆడవాళ్ళు తమ అదృష్టాన్నంత సులభంగా అంగీక రించరు. ఆమెను నమ్మించడానికి నాకు కాసేపు పట్టింది.

అందుకు టీవీ రాగానే మాకు జరిగిన మంచి విశేషా లన్నీ ఏకరువు పెట్టాను.

"ఏం మంచిలెండి—మీరు చెప్పినవన్నీ మామూలు విశేషాలే! ఏ ముత్యాలహారమో చేయించుకుంటే అది మంచి విశేషమవుతుంది" అంది మా ఆవిడ.

"చూద్దాం—అదీ జరుగుతుందేమో" అన్నాను.

అంతేకాదు. చవగ్గా వచ్చిందికదా అని అంత మంచి టీవీని అరిష్టం తెచ్చేదిగా నేను భావించదల్చుకోలేదు సరి గదా—మా ఆవిడ భావిస్తే సహించలేకపోతున్నాను. కాబట్టి వీలైనంత త్వరలో ఆమెకు ముత్యాలహారం చేయించాలనుకున్నాను.

ఎలాగో నాకింకా తెలియదు.

ఉజ్జాయింపుగా అంచనా వేయిస్తే—దారానికి గుచ్చి వేసుకున్నా ఉత్తముత్యాలకే వెయ్యి రూపాయలు కావచ్చు

నని తెలిసింది. మా ఆవిడ ముత్యాలను బంగారు దండకే జతపర్చాలనుకుంటోంది తప్ప మామూలు దారానికి కాదు.

కలర్ టీవీ చవగ్గా వచ్చింది కాబట్టి ఆమెకు ముత్యాల హారం చేయించడం నా విధి అనుకున్నాను.

4

కలర్ టీవీతో నేను మా వీధిలో గొప్ప సంచలనాన్నే కలిగించాను.

మార్కెట్లో ఆరేడువేలకు కూడా కలర్ టీవీలు దొరుకుతూంటే నేను—ఎనిమిదివేల ఏడువందలు పెట్టి కలర్ టీవీ కొనడం అక్కడ—నా అంతస్థును పెంచింది.

మా వీధిలోని మూడునాలుగు కుటుంబాలవారు కలిసి - మా యింట్లో ఓ బుధవారంనాడు చిత్రహార్ కార్యక్రమం చూస్తూండగా ఉన్నట్లుండి బొమ్మ రావడం మానేసింది.

ముందది ట్రాన్స్మిషన్ లోపమనుకున్నాను. కానీ మా పొరుగింట్లో టీవీలో బొమ్మ బాగానే వస్తోంది.

అప్పటికి నేను టీవీకొని ఎనిమిదిరోజులయింది.

చూడ్డానికి వచ్చిన వారందరూ ఓ పదినిముషా లెదురు చూసి వెళ్ళిపోయారు.

నాకు కంగారుపట్టుకుంది.

కొంపదీసి టీవీ మంచిదికాదా?

మా ఆవిడకైతే అది డొక్కుటీవీ అన్న నిర్ణయం ఆ క్షణంలోనే కలిగింది. వెయ్యిరూపాయలూ దండుగయ్యాయని శాపనార్థాలు ప్రారంభించింది.

“నువ్వలా వాగితే నాకు స్థిమితముండదు. వెళ్ళి షాపుకు ఫోన్‌చేసి వస్తాను” అన్నాను.

“ఫోన్ రామారావుగారికే ఉంది” అంటూ హెచ్చరించింది నా భార్య.

నా టీవీ రిపైర్‌కు వస్తే రామారావు తెలియడం మా యిద్దరికీ ఇష్టముండదు. అందులోనూ కొన్న ఎనిమిది రోజులకే!

"వీధి చివర డాక్టరు గారింట్లోకూడా ఫోనుందిగా" అన్నాను.

"ఊఁ అయితే అక్కణ్నించి ఫోన్ చేయండి" అంది మా ఆవిడ.

డాక్టరుగారింటికి వెళ్ళాను.

ఆయన మంచివాడు. స్నేహపాత్రుడు.

నవ్వుతూ పలకరించి "ఫోన్ చేయాలా?" అన్నాడు.

ఆయనింటికి వైద్యంకంటే ఫోన్‌కోసమే ఎక్కువ మంది వెడతారు.

ఎవరైనా ఫోన్ చేస్తున్నప్పుడు డాక్టరుగారు గదిలో ఉండడు. నేను నంబరు తిప్పుతుండగానే ఆయన వెళ్ళిపోయాడు.

ఒకసారి నంబరు తిప్పాను.

రాంగ్‌నంబరు వచ్చింది.

రెండోసారి తిప్పాను. ఎంగేజ్డ్. కాసేపాగి మళ్ళీ తిప్పాను. ఎంగేజ్డ్....

సుమారు అయిదు నిముషాలు ఎదురుచూశానక్కడ.

నంబరు ఎంగేజయ్యే ఉంది.

డాక్టరుగారికి థాంక్స్‌చెప్పి అక్కణ్నించి బయట పడ్డాను.

అయితే నాకప్పుడింటికి వెళ్ళ బుద్ధికాలేదు. తిన్నగా నడుచుకుంటూ షాపుకు వెళ్లాను. అడ్డదారుల్లో వెళ్ళినా ఇరవై నిముషాలు పట్టింది.

అదృష్టంకొద్దీ షాపింకా తెరిచేవుంది.

అక్కడ ప్రొప్రయిటరూ ఉన్నాడు. నన్నుచూసి గుర్తు పట్టి నవ్వాడు.

అతడి నవ్వుతో నాకు ప్రాణం లేచివచ్చినట్లయింది. కొండంత ధైర్యమూ వచ్చింది. ఆ నవ్వు చూసేదాకా నన్నతడు మోసగించినట్లే భావిస్తున్నాను.

"ఏమిటిసార్ అదోలా ఉన్నారు" అన్నాడతడు.

నెమ్మదిగా జరిగింది చెప్పాను.

"దీనికంత కంగారెందుకుసార్? మాకు ఫోన్ చేస్తే సరి పోయేదిగా!"

"టీవీ బాగుపడుతుందంటారా?"

"మీకు ఆర్నెల్ల గ్యారంటీ యిచ్చాను. ఎనిమిది రోజుల్లోనే పోతే బాగుపడేలా చేయడం నా బాధ్యత" అన్నాడతడు.

ఒక్కసారి అతణ్ని కౌగిలించుకోవా లనిపించింది "థాంక్యూ వెరీమచ్" అన్నాను.

"మరో విషయం" అన్నాడు ప్రొప్రయిటర్—"టీవీలోని పార్ట్సుకే ఆరునెల్లు గ్యారంటీ. పిక్చర్ ట్యూబ్కైతే అయిదేళ్ళు గ్యారంటీ—కాబట్టి మీరేమీ బెంగపడకండి. మీకు పైసాకూడా ఖర్చులేకుండా నేను మీ టీవీ రిపైర్ చేయిస్తాను."

"ఇప్పుడెవరినైనా పంపుతారా?" అన్నాను.

"ఎనిమిది తర్వాత ఇక్కడెవరూ వుండరు! రేపుదయం పంపుతాను. మీ యింటికి ఫోన్ నంబరుంటే యివ్వండి. అవసరమైతే ఫోన్ చేస్తాను" అన్నాడు ప్రొప్రయిటర్.

"ఎన్నింటికి పంపుతారు?" అన్నాను.

"పదిన్నరకు...."

"అరే నేను తొమ్మిదిన్నరకల్లా ఆఫీసుకు వెడతానే"

అని "పోనీ వోపని చేయండి. మనుషుల్ని పంపగానే మా ఆఫీసుకు ఫోన్ చేయండి. ఆఫీసు ఫోన్ నంబరిస్తాను. మా యింటికి ఫోన్ లేదు" అన్నాను.

ప్రొప్రయిటర్ ఆఫీసు ఫోన్‌నంబరు తీసుకుని "వీలు వుంటే మీరింట్లో ఉండగానే మనుషుల్ని పంపడానికి చూస్తాను" అన్నాడు.

నేను సెలవు తీసుకుని ఇంటికి బయల్దేరాను.

మా ఆవిడ కబుర్లకే తప్ప ఏ పనికీ పనికిరాదు. సర్వీసింగ్ మనిషులు నేను ఆఫీసుకు వెళ్ళేలగా రాకపోతే అప్పుడు నేను ఆఫీసులో పర్మిషన్ తీసుకుని ఇంటికి రావాల్సుంటుంది.

5

మర్నాడుదయం ఎనిమిదింటి కిద్దరు మనుషులు మా యింటికి వచ్చారు. టీవీషాపు ప్రొప్రయిటరు వాళ్ళను పంపాడు.

వాళ్ళు చకచకా పనులు ప్రారంభించారు.

మా ఆవిడ వాళ్ళకు టీ కలిపిచ్చింది.

నేనేమో అన్నిపనులూ మానుకుని వాళ్ళదగ్గరే కూర్చున్నాను.

సుమారు అర్థగంట సేపు నానా అవస్థా పడ్డారువాళ్ళు.

"లాభంలేదు సార్! టీవీని షాపుకు తీసుకుని వెళ్లాలి" అన్నాడు వాళ్ళలో ఒకడు.

"అసలిది బాగుపడుతుందా?" అన్నాను.

"బాగుపడకపోతే మీకే లాభం .... కొత్త టీవీ వస్తుంది__"

"అది సరే—అసలిది బాగుపడుతుందా?" మళ్ళీ అడిగాను.

"చాలా మైనర్ మిస్టేకే" అన్నా డతడు.

అతడివద్ద కంపెనీ పేరుతో రసీదు పుస్తకముంది.

మా యింటినుంచి టీవీ తీసుకుని వెడుతున్నట్లు రసీదిచ్చి—రిక్షాలో వేసుకుని టీవీ తీసుకుని వెళ్ళిపోయాడు.

"సాయంత్రం అయిదింటికల్లా టీవీ మీ యింట్లో దిగిస్తాను సార్" అని వెళ్ళేటప్పుడు హామీకూడా యిచ్చాడు.

నేనాఫీసుకు వెళ్ళాను.

సరిగ్గా పావుతక్కువ పదకొండుకు ఫోన్ వచ్చింది నాకు.

"హలో!" అన్నాను.

అవతల టీవీదుకాణం యజమాని.

"టీవీ బాగుపడిందాండీ?" అన్నాను.

అతడికి నా ప్రశ్న అర్థంకానట్లుంది. దానికి జవాబివ్వకుండా "సార్....మా సర్వీసింజనీరు ఫ్రీగా లేడు. మధ్యాహ్నం మూడింటికి పంపిస్తాను. ఇది చెప్పాలనే ఫోన్ చేశాను" అన్నాడతడు.

నా తలమీద వెయ్యిటన్నుల బరువు పడింది.

నేను చెప్పింది విని "ఏదో మోసం జరిగిందిసార్!" అన్నాడతడు.

నేను పర్మిషన్ తీసుకుని దుకాణానికి వెళ్ళాను.

నా దగ్గరున్న రసీదు నకిలీదని తేలింది. అసలా షాపు రసీదు నమూనాయే వేరు.

"మీరు స్వయంగా వాళ్ళతో బయల్దేర్సింది. సార్.... అలా ఎలా నమ్మారు మనుషుల్ని?" అన్నాడతడు.

తప్పు నాదే....

కానీ ఇందులో ఏదో మోసముంది.

నా టీవీ రిపైరు కొచ్చిందనీ—ఉదయం నే నాఫీసుకు వచ్చేలోగా దాన్ని రిపైర్ చేయాలనీ—ఆ మనుషుల కెలా తెలుసు?

నా అనుమానం ప్రొప్రయిటరుమీద కమ్మింది.

కానీ ఇది ఇతరులెవ్వరికీ చెప్పుకోలేని అనుమానం....

ఎందుకంటే వెయ్యిరూపాయలకు కలర్ టీవీ కొన్నాను నేను. అదెవరూ నమ్మరు. అయినా చాలాకాలం నేనా విషయం రహస్యంగా ఉంచాను.

అంతా నా తెలివితక్కువతనానికి నవ్వుకుంటారు.

మనుషుల అత్యాశనూ, తెలివితక్కువతనాన్నీ ఆధారంగా చేసుకుని ఆ దుకాణం యజమాని ఎంతో తెలివిగా ఆడిన నాటకమది!

నాకు సంబంధించి ఏ ఋజువులూ లేవు—దుకాణం యజమానిని తప్పుపట్టడానికి!

అయినా నేను కాస్త నిష్ఠూరంగా మాట్లాడబోయానతడితో.

అతడు ప్రేమగానూ, అభిమానంగానూ నవ్వి "మీరైతే కష్టమర్సు. నేను వ్యాపారస్థుణ్ణి. మీకులా నేను దెబ్బలాడలేను. గొడవ పెట్టుకోను. చెప్పాలంటే నా దగ్గరికింకో వెయ్యిరూపాయల టీవీ వచ్చింది. కానీ మీవంటి అజాగ్రత్త మనుషులకవి అమ్మలేను" అన్నాడు.

అంటే—మరోవ్యక్తిని బుట్టలో వేయడానికి సిద్ధంగా వున్నాడతడు.

వెయ్యిరూపాయలకు నేను సాధించినదేమిటి?

ఒక యాంటెన్నా ప్లస్ ఏడురోజుల కలర్ టీవీ అద్దె. వెరసి వెయ్యిరూపాయలయింది. □

రాక్షస రాకెట్

సుంకరి రాంప్రసాద్

ఆకాశపు టంచున కెంజాయి సోనలు విరిసే వేళ. పశ్చిమాన మెల్లిగా సముద్ర గర్భం లోనికి జారుకుంటుంది ఎర్రని సూర్యబింబం. ఆ దృశ్యాన్ని తన్మయంగా చూస్తూంది శిరీష.

"నింగి ఫాలమైతే. సాగరం కురులైతే. అలల నురుగులు నవ్వులయితే అరుణబింబం సంధ్యాకన్య నున్నెదుట దిద్దుకున్న తిలకం కాదూ?"

ఎప్పుడో ఎక్కడో చదివిన పదాలు గుర్తుకు వచ్చాయి ఆమెకు. సన్నని చిరునవ్వొకటి క్షణకాలం ఆమె పెదాలపై నర్తించింది.

డిసెంబరు నెల కావడంచేత బీచ్‌లో జనం ఎక్కువ లేరు. ఉన్న ఒకరిద్దరూ మసక చీకట్లు ముసురుకోవడంతో ఇళ్ళ ముఖం పట్టారు.

ఒక్కసారి చేతికున్న రిస్ట్‌వాచ్ వంక చూసి, లేచి నిలబడింది శిరీష. చీరకు అంటుకున్న ఇసుకను దులుపుకుంది. నెమ్మదిగా బీచ్ బయటకు నడవసాగింది.

అంతవరకూ దూరంగా ఒక పొద చాటున పొంచి కూర్చుని ఆమెను తదేకంగా చూస్తున్న ఒక యువకుడు కూడా వడివడిగా అడుగులు వేస్తూ ఆమెను అనుసరించసాగాడు.

నడుస్తూంటే ఆమె పాదాలు ఇసుకలో కూరుకుపోతున్నాయి. అడుగులు ఎత్తివేసినప్పుడల్లా అందంగా బరువుగా కదులుతున్న ఆమె గుండ్రని పిరుదుల వంక ఆకలిగా చూస్తున్నాడతడు.

తనను వెన్నాడుతున్న యువకుని చూసేసరికి ఆమెను ఏదో తెలియని భయం అవహించింది. అతడు ఇండియన్ కాడు. ఎవరో విదేశీయుడు. 'హిప్పీలా ఉన్నాడు' అనుకుంది ఆమె.

ఆమె రోడ్డును సమీపించింది. ఇంకో ఇరవై గజాల దూరంలో ఉంది బస్టాప్. అందులో అస్పష్టంగా కనిపిస్తున్న మనుష్యుల ఆకారాలను చూసేసరికి ఆమెకు

కాస్త ధైర్యం వచ్చింది. ఆమె నడక వేగాన్ని పెంచింది.

అయితే అంతవరకూ రోడ్డుకు ఒక ప్రక్కగా పార్క్ చేయబడ్డ ఒక కాడిలాక్ కారు, ఆమెను వెన్నాడిన యువకుడు చేసైగ చేయగానే స్టార్టు చేయబడటం ఆమె గమనించలేదు.

కారు బాక్ డోర్‌ను తెరచి పట్టుకున్నాడు కారులోని మరో విదేశీయుడు. అంతవరకూ ఆమెను వెన్నాడిన యువకుడు వేగంగా ఆమె వైపు పరుగెత్తాడు.

సరిగ్గా బస్టాపు యింకా పది గజాల దూరంలో ఉండనగా సర్రమని దూసుకుంటూ వచ్చి ఆమె ప్రక్కగా ఆగిందా కారు. అదే సమయంలో ఆమెను సమీపించిన మొదటి యువకుడు చటుక్కున ఆమెను కారులోనికి గెంటి తను కూడా కారులోనికి దూకి డోర్ వేసాడు. మరు క్షణం ఆ కారు బాణంలా అక్కడి నుండి దూసుకు పోయింది.

బస్టాప్‌లో నిలుచున్నవారికి ఏం జరిగిందో క్షణకాలం పాటు అర్థం కాలేదు. ఒక భారతీయ యువతిని ఎవరో విదేశీ యువకులు బలవంతంగా కారులో ఎత్తుకు పోతున్నారని అర్థం అయ్యాక వారిలో కాస్త సివిక్ సెన్స్ ఉన్న యువకుడు పబ్లిక్ టెలిఫోన్ బూత్ దగ్గరకు పరుగెత్తాడు. తను చూసిన ఆ దుస్సంఘటన గూర్చి పోలీస్ స్టేషన్‌కు రిపోర్టు చేసాడు.

ఇక్కడ ఆ కారులో....

ఆమెకు జరిగిందేమిటో అర్థం అయ్యేలోపునే ఆమె అరవకుండా నోటికి టేప్‌ను అతికించా డొకడు. తన కిరువయిపులా కూర్చున్న విదేశీయుల వంక భీతహరిణిలా చూసిందామె. వారు పాలిపోయిన ముఖాలతో ఎర్రని

కళ్ళతో పిశాచాల్లా కనిపించా రామెకు. ఏవో డ్రగ్స్ సేవించినట్లు వారి కళ్లు మత్తుగా, నిస్తేజంగా ఉన్నాయి.

ఒకడు ఆత్రంగా ఆమె చీర కుచ్చెళ్ళను లాగసాగాడు. మరొకడు హుక్స్ తీసే ఓపిక లేనట్లు ఆమె జాకెట్ ను చింపేసాడు. లేత గులాబిరంగు ఛాయలో మిస మిస మెరుస్తున్న ఆమె నిండయిన దేహం వారి కళ్ళను చెదర గొడుతూంది. వారిద్దరి మధ్యా గింజుకుంటూ చుట్టూ చూసిందామె.

కారుకున్న నల్లని అద్దాలు, అవి చాలవన్నట్లు వాటిని కూడా కవర్ చేస్తూ చుట్టూ కట్టబడ్డ ముదురు నీలం రంగు కర్టెన్‌లు ఆమెను వెక్కిరించాయి.

తన రోదన అరణ్య రోదనేనని, బయటి ప్రపంచానికి ఆ కారులో జరుగుతున్న అమానుషం గూర్చి తెలిసే అవకాశం లేదని గ్రహించగానే ఆమె చిగురుటాకులా వణికిపోయింది.

ఆ కారు పాండిచ్చేరి సిటీలో ప్రవేశించింది. నగరం నడిబొడ్డులో. అందరిమధ్యా కారులో ప్రయాణిస్తూ. ఒక యువతిని రేప్ చేయడం....ఆ యువకుల కొక థ్రిల్.... జస్ట్ ఎ క్రేజ్.

అర్ధరాత్రి స్త్రీ నిర్భయంగా సంచరించగలిగినప్పుడే ఈ దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అన్నారు పూజ్య బాపూజీ.

"మరి... ఆ స్వాతంత్ర్యం ఈ దేశానికి ఎప్పుడు వస్తుంది ప్రభూ!"

2

మరనాడు ఉదయం శిరీష శవం పాండిచ్చేరి పట్టణ శివార్లలో కనిపెట్టబడింది. అమానుషంగా సామూహికంగా

రాక్షసంగా చెరచబడటంచేత ఆమె మరణించిందని పోస్ట్ మార్టంలో తేలింది.

ఆ రోజు సాయంత్రం....గవర్నర్ బంగళాలో ....

పాండిచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ రామచంద్ర ముందు తల వంచుకుని నిలబడి ఉన్నాడు ఇనస్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గణేశన్.

"మిస్టర్ గణేశన్, గత పది రోజులుగా మీకు యిలాంటి కేసులు ఎన్ని రిపోర్టు చేయబడ్డాయి?"

"పద్ధెనిమిది సర్."

"అంటే....పది రోజులలో పద్ధెనిమిది మంది యువతులు దారుణంగా మానభంగం చేయబడ్డారు. మరింత దారుణంగా చంపబడ్డారు. కాని, ఇంతవరకూ దీనికి కారణం ఏమిటో, ఆ నేరస్థు లెవరో మీరు తెలుసుకోలేక పోయారు. అంతేగా!"

"అది కాదు సర్!"

"నాకు కావలసింది సంజాయిషీలు కాదు గణేశన్."

ఏదో చెప్పబోతున్న ఐ. జి. గణేశన్ మాటలను మధ్యలో నే కట్ చేసాడు రామచంద్ర. టేబుల్ సొరుగును లాగి పెద్ద న్యూస్ పేపర్ల బొత్తిని పైకితీసి విసురుగా టేబిల్ మీదకు గిరవాటు వేసాడు.

అవి దేశం మొత్తం మీద అత్యంత ఎక్కువ సర్క్యులేషన్ గల వివిధ దినపత్రికలు.

"సీ....సీ దోజ్ పేపర్స్. ప్రెస్సువాళ్ళు పోలీస్ డిపార్టుమెంటుమీద దుమ్మెత్తి పోస్తున్నారు. ప్రభుత్వం ఏం చేస్తోందని నిలదీస్తున్నారు. రేపో మాపో ఈ విషయం పార్లమెంట్ లో చర్చకు వచ్చినా మనం ఆశ్చర్యపోనవసరం లేదు.

పరిస్థితి అంత దూరం రాకముందే....

డూ సమ్‌థింగ్ మిస్టర్ గణేశన్! ఏదో ఒకటి చేసి ఈ హత్యాకాండను ఆపండి. కావాలంటే నేను సి.బి.ఐ. చీఫ్ కరుణాకర్‌ను కాంటాక్టు చేస్తాను.''

అవమానంతో గణేశన్ ముఖం ఎర్రవారింది.

'సి.బి.ఐ.ని కాంటాక్టు చేయడమంటే, తమ పోలీస్ డిపార్ట్‌మెంట్ యొక్క అసమర్థతను ఒప్పుకోవడమేనని' అతడికి బాగా తెలుసు.

కాని లెఫ్టినెంట్ గవర్నర్ స్వయంగా పూనుకొని తాను సి.బి.ఐ తో సంప్రదిస్తా నంటుంటే కాదని అతడు ఎలా అనగలడు?

ఒకవిధంగా చూస్తే ఈ వ్యవహారం ఏదో వారి డిపార్ట్‌మెంట్‌కు మింగుడు పడనట్లే ఉంది.

"సి.బి.ఐ. రంగంలోనికి దిగి, ఈ హత్యాకాండను ఆపగలిగితే కనీసం పత్రికలవాళ్ళ తిట్లయినా తప్పుతాయి" అనుకున్నాడు గణేశన్.

ఐ.జి. గణేశన్ మౌనాన్ని అంగీకారంగా భావించాడు లెఫ్టినెంట్ గవర్నర్ రామచంద్ర.

3

హోటల్ పాండ్య గదిలోని మెత్తని కుషన్లు సోఫాలో కూర్చొని వున్నాడు రాంకుమార్.

అతని ఎదురుగా నున్న టీపాయ్ మీద పాండిచ్చేరి సిటీమేప్ పరచి వుంది. పాండిచ్చేరి సిటీతోపాటు దాని చుట్టుప్రక్కల ఏభయి మైళ్ళవరకూ ఉన్న పట్టణాలూ, పల్లెలు కూడా ఆ మ్యాప్‌లో గుర్తించబడి ఉన్నాయి.

ఆ మేప్ పక్కనే 'షివాజ్ రీగల్' బాటిల్ ఒకటి ఓపెన్ చేసి ఉంది. కుడిచేతిలో గాబ్లెట్‌ను ఎత్తిపట్టుకొని

అందులోని ద్రవాన్ని నెమ్మదిగా సిప్ చేస్తున్నాడతడు.

అతని కన్నులు అరమోడ్పులయి వున్నాయి. అతడు తీవ్రాలోచనలో మునిగి ఉన్నాడు.

రెండు గంటల క్రితమే అతడు పాండిచ్చేరి ఐ.జి. గణేశన్‌ను కలిసి మాట్లాడాడు. పాండిచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ రామచంద్ర కోరికపై ఆ కేసును డీల్ చేసేందుకు ఢిల్లీ నుండి ప్రత్యేకంగా పంపబడ్డ సి.బి.ఐ. ఆఫీసర్ అతడు.

అయితే ఐ. జి. ఆఫీసులో ఆ కేసు గురించి పూర్తి వివరాలున్న ఫైలును చూశాక కూడా, ఆ కేసు పూర్తి స్వరూపం ఏమిటో అతడికి అర్థం కాలేదు.

అతడొక్కసారి కేసును మొదటి నుండీ సింహావలోకనం చేసుకొనసాగాడు.

మొత్తం పద్దెనిమిది హత్యలు. అన్నీ రేప్ మర్డర్సే. హతులంతా అందమైన యువతులే.

డాక్టర్ రిపోర్ట్ ప్రకారం....

హంతకులు....ఆ యువతులను అనుభవించడంలో మృగాల కన్నా క్రూరంగా ప్రవర్తించారు. స్త్రీ, పురుషులు మామూలుగా సంభోగించే రీతిలో గాకుండా అత్యంత జుగుప్సాకరంగా, సాముహికంగా ఆ యువతులను అనుభవించారు. దె వర్ క్రూయల్లీ రేప్డ్ టిల్ డెత్.

అంటే హంతకులు సాడిస్టులా? సెక్సుయల్ మానియేక్సా....?

పాండిచ్చేరిలోని వివిధ ప్రాంతాలలో జరిగాయి ఈ హత్యలు, కాబట్టి ఏ ఒక్క ప్రాంతాన్ని కూడా బేస్‌గా తీసుకొని పరిశోధించడానికి అవకాశం లేదు.

ఒకే సమయంలో రెండు చోట్ల, అంటే నగరంలోని

రెండు విభిన్న ప్రదేశాలలో ఒకేసారి ఈ ఘోరాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి.

ఒక్కొక్క రేప్‌లో కనీసం ముగ్గురు పాల్గొన్నారనుకుంటే హంతకులు చాలా మంది ఉండి వుండాలి.

హంతకులు వేరయినా....హత్యలు జరిగిన విధానం, రేప్ చేయడంలో వారు చూపిస్తున్న పైశాచికత్వం సుమారు అన్ని కేసుల్లో కూడా ఒకేలా ఉంది.

అంటే....హంతకులంతా ఒకే ముఠాకు సంబంధించిన వారైనా అయి ఉండాలి. లేదంటే వారంతా ఒకేరకమైన స్వభావం కల్గి వుండాలి. వారిలోని ఆ ఐడెంటికల్ నేచర్ ఏమిటి?

విపరీతమైన కామం. సాడిజం. స్త్రీని అనుభవించడంలో క్రూరత్వం. ఈ రాక్షస స్వభావం అందరిలో ఒకేలా ఎలా వచ్చింది? అది సహజమా? కృత్రిమమా?

ఇక చివరగా, ఈ హత్యలతో కొందరు విదేశీయులకు కూడా సంబంధం ఉందని తెలుస్తూంది. ఎవరీ విదేశీయులు? వీరు ఉంటూంది పాండిచ్చేరిలనేనా?

ఈ కేసులో తనకు తడుతున్న క్లూ అదొక్కటే. అతడు ముందుకు వంగి మేప్‌ను పరిశీలించసాగాడు.

పాండిచ్చేరి టౌన్ ప్లాన్‌ను పరీక్షగా చూస్తున్న అతని కళ్ళు అకస్మాత్తుగా ఒక చోట ఆగిపోయాయి. అక్కడ ప్రింట్ చేయబడ్డ ఎర్రని అక్షరాలను అతడు అనుకోకుండా పైకే చదివాడు.

"ఆ....రో....వి....ల్లి...."

అయితే అతడిని ఆకర్షించింది ఆ ఎర్రని అక్షరాలు కావు. ఆ రెడ్ లెటర్స్ క్రింద నల్లని సర్కిల్‌లో కొట్టి వచ్చినట్లు కన్పిస్తున్న ఒక ఇంగ్లీషు లెటర్. ఆ అక్షరం

'ఎఫ్'.

ఎఫ్ అంటే ఫారినర్స్ అని అతడికి తెలుసు. ఆరోవిల్లి క్రింద 'ఎఫ్' అని వ్రాయబడి ఉందంటే అందులో నివసించేవారిలో అధిక శాతం విదేశీయులని అర్థం.

'ఆరోవిల్లి....' ఎక్కడో ఆ పేరును విన్నట్లు అన్పించసాగింది అతడికి. కాని ఎక్కడో ఏమిటో గుర్తుకు రావటం లేదు. గాబ్లెట్ లోని విస్కీనంతా ఒక్కసారిగా గొంతులోనికి పోసుకున్నాడతడు.

తనలో తానే కూడబలుక్కున్నట్లు ఒక్కో అక్షరాన్ని విడి విడిగా అనుకోసాగాడు అతడు. దేనినయినా గుర్తు తెచ్చుకోవడానికి కొందరు ఉపయోగించే ప్రక్రియ అది.

"ఆరో....ఆరోవి....అరవి...."

అప్పుడు గుర్తుకు వచ్చింది అతిడికి సడన్‌గా. అరవింద మహర్షి శిష్యురాలైన ఒక ఫ్రెంచి వనితచేత స్థాపించబడ్డ విశ్వమానవ నగరం పేరు ఆరోవిల్లి."

పాండిచ్చేరికి పది కిలోమీటర్ల దూరంలో నున్న ఆరోవిల్లిలో ఏ దేశస్థులైనా స్వేచ్ఛగా నివసించవచ్చు. కాకుంటే వారు ఆరోవిల్లి పౌరసత్వాన్ని స్వీకరించాల్సి ఉంటుంది. తమ ఆస్తులను బహిరంగపర్చాల్సి ఉంటుంది.

మొగ్గలు ఒక్కొక్క రేకు విప్పుకున్నట్లు ఆరోవిల్లి గురించి ఎప్పుడో చదివిన వివరాలన్నీ ఒక్కొక్కటే గుర్తుకు రాసాగాయి అతడికి.

సరిగ్గా అప్పుడే అతడి మనస్సులో పురుగులా ప్రవేశించి దొలచడం ప్రారంభించిందొక అనుమానం.

జరిగిన పద్దెనిమిది హత్యలలో ఎక్కువ శాతం విదేశీయులు చేసినవే అని తెలుస్తూంది.

అయితే జరిగిన హత్యలన్నీ వ్రేళ్ళమీద లెక్కించ

గలిగేటంతటి తక్కువ మంది విదేశీయులున్న పాండిచ్చేరి లోనే జరిగాయి.

కాని కొన్ని వేలమంది విదేశీయులు నివసించే ఆరోవిల్లిలో....అదీ పాండిచ్చేరికి కేవలం పది కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉన్న ఆరోవిల్లిలో....ఒక్క దారుణం కూడా జరగకపోవడం అతడికి విచిత్రంగా తోచింది.

తెలివైన నేరస్థుడెవడూ తన ఇలాకాలో తానుండే స్వస్థానంలో నేరాలు చేయడానికి ప్రయత్నించడు.

తన అనుమానం నిజమయితే ఈ హంతకుల స్థావరం ఆరోవిల్లి అయివుండాలి. అది తేలాలంటే తను ఆరోవిల్లిలో ప్రవేశించాలి.

ఒక నిశ్చయానికి వచ్చినట్లు అతడు సోఫాలో నుండి పైకి లేచాడు.

4

రాత్రి పదకొండు గంటల సమయం.

చీకటిలో చుక్కలు బిక్కు బిక్కుమంటున్నాయి. మత్తుగా పడుకొని ఉన్న కొండ చిలువలా, నల్లని తారు రోడ్డు ఆ గ్రుడ్డి వెలుగులో మిల మిలా మెరుస్తూంది.

నిశీధితో నిశ్శబ్దం పోటీ పడుతూందా అన్నట్లు అంతా నిర్మానుష్యంగా ఉంది. దూరంగా ఆరోవిల్లిలని దీపాలు మాత్రం మిణుకు, మిణుకుమంటూ, అస్పష్టంగా కన్పిస్తున్నాయి.

రోడ్డు ప్రక్కనున్న గుబురు పొదల మధ్య దాక్కొని కూర్చున్నాడు రాంకుమార్. అతడి ప్రక్కనే రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటారుబైకు స్టాండ్ వేసి వుంది. అతడు కళ్ళు విప్పార్చుకొని రోడ్డువైపే చూస్తున్నాడు.

అతడు వచ్చాక, గత రెండురోజులుగా పాండిచ్చేరిలో అవాంఛనీయ సంఘటనలేం జరుగలేదు. ఐ.జి.గణేశన్‌తో చెప్పి, నగరమంతటా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయించాడు. పార్కులు, సినిమాహాళ్ళలాంటి పబ్లిక్ ప్రదేశాలలో ప్రత్యేక భద్రతా దళాలు ఏర్పాటు చేయబడ్డాయి.

సాయంత్రం ఆరుగంటలనుండీ నాలుగు పెట్రోల్ వాన్‌లు....నగరమంతటా గస్తీ తిరిగే ఏర్పాటు చేయబడింది. ఇన్ని కట్టుదిట్టమైన ఏర్పాట్లమధ్య, మునుపటిలా అఘాయిత్యాలు చేయడానికి హంతకులకు అవకాశం చిక్కలేదు.

అయితే, నగరంలో గత రెండు రోజులుగా నెలకొన్న ప్రశాంతత, తుఫాన్ ముందు సముద్రంలో ఏర్పడే ప్రశాంతత వంటిదేనని రాంకుమార్‌కు బాగా తెలుసు.

నరమాంసాన్ని రుచి మరిగిన పెద్ద పులి, ఎంత కాపలానయినా తప్పించుకొని, యుక్తిగానో, రిస్కు చేసో తన ఎరను దక్కించుకోవడానికే ప్రయత్నిస్తుంది. అలాంటిది కామంతో పిశాచాల్లా ప్రవర్తిస్తున్న ఈ హంతకులు ఆ అనుభవంకోసం యెంతకైనా తెగించక మానరు.

అందుకే, అతడు అక్కడ మాటువేసాడు. అతడి అంచనా తప్పు కాలేదు.

రాత్రి పదకొండున్నర ప్రాంతంలో రోడ్డును ప్రకాశవంతంచేస్తూ రెండు హెడ్‌లైట్స్ కన్పించాయి. కళ్ళను చిట్లించుకొని చూసాడు అతడు. ఆరోవిల్లి వైపునుండి పాండిచ్చేరివైపు శ ర వే గ ం గా దూసుకుపోయిందొక కాడిలాక్ కారు.

కారులోనుండి అస్పష్టంగా అగుపించిన ఆకారాలు విదేశీయులవని గ్రహించిన వెంటనే అతడి పెదవులమీద సన్నని చిరునవ్వొకటి మొలచి క్షణకాలంలో మాయమయ్యింది.

అతడు వెంటనే మోటార్‌బైక్‌ను స్టార్ట్ చేశాడు. ముప్ఫయి గజాలదూరంలో ఆ కాడిలాక్ కారును వెంటాడ సాగింది అతడి రాయల్ ఎన్‌ఫీల్డు.

కొద్ది నిముషాలలో వారి వాహనాలు పాండిచ్చేరి పట్టణ శివార్లలోనికి ప్రవేశించాయి. అయితే ఆ కాడిలాక్ కారు పట్టణం లోనికి ప్రవేశించలేదు.

మెయిన్ రోడ్డుకు కుడివైపునున్న మట్టి రోడ్డుమీదకు టర్న్ చేయబడిందా కారు. ఆ మట్టి రోడ్డు నానుకొని సుమారు అయిదారు అధునాతన బంగళాలున్నాయి. అవన్నీ రీసెంట్‌గా కట్టబడ్డవే. యింకా అక్కడ సరైన రోడ్డుకూడా పడలేదు.

ఊరు చివర ప్రశాంతంగా ఉంటుందని ఎవరో లక్షాధికారి అక్కడో ప్లాట్ కొని బ్రహ్మాండమయిన ఇల్లు కట్టించాడు. ఆ తరువాత ఒకరిని చూసి, మరొకరు. అలా అక్కడ మెల్ల, మెల్లగా ఒక పోష్ కాలనీ రూపు దిద్దుకోబోతూంది.

ఆ కారు సూటిగా వెళ్ళి ఒక బంగళాముందు ఆగింది. గేటు దగ్గర స్టూల్‌మీద కూర్చుని వున్న గూర్ఖా ఆశ్చర్యంగా కారువైపు చూశాడు.

డ్రయివర్ సీటులో కూర్చున్న యువకుడు డోర్ తెరచుకొని హుందాగా క్రిందకు దిగాడు. రెండడుగులు ముందుకు వేశాడు.

'అతడెవరో, ఏమో తెలియకపోయినా, సూటూ,

బూటూ వేసుకున్న పరాయివాడ్ని, అందునా పరాయి దేశస్థుడిని చూసేసరికి, మనలో ఎక్కడలేని గౌరవమూ ముంచుకు వస్తూంది.'

సగటు భారతీయుడైన ఆ గూర్ఖా కూడా ఆ నమ్రతా భావంతోనే లేచి నిలబడ్డాడు.

"కౌన్ హో!....క్యా చాహతే హై ఆప్ కో!" అంటూ రెండడుగులు ముందుకు వేశాడు.

అయితే కారు బ్యాక్ డోర్ తెరచుకొని, పిల్లిలా అడుగులు వేస్తూ వెనుకనుండి వస్తూన్న మరో ఆకారాన్ని అతడు గమనించలేదు.

మొదటి యువకుడు కోటు జేబులోనుండి ఒక విజిటింగ్ కార్డుతీసి, గూర్ఖా చేతికిచ్చాడు. కార్డును చేతితో పట్టుకొని దానిలోని అక్షరాలను చూడటానికి కాస్త తల వంచాడు గూర్ఖా.

అంతే! పిడుగుపాటులా అతడి మెడమీద పడిందొక దెబ్బ. అరచేతిని కత్తిలా బిగించి, వెనుకనుండి వచ్చిన రెండవ యువకుడు కొట్టిన ఆ దెబ్బకు అతడి మెడ నరాలన్నీ కమిలిపోయాయి. చిన్నగా మూల్గుతూ వెనక్కు వ్రాలిపోయాడతడు.

తెలివితప్పి పడివున్న గూర్ఖాను ఎత్తి పట్టుకున్నారు ఇద్దరు యువకులు. కారులో నుండి దిగిన మూడవ యువకుడు మెయిన్ గేటు తెరిచాడు. గూర్ఖాను క్రోటన్ మొక్కల చాటున పడేసి, మెయిన్ గేటును మామూలుగా మూసేశారు.

ఆ తరువాత నిర్భయంగా వారా బంగళాలోనికి ప్రవేశించారు. నీటి పంపు పట్టుకొని పైకి ఎక్కి రెండవ అంతస్థును చేరుకున్నారు.

వారిలో ఏ విధమైన అలజడీ లేదు. వారి అడుగుల్లో తడబాటుకూడా లేదు. ఆ యిల్లు, ఆ యింటిలో వుండే మనుషులు అంతా వారికి క్షుణ్ణంగా తెలిసినట్లే వుంది వారి ప్రవర్తన.

అది ఒక డాక్టర్ యిల్లు. ఏభయి సంవత్సరాల వయసుంటుంది అతడికి. డాక్టరు, అతడి భార్య, వారి ఒక్కగానొక్క కుమార్తె అరుణ. అంత పెద్ద బంగళాలోనూ వుండేది వారు ముగ్గురే.

బాల్కనీ ప్రక్కనున్న గది కిటికీని సమీపించారు వారు. ఆ గది కిటికీ తలుపు తెరచి వుంది. నీలి రంగు బెడ్ లైట్ కాంతిలో మంచంమీద పడుకుని వున్న అరుణ రూపం అస్పష్టంగా కన్పిస్తూంది. వారు కిటికీలో నుండి గదిలోనికి ప్రవేశించారు. ఆమె పడుకున్న బెడ్‌వైపు నెమ్మదిగా అడుగులు వేశారు.

ఒక యువకుడు జేబులోనుండి చిన్న పోలిథిన్ కవర్‌ను పైకితీశాడు. కవరును చించి అరచేతిలో వంచాడు.

చిన్న, చిన్న గింజల పరిమాణంలో ఉన్న తెల్లని స్ఫటికలు ఆ పోలిథిన్ కవర్‌లోనుండి జల, జల రాలాయి. వాటిని చూసేసరికి వారి ముగ్గురి కళ్ళల్లోనికి ఏదో క్రొత్త వెలుగు వచ్చింది. వారు తలా రెండు స్ఫటికలను తీసుకొని నోటిలో వేసుకున్నారు.

అంతే! కొద్ది సెకన్లలో వారిలో అనూహ్యమైన మార్పు వచ్చింది. కామంతో వారి కళ్ళు ఎర్రబడ్డాయి. పట్టలేని ఉద్రేకంతో వారి శరీరాలు సన్నగా వణకసాగాయి. ఏదో పిశాచం ఆవహించినట్లు వారి ముఖాలు వికృతంగా మారసాగాయి.

వారి వెనుకనే బంగళాలోనికి ప్రవేశించిన రాంకుమార్ కిటికీ చాటున దాక్కు , వారిలోని ఆ వింత మార్పును గమనించసాగాడు.

అంతవరకూ మామూలుగా వున్న వారు, ఆ స్ఫటి కాలను మ్రింగగానే....ఒక్కసారిగా కామ పిశాచాల్లా ఎందుకు మారారో అతడికి అర్థంకాలేదు.

వారికి శరీరాలు గాలిలో తే తున్నట్లుగా వుంది. ఏదో తెలియని మత్తు వారి నరనరాలకు ప్రాకి వారికి వివ శత్వం లిస్తూంది. వారు త మ క ం గా అరుణ వైపు చూశారు.

పల చని నైట్ గౌన్ లో నుండి ఆమె తెల్లని శరీరం పాలరాయిలా మెరుస్తూంది. బరువుగా తీస్తున్న ఊపిరికి ఆమె ఎద పొంగులు మరింత బరువుగా కదులుతున్నాయి.

వారు ఆత్రంగా ఆమె మీదకు వంగారు. అదే సమ యంలో రాంకుమార్ చేతి ని కెమేరా క్లిక్‌మంది. ఆ ఫ్లాష్‌కు వారు కళ్ళు చిట్లించారు. అతడి వైపు తిరిగారు. మరోసారి కెమేరాను క్లిక్‌మనిపించాడు అతడు. అతడి మరో చేతిలో రివాల్వర్ వుంది.

వారిని రెడ్ హాండెడ్‌గా పట్టుకున్నా. వారు విదేశీ యులు కాబట్టి. వారిని ప్రాసిక్యూట్ చేయడానికి ఆ మాత్రం ఆధారాలు ఉండాలి. అందుకే ఆ ఫోటోలు తీశాడు రాంకుమార్.

ఆ తర్వాత వాళ్ళను లొంగదీసుకోవటం అతనికి పెద్ద కష్టమేమీ కాలేదు. నాలుగు జూడో దెబ్బలకే నేలకరిచారు. గదిలో హడావిడికి నిద్ర మేల్కొన్న అరుణ వాళ్ళను చూసి తెల్లబోయింది.

5

పోలీస్‌స్టేషన్‌లో ఆ పట్టుబడ్డ విదేశీయులనుండి రహ స్యాలను కక్కించడానికి యెంతోసేపు కష్టపడనవసరం లేకపోయింది.

వారు ప్రొఫెషనల్ క్రిమినల్స్ కాదు. నాలుగు లాఠీ దెబ్బలు వంటిమీద పడటంతోనే వారు నోళ్ళు తెరిచారు. వారు అడిక్ట్స్.

విదేశీయుల్లో డ్రగ్స్ తీసుకోవడం అనేది చాలా చిన్న విషయం. అయితే వారు తీసుకుంటున్నది మామూలుగా ఇండియాలో లభ్యమయ్యే....మార్జివోనా, హషిష్, ఎల్. ఎస్.డి. హీరాయిన్ వంటి సాధారణమైన డ్రగ్స్ కావు.

తెల్లగా, స్వచ్ఛంగా స్ఫటికాలలా మెరుస్తూ, తీసు కున్న వెంటనే మనుషులను కామపిశాచాల్లా మార్చే ఆ డ్రగ్ పేరు విన్న వెంటనే....రాంకుమార్ తల తిరిగి పోయింది.

అది....క్రాక్....కేవలం న్యూయార్క్‌లో మాత్రమే లభ్యం అవుతున్న క్రొత్తరకం కోకైన్ పదార్థం. ఇది ఉపయోగించేవారికి సెక్సుపరమైన ఆకలి అధికమవు తుంది. ఎన్నడూ ప్రయోగించని కొత్త విధానాలను కామ క్రీడల్లో ఉపయోగించాలని వీరు ఆరాటపడుతుంటారు.

ఆ డ్రగ్ తీసుకున్నాక వారిలో విచక్షణాజ్ఞానం లోపి స్తుంది. కేవలం కామం తప్ప వారికింకో ఆలోచన ఉండదు. తమ కోరిక తీర్చుకోవడం కోసం ఆ సమ యంలో వారెంతకైనా తెగిస్తారు. రాక్షసుల్లా ప్రవర్తి స్తారు.

కోకైన్‌ను ఇంట్రవెనస్ ఇంజక్షన్స్‌గా వాడుతుంటారు అని రాంకుమార్‌కు తెలుసు. కాని క్రాక్స్ అవి పిలవ

బడుతున్న ఈ కోకైన్ పదార్థం స్ఫటికాల రూపంలో వుంది. అదే అర్థంకాలేదు అతడికి.

"స్ఫటికాల రూపంలో వున్న క్రాక్‌ను రాక్స్ అంటారని, రాక్స్ అమ్మే దుకాణాలను క్రాక్ హౌసెస్ అంటారని మాత్రమే చెప్పగలిగారు ఆ విదేశీయులు. కోకైన్ శుద్ధిచేస్తే క్రాక్ అవుతుందని మాత్రమే వారికి తెలుసు. కాని ఆ శుద్ధి చేస్తున్న క్రాక్‌ను సరఫరా చేస్తున్న దెవరో వారికికూడా తెలియదు.

అంతకంటే వారి దగ్గరనుండి ఏ సమాచారం లభ్యం కాదని ధృవపరచుకున్నాక రాంకుమార్ బయటకు నడిచాడు.

ఆ విదేశీయులు మాత్రం రిమాండ్‌లోనే ఉంచబడ్డారు. ఐ.జి. గణేశన్ వారిమీద ఛార్జిషీట్ దాఖలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నాడు. అయితే రాంకుమార్ ధ్యేయం మాత్రం కేవలం ఈ హంతకులను పట్టుకోవడం కాదు. అమాయక యువకులను కామపిశాచాల్లా మారుస్తున్న ఆ క్రాక్ రాకెట్‌ను ఛేదించడం. ఆ రాకెట్‌ను అంతం చేయనినాడు మళ్ళీ, మళ్ళీ క్రొత్త కామ పిశాచాలు పుడు తూనే వుంటాయని అతడికి బాగా తెలుసు.

6

ఆరోవిల్లి ....

ఆలివ్ గ్రీన్‌కలర్ మారుతీ కారొకటి సర్రమని దూసు కుంటూ వచ్చి ఆ ఫ్యాన్సీ స్టోరు ముందు ఆగింది.

అది చాలా చిన్న షాపు. ఊరికి దూరంగా ఉండటం చేత దానికి వచ్చే కస్టమర్ల సంఖ్యకూడా తక్కువే. కౌంటర్‌లో కూర్చుని వున్న మధ్య వయస్కుడు యేదో పాత ఇంగ్లీష్ మాగజైన్ చదువుకుంటున్నాడు తీరిగ్గా.

కారులోనుండి హుందాగా దిగిన యువకుని వంక

సాదరంగా చూసాడతడు. భుజాలమీదకు పడుతున్న వత్తయిన రాగి రంగు జుత్తు. నీలిరంగు కళ్ళు. ఆంగ్లో ఇండియన్‌లా ఉన్నాడా యువకుడు. నిర్లక్ష్యంగా నడుచుకుంటూ షాపును సమీపించాడు అతడు.

"ఏం కావాలి సర్" నమ్రతగా అన్నాడు కౌంటర్‌లోని వ్యక్తి.

"మా హౌస్ క్రాక్స్ ఇచ్చింది. మీరేమైనా ఏర్పాటు చేయగలరా?" అన్నాడా యువకుడు క్రాక్స్ అన్న పదాన్ని సాధ్యమైనంత వత్తి పలుకుతూ.

క్రాక్స్ అన్నమాట వినగానే కౌంటర్‌ర్‌లోని వ్యక్తి ముఖం వికసించింది.

"ఏర్పాట్లేమిటో" అన్నాడతడు సాలోచనగా.

"రాక్స్ ఇన్ ద క్రాక్ హౌస్" అన్నాడా యువకుడు నవ్వుతూ.

నిజానికది ఫ్యాన్సీ స్టోర్ కాదు. రాక్స్ నమ్మే షాపు. అంటే క్రాక్ అన్నమాట. ఎంతో రహస్యంగా జరిగే తమ డ్రగ్ బిజినెస్ మరింత పకడ్బందీగా జరగడానికి వారా కోడ్‌వర్డ్స్‌ను పెట్టుకున్నారు. ఆ కోడ్‌వర్డ్స్ చెప్పిన వారికి మాత్రమే ఆ మత్తుపదార్థాలు అమ్మబడతాయి.

"ఎన్ని....?"

"ఫైవ్ హండ్రెడ్ పాకెట్స్."

ఆశ్చర్యంగా నోరు తెరిచాడు ఆ వ్యక్తి. అయిదు వందల పాకెట్లంటే కనీసం పది లక్షల రూపాయలైనా ఉంటుంది.

"అంత స్టాకు నా దగ్గరుండదు. కావాలంటే మీకు రేపటికి ఏర్పాటు చేస్తాను" అన్నాడతడు ఆశగా.

"ఉహూఁ కుదరదు. నా కిప్పుడే కావాలి. కావాలంటే మీకు టెన్‌పర్సెంట్ కమీషన్ యిస్తాను."

అతడివంక ఓరకంట చూస్తూ అన్నాడు ఆ యువకుడు 'పదిశాతం' కమీషన్ అన్నా లక్షరూపాయలు. కాని, క్రాక్ ఫ్యాక్టరీకి క్రొత్తవాడిని తీసుకువెళ్లడం మంచిదికాదేమో! చూస్తూ, చూస్తూ లక్షరూపాయలు ఎలా వదలుకోవడం? ఆలోచనలో పడ్డాడు ఆ వ్యక్తి.

జేబులోనుండి రెండు అమెరికన్ డాలర్ల కట్టలను తీసి కౌంటర్‌మీదకు విసిరాడా యువకుడు. ఆ కట్టలను చూసిన వెంటనే అతడి కళ్ళు ఆశతో మెరిసాయి. అదీ డాలర్లు అంటే మాటలా.

"మీకు వీలుకాకుంటే చెప్పండి. నేను యింకో పార్టీని చూసుకుంటాను" అన్నాడా యువకుడు.

నిజమే! ఆరోవిల్లిలో క్రాక్ హౌస్‌లకు కొదవేం లేదు. తను కాదంటే అతడు మరో పార్టీని ఎప్రోచ్ అవుతాడు. పోనీ, ఆ యువకుడ్ని అక్కడే ఉండమని చెప్పి, తను ప్యాక్టరీకి వెళ్లి స్టాకు తెద్దామంటే ఈలోగా ఆ యువకుడు చేజారిపోతే!

లక్షరూపాయలు అమ్మో!

బిజినెస్ అన్నాక ఆ మాత్రం రిస్క్ చేయాలి. ఈ ఒక్కసారికి అతడిని ఫ్యాక్టరికీ తీసుకువెళితే తప్పేమిటి?

అతడో నిశ్చయానికి వచ్చినటు కౌంటర్‌లో నుండి లేచాడు. ఆ నోట్లకట్టలను తీసి జేబులో పెట్టుకున్నాడు. షాపును క్లోజ్ చేశాడు 'పదండి' అంటూ కారువైపు నడిచాడు.

"చూడండి సర్. మీకోసం నేను రిస్క్ తీసుకుంటు

న్నాను. ఎవ్వరినీ తీసుకు రాకూడని ప్రదేశానికి యిప్పుడు మనం వెళ్తున్నాం. కాకుంటే. మీరేం అనుకోనంటే. మీ కళ్ళకు గంతలు కట్టి తీసుకువెళ్తాను" అన్నా డతను.

మౌనంగా తలాడించాడు ఆ యువకుడు. నల్లని గుడ్డను ఆ యువకుని కళ్ళకు గంతలు కట్టి, అతడు బ్యాకుసీటులో కూర్చున్నాక కారును స్టార్ట్ చేసా డతడు.

ఆరోవిల్లి స్వరూపమే విచిత్రంగా ఉంటుంది. 2,500 ఎకరాలలో నిర్మింపబడ్డ ఆ నగరం నిజానికి కొన్ని వందల వేల చిన్న, చిన్న పల్లెలుగా నిర్మింపబడింది.

ఒకచోట ఇరవై, ముప్ఫయి కట్టడాలుంటాయి. ఆ తరువాత కొన్ని ఎకరాల మేర పొలాలూ, తోటలూ మళ్ళీ అక్కడ మరో ముప్ఫయి కట్టడాలు. మొత్తం ఆరోవిల్లి నగర నిర్మాణమంతా అలాగే ఉంటుంది. కట్టడాల ప్లాన్, ఆకారం, రంగులు అంతా ఒకే మోస్తరుగా ఉంటాయి. కాబట్టి ఏ ప్రదేశం ఎక్కడో గుర్తుపట్టడం చాలా కష్టం. అందులో కళ్ళకు గంతలు కట్టాక తను ఏ ప్రదేశానికి చేరుకున్నాడో గుర్తుపట్టడం ఆ బ్రహ్మతరంకూడా కాదు. అందులో అతడు కారును రకరకాల ప్రదేశాలలో త్రిప్పి, సుమారు గంటన్నర సేపటి తరువాత ఒక విశాలమైన కాంపౌండ్‌లో ఆపాడు. వారిద్దరూ కారులోనుండి దిగారు.

అత్యంత అధునాతనమైన బంగాళాలోనికి ప్రవేశించారు వారు. ఆ యువకుని చేతిలో బరువైన సూట్ కేస్ ఉంది. ఆ సూట్ కేస్‌లో పెళపెళలాడుతున్న సరికొత్త నోట్లను చూసాకే ఆ యువకుణ్ని ఆ రహస్య స్థావరానికి తీసుకు వచ్చా డతడు.

వారు పెద్ద హాలులో ప్రవేశించారు. ఆ యువకుని కళ్ళకున్న గంతలు విప్పాడతడు. ఆ హాలులోని ఆధునిక యంత్రాలను చూసేసరికి ఆ యువకుని కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

ఒక పెద్ద స్టీలుడ్రమ్‌లోనికి ఒక పైపుగుండా కొకైన్ మరో పైపుగుండా ఈథర్ వచ్చిపడుతున్నాయి. స్టీల్ డ్రమ్ గిర, గిరా తిరుగుతూ ఆ రెండిటిని బాగుగా మిశ్రమం చేస్తుంది. ముద్దలా తయారయిన ఆ మిశ్రమం సన్నని గాజు ట్యూబులోనికి ప్రవహిస్తూంది. గాజుట్యూబు క్రిందనున్న గ్యాస్ బర్నర్స్ నుండి సన్నని సెగలా మంటలు వస్తున్నాయి.

ట్యూబులో వేడిచేయబడిన ఆ పదార్థం ట్యూబు చివరి వరకూ వచ్చాక ఫిల్టర్ చేయబడి ఒక్కొక్క చుక్కా ప్రక్కనున్న గాజు ట్రేలో పడుతూంది. గాజు ట్రేలోని డిస్టెల్ వాటర్‌లో ఆ చుక్కలు పడిన వెంటనే ఘనీభవించి స్ఫటికాలలా మారుతున్నాయి.

"ఓహో....రాక్స్!" అప్రయత్నంగా ఆ యువకుని పెదాలు వీడి వచ్చాయా పదాలు. అవునన్నట్లు తల పంకించాడా వ్యక్తి.

వారిద్దరూ ఒక గదిలోనికి ప్రవేశించారు. ఆ గదిలో కూర్చుని ఉన్నాడు ఆరోవిల్లిలోని రాక్స్ రాకెట్‌కు మూల కారకుడైన వ్యక్తి.

అతడిని చూసిన వెంటనే....ఆరోవిల్లిలో ఈ మత్తు పదార్థాల వ్యాపారం ఎందుకంత రహస్యంగా జరుగుతోందో అర్థం అయిపోయిందా యువకునికి.

ఆ రింగ్‌మాష్టర్ ఎవరో కాదు. ఆరోవిల్లి ట్రస్ట్ చీఫ్

సెక్రటరీ గోవిందనాయర్.

సోఫాల్లో కూర్చున్నాక, తాము వచ్చిన పనేమిటో గోవిందనాయర్‌కు వినయంగా వివరించాడు షాప్ కీపర్. యువకుడు సూట్‌కేసును తెరచాడు. దానిలోని నోట్లకట్టల వంక సంతృప్తిగా చూశాడు గోవిందనాయర్. వారిద్దరూ ఆదరంగా షేక్‌హాండ్స్ యిచ్చుకున్నారు.

అదే సమయంలో ఒక అనుచరుడు రొప్పుకుంటూ లోపలకు వచ్చాడు.

"బాస్! ఐ.జి. గణేశన్ స్పెషల్ ఫోర్స్‌తో మన భవనాన్ని చుట్టుముట్టారు. ఐ.జి. అప్పుడే లోపలకు ప్రవేశించారు" అన్నాడు వగరుస్తూ.

నమ్మలేనట్లు చూశాడు గోవిందనాయర్. అతడి కళ్ళల్లో మొదట ఆశ్చర్యం ఆ తరువాత భయం! షాప్‌కీపర్ అనుమానంగా ఆ యువకునివంక చూశాడు. అవునన్నట్లు తల పంకించాడా యువకుడు.

"నా కళ్ళకుమాత్రం గంతలు కట్టగలిగావు మిస్టర్. కాని నా చేతికున్న వాచీ ఒక మినీ ట్రాన్స్‌మీటర్. మీ స్థావరాన్ని చేరుకోవడానికి ఐ.జి. కి దారిచూపుతూ సంకేతాలు పంపింది ఇదే" అన్నాడతడు నవ్వుతూ.

పరిస్థితి విషమించిందని గ్రహించాడు గోవిందనాయర్. మెల్లగా రెండడుగులు వెనక్కు వేశాడు.

"హాల్ట్‌దేర్ మిస్టర్ గోవింద నాయర్! కదలడానికి ప్రయత్నిస్తే నిర్దాక్షిణ్యంగా కాల్చిపారేస్తాను" కటువుగా పలికింది ఆ యువకుని గొంతు. అతడి చేతిలో బుసలు కొడుతున్న కాలనాగులా నల్లని రివాల్వర్ తళ తళ మెరుస్తూంది.

"ఎవరు....నువ్వు?" గోవిందనాయర్ గొంతు హీనంగా పలికింది.

తలకున్న విగ్గును. కళ్ళకు పెట్టుకున్న నీలిరంగు కాంటాక్ట్ లెన్స్‌ను తొలగించా డా యువకుడు.

"వెల్ మిష్టర్ రాంకుమార్. యూ డిడ్ ఇట్ రియల్లీ" అప్పుడే గదిలోనికి అడుగుపెట్టిన ఐ.జి. గణేశన్ ఆ యువకుని వంక ప్రశంసాపూర్వకంగా చూస్తూ అన్నాడు.

రాంకుమార్ పెదవులు చిరునగవుతో విచ్చుకున్నాయి.

అది ఐ.జి. గణేశన్ పొగడ్తకు కాదు.

యువతను నిర్వీర్యులను చేసి. మత్తుమందులకు బానిసలు చేసి కామపిశాచాలను చేస్తున్న ఈ రాక్షస రాకెట్‌ను పట్టుకోగలిగినందుకు సంతృప్తితో మొలచిన చిరునగవు అది. □

బుజ్జిగాడి బ్యాగ్!



గంపెడు మల్లెలు

కె.బి.యస్.కుమార్

ఇవాళ నా కొచ్చిన ఉత్తరాల్లో అందమైన అక్షరాలతో 'పర్సనల్' అని రాసున్న కవ రొకటి నన్నాకర్షించింది. ముందుగా దాన్ని తీసుకుని చించాను.

పావుతావు సైజు బాండ్ పేపర్ పై వరుసలుగా పరచిన నల్లని మంచిముత్యాలు....

"హరనాథ్ గారికి,

నమస్తే,

అసంఖ్యాకమైన మీ పాఠకుల్లో నే నొకర్ని. అసమాన మీ పాఠక వాహినిలో నే నొక నీటి బిందువుని.

మీ రచనలు చాలా చదివాను. దాదాపు అన్నీ నాకు బాగా నచ్చాయి. ముఖ్యంగా గతవారం 'తేట తెలుగు' వార పత్రికలో మీ కథ 'ఎగిరిపోయిన పావురం' నాకు బాగా నచ్చింది. అసలా పేరు చూడగానే యెంతో ముచ్చటేసింది. మా బాబి గాడితో చెబితే—'పావురాలు ఎగరక—గాడిద లెగుర్తాయటే పిచ్చి మొహమా!' అని పారి పోయాడనుకోండి .... నాకు మాత్రం ఆ కథ బాగా నచ్చింది.

పోతే అపనలో గత మాసంలో వచ్చిన మీ కథ 'నేనిప్పుడే చావను' అద్భుతం. రచనల్లో మీ శైలి చూస్తోంటే నాదస్వరం విన్న నాగులా అయిపోతాను. చందమామ మొదలుకొని అపన వరకూ వెలువడుతోన్న మీ రచనలూ వాటిలోని వైవిధ్యం చూస్తోంటే నాకు కుడిచేతి చూపుడు వ్రేలు తరచూ ముక్కుపైకి వెడుతూంటుంది.

మీ స్నేహాన్ని కాంక్షిస్తున్నాను.

— వంశీప్రియ."

రచయితగా నా కిలాంటి ఉత్తరాలు కొత్తేమీకాదు. చాలమంది పిచ్చి పిచ్చిగా వ్రాస్తుంటారు. కొందరైతే పచ్చి పచ్చిగా వ్రాస్తుంటారు. నన్ను పర్సనల్‌గా కల్సు కోవాలని తాపత్రయ పడుతోంటారు.

కాని నాకున్న సమయం చాల తక్కువ. అలాగని వాటిని నిర్లక్ష్యం చెయ్యకుండా క్లుప్తంగా జవాబులు వ్రాస్తుంటాను. సారాంశం 'సారీ—నాకు వీలుకాదు' అనో లేక 'మరోసారి కలుద్దాం లెండి' అనో వుండేది.

కాని ఈ అమ్మాయి ఉత్తరం చూశాక యెందుకో ఆమెకి దగ్గర కావాలన్పించింది. ఎందుకో అంటే— ఇందులో నా స్వార్థం యేమిటంటే—

ఆమె దస్తూరీ బావుంటుంది. నా పట్ల ఆమె అభిమానం నిజమే అయితే నా రచన్లు ఫెయిర్ చెయ్యడానికి పని కొస్తుంది. అంతే.

వంశీప్రియట. ఎంత చక్కని పేరు? ఎంత చక్కని హ్యాండ్ రైటింగ్? ఈ రెంటిలాగే రూపం కూడా చక్కగా వుంటే!?

భగవంతుడు ఆమెపట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాడనే అనుకోవాలి.

లెటర్ ప్యాడ్ తీశాను.

ఏదో గుర్తొచ్చి అనుమానంగా వంటింటి వైపు చూశాను. అప్పుడు స్ఫురించింది నాకు, మా శ్రీమతి పక్కింటావిడతో మేట్నీ కెళ్ళిందని.

ఉత్సాహంగా బాల్ పెన్ తీసి వ్రాయ నారంభించాను.

"....వంశీప్రియ గారికి,

శుభాకాంక్షలు. మీరు అభిమానంతో వ్రాసిన వుత్తరం అందింది. ధన్యవాదాలు. నా వయసు పాతిక. ఈ సంవత్సరమే వివాహమైంది. పోస్టల్ డిపార్ట్ మెంట్ లో వుద్యోగం. సరే — రచనా వ్యాసంగం హాబీ అని మీకు తెలుసు. ఇవీ నా గురించి వివరాలు. మీ వివరాలు తెలియజెయ్యండి.

బైదిబై - మీ దస్తూరీ విషయంలో నా కాంప్లి మెంట్స్ అందుకోండి. —వుంటాను

హరనాథ్...."

....మరోసారి చదివి కవర్లో పెట్టి అతికించాను. అడ్రస్ రాసి పక్కింటి కుర్రాడికిచ్చి పోస్టు చెయ్యమన్నాను.

మా శ్రీమతి పట్టి అనుమానం మనిషని నాకు అను మానం వుంది. కొత్తగా వివాహమైంది కాబట్టి ఇంకా నిర్ధారణ జరగలేదు.

భార్యని చదవడానికి ఇన్ని రోజులా అని మీరనుకో వచ్చు. కాని యే విషయాన్నైనా సమగ్ర పరిశీలన జరిపే వరకూ ధృవపరచుకోన్నేను. అయినా ఎక్కడా? — వివాహమైన నాలుగు మాసాల్లో మొదటి నెలంతా సిగ్గు తోనే సరిపోయింది. రెండో నెల ఆషాఢ మాసం. మూడో నెలలో యిరవై రోజులపాటు డెప్యుటేషన్ మీద నేను మరో ఊరు వెళ్ళాల్సొచ్చింది. అప్పుడే ఎలా తెల్సుకో గలను?

2

మూర్రోజుల్లో నాకు వంశీప్రియ దగ్గర్నుండి రిప్లయ్ అందింది. అది చదివాక ఇకపై నే నామెకి నా ఆఫీసు అడ్రసు ఇవ్వాలన్పించింది.

ఆఫీసుకి తీరిగ్గా వున్నప్పుడు మరోసారి వుత్తరం చదివాను.

"హరనాథ్ గారికి,

నమస్తే. నేను వ్రాయని కథను నా పేరుతో అచ్చులో చూసుకున్నంత ఆశ్చర్యం కలిగింది మీ వుత్తరాన్ని చూడగానే. అందమైన యువకుడు హఠాత్తుగా కనబడి 'నిన్ను కట్నం లేకుండా వివాహం చేసుకుంటాను, నీ

కిష్టమేనా?' అని అడిగినంత సంబరం కలిగింది, మీ వుత్తరాన్ని చూడగానే.

మీరు రిప్లయ్ ఇస్తారనీ అదీ ఇంత త్వరగా ఇస్తారనీ కలలో కూడ అనుకోలేము. అందుకు చాల థాంక్స్.

నేను బియ్యే ఫైనలియర్ చదూతున్నాను. ఇంకా వివాహం కాలేదు. తలిదండ్రుల చాటు బిడ్డనన్నమాట. కాలక్షేపం కోసం నవలలూ గట్రా చదువుతుంటాను. మీ రచనలు చదివాకనే - అవి కాలక్షేపం కోసం మాత్రమే కాదనీ విజ్ఞానాన్ని కూడ పంచగలవనీ తెల్సుకున్నాను. ఇప్పటి కివే విశేషాలు.

బై దిబై - నా దస్తూరీ గురించి మీరేదో రాశారు. మీ కాంప్లిమెంట్స్ పొందడం కోసమే భగవంతుడు నా కా వరం ఇచ్చాడనుకుంటున్నాను.

—వంశీప్రియ."

....ఈ వుత్తరాన్ని మా శ్రీమతి కంట బడేలా చేసి, ఆమె అనుమానమ్మనిషో కాదో తేల్చుకోగలను. కాని అది నా కిష్టం లేదు. ఎందుకంటే కాపురం పెట్టిన కొత్తలోనే కలతల్ని కౌగలించుకోవడమవుతుంది. పైగా నేను వంశీప్రియ స్నేహానికి దూరమయ్యే అవకాశం చేరువలో వుంటుంది. అందుకని—

వంశీప్రియ వ్రాసిన వుత్తరాన్ని చించెయ్యదల్చుకున్నాను. మొదటి వుత్తరాన్ని కూడ చించేశాను.

ఉద్యోగం పోస్టాఫీసులోనే గాబట్టి వెంటనే ఇన్లండ్ లెటర్ తెప్పించుకున్నాను.

"వంశీప్రియ గారికి,

శుభాకాంక్షలు. మీ వుత్తరంలోని మంచిముత్యాల్ని ఆత్రంగా ఏరుకున్నాను. కంటికే కాదు. మనసుకు కూడ

రుచిగా వున్నా యవి.

నా రచనలు సాహిత్యంపట్ల మీ అభిప్రాయాన్ని మార్చినందుకు ధన్యవాదాలు. రచయితగా నా ప్రయత్నా లకి కాస్త సాఫల్యం చేకూరినట్టే భావిస్తున్నాను.

బై దిబై - నేను పుస్తకం వ్రాస్తోన్న ఓ రచనలో హీరోయిన్‌కి క్రొత్తగా ఏం పేరు పెట్టాలా అని యోచి స్తున్నాను. మీరనుమతిస్తే 'వంశీప్రియ' అని పెడతాను. మీ సమాధానంకోసం ఎదురుచూస్తూ వుంటాను.

రిప్లయ్ క్రింది అడ్రసుకి వ్రాయండి.

హరనాథ్."

3

హరనాథ్ గారికి,

తెల్లవారుఝామున నాకో కల వచ్చింది. మీరే కన్పిం చారు. నే వ్రాసిన వుత్తరానికి రిప్లయ్ వ్రాసి స్వయంగా పట్టుకొచ్చి యిచ్చారు. అబ్బ! ఎంత గర్వంగా ఫీల య్యానో!

తెల్లవారుఝామున వచ్చే కలలు నిజమవుతాయంటారు. మీరు స్వయంగా రాలేకపోయినా మీ నుండి వుత్తరం వస్తుందనుకున్నాను.

వచ్చింది.

మీ (కథలోని) హీరోయిన్‌కి నా పేరు పెడతారా? అందుకు నా అనుమతి కోరుతున్నారా? నాకంత అదృష్టం వుందా? మీకు అనుమతి నే నివ్వాలా? రచయిత్రిగా నా పేరు ఎలాగూ నేను చూచుకోలేను. కనీసం మీ కథల్ని ఓ పాత్ర పేరుగానైనా నన్ను మిగిలిపోనివ్వండి.

అన్నట్టు ఏమిటా కథ? అపనకే అయితే, ఇతివృత్తా

నికి సరిపోతే 'రాక్షసుడు' అని పేరు పెట్టండి. బై దిబై-అఫీసడ్రసిచ్చారు. కొంపదీసి మీ శ్రీమతి....

—వంశీప్రియ."

వుత్తరం చదివి ఆలోచనల్లో పడ్డాను.

ఉత్తరం ఇలా వ్రాయటంలో వంశీప్రియ ఆంతర్యం ఏమై వుంటుందా అని....ఆమె వ్రాసిన కొన్ని వాక్యాలు నాలో భావసంచలనం కలిగిస్తున్నాయి. ఆమె నుంచి ఏదో పొందాలని మనసారాట పడుతోంది.

ఆమె మొదటి ఉత్తరం అందుకున్న రోజు ఆమె నుండి నే నాశించిన ప్రయోజనం వేరు. ఇప్పుడు మనసు తీసుకుంటోన్న నిర్ణయం దానికి భిన్నంగా వుంది.

ఈ వుత్తరాల్ని ఇంతటితో ఆపుచేద్దామనుకున్నాను. కాని నా నిర్ణయం వెంటనే హత్యచెయ్యబడింది. అయినా-

యిప్పుడు నేను వివాహితుణ్ని. అప్పట్లా కోతిచేష్టలు చెయ్యటానికి చట్టం అంగీకరించదు. ఏమాత్రం బెడిసి కొట్టినా నా వుద్యోగానికి చుట్టుకుంటుంది.నా భార్యదృష్టిలో చులకనయ్యే ప్రమాదం వుంది.

వంశీప్రియ విషయంలో నా మనసు రెండు భాగాలైంది. ఒకటేమో ఆమెని చూడాలనీ అల్లుకుపోవాలనీ కాంక్షిస్తోంది. మరోటేమో హితబోధ చేస్తోంది.

పెద్ద డైలమాలో పడిపోయాను.

రెండ్రోజులు ఆలోచించి విధి ఎలా నడిపిస్తుందో చూద్దాం అనుకున్నాను. చొరవగా నాకై నేను ఎ స్టెప్పూ తీసుకోదల్చుకోలేదు.

ఈ రెండ్రోజుల్లో నేను మరో పనికూడ చేశాను.... నేను రూపొందించిన ఇతివృత్తం ప్రకారం ఆ కథకి

'మృత్యుసంకేతం' అని పేరుపెట్టాలి. 'రాక్షసుడు' అని మార్చటం కోసం చాల మార్పులు చెయ్యాల్సి వచ్చింది.

ఆ రాత్రి తెల్లార్లూ కూర్చొని కథ పూర్తిచేశాను. ఉదయం ఆఫీసుకి వెళ్ళగానే ఆ వార్డు పోస్ట్‌మ్యాన్‌కి కవరిచ్చి అపన కార్యాలయంలో అందజేయమన్నాను.

4

"వంశీప్రియగారికి.

ఏమిటీ? మీ కల్లోకి నేనొచ్చానా!? చిత్రంగా వుంది. సరిగ్గా నాకూ అలాంటి కలే వచ్చింది (?) అయితే ఎలా వచ్చిందో తెల్సా?

ప్రకాశవంతమైన వెలుగు పరుచుకున్న చల్లని గదిలో ఓ మంచి టేబుల్ ముందు ఖరీదైన కుర్చీలో మీరు కూర్చొని వున్నారు. మీ ముందర తెల్లకాగితాలున్నాయి. మీ చేతిలో కలముంది.

వెయ్యిమంది ఎలిమెంటరీ స్కూలు పిల్లలు అదేపనిగా అల్లరిచేసినా చెదరని ఏకాగ్రత మీలో తొంగిచూస్తోంది.

మీరో కథ రాస్తున్నారు....

వులిక్కిపడి లేచాను. కల చెరిగిపోయింది.

అవునూ, మీలో భావప్రకటిత శక్తి బాగా వుంది. ప్రయత్నిస్తే కథలు వ్రాయగలరు. ప్రయత్నించండి. వూహూఁ....మీరు వ్రాయాలి. ఈసారి వుత్తరంతోబాటు జత చేసి పంపండి. వూహూఁ....పంపాలి. అన్నట్టు మర్చాను 'రాక్షసుడు' నవంబర్ అపనలో రాబోతున్నాడు.

హరనాథ్."

....రచయితనైన నాకు ఆమె నాకు కల్లో వచ్చినట్టుగా కథ సృష్టించడం అంత కష్టమైన పనేం కాలేదు. ఆ వుత్తరం పోస్టుచేసిన వారం వరకూ ఎదురుచూశాను,

రిప్లయ్ రాలేదు.

నాకేమి అంతుబట్టలేదు. దాదాపు పదిరోజులు కావ స్తోన్నా ఎందుకు ఆమెనుండి బదులు రాలేదు? ఆరోగ్యం బాగోలేదా? వుత్తరం సంగతి వాళ్ళవాళ్ళకి తెల్సిపోయి—వాళ్ళు మందలించడంతో మానేసిందా? అసలామె మొదటి నుండీ ఇంటి అడ్రసే ఇచ్చింది. తనకొచ్చే వుత్తరాలు తలిదండ్రులు సెన్సార్ చేసే పనైతే కాలేజీ అడ్రస్ ఇచ్చి వుండేది కదా?!

ట్రాన్స్ఫర్‌లాంటిదేమైనా జరిగిందా? దానికీ నాకు వుత్తరం వ్రాయక పోవడానికీ సంబంధం ఏమిటీ? వివాహమో గివాహమో సెటిలైందా? అయినంతమాత్రాన స్నేహితుడికి వుత్తరం రాయకూడదన్న రూలేమీలేదు కదా!?

ఏమిటో! నెలక్రితం ఆమె ఎవరో, నాకు తెలియని నా పాఠకురాలు. ఆ తర్వాత పరిచయం. తర్వాతి మలుపు స్నేహం. కాని నేనామెని కేవలం స్నేహితురాల్లా చూళ్ళేక పోతున్నాను. ఆమె వుత్తరం రాకపోతే పిచ్చెక్కుతోంది. ఆమెని గూర్చి ఆలోచించకుండా వుండలేకపోతున్నాను.

ఇప్పుడు ఆమె వుత్తరం రాయలేక పోవడానిక్కారణం నా కంతుబట్టకుండా వుంది. ఆలోచిస్తూ సిగరెట్ వెల్గించాను. సిగరెట్ అయిపోయేసరికి నా బుర్రలో బల్బు వెలిగింది.

ఈసారి వుత్తరంతోబాటు కథ పంపమని రాశాగదా!

పాపం....కథ వ్రాస్తూంటుంది. ఆ ప్రయత్నంలో బుర్ర బద్దలు కొట్టుకుంటూ కాగితాలు చించుకుంటూ వుంటుంది.

అలా తృప్తిపడ్డా, ఆ రాత్రి నిద్రపట్టలేదు నాకు.

ఎప్పుడో మూడు తర్వాత నిద్రపట్టింది.

అప్పుడు నిజంగానే కల్లోకొచ్చింది వంశీప్రియ.

5

మరో రెండ్రోజుల తర్వాత నా తలపై నా తలపులపై నా మల్లెలు కురిపిస్తూ వంశీప్రియ నుండి వుత్తర మొచ్చింది. ఉద్వేగంతో వణుకుతోన్న చేతుల్తో కవరు చించాను.

"హరనాథ్ గారికి,

కష్టపడి కథ కొంతవరకూ రాయగలిగాను. అయితే దీంతోబాటు పంపలేకపోతున్నందుకు మన్నించండి. ఓ వుత్తరం దగ్గర ఆగిపోయింది. దాదాపు అంతా పూర్తయి నట్టే. అయితే ఆ వుత్తరం ఎలా రాయాలి? అందులో సబ్జక్టు మనసుకి హత్తుకునేలా రాసే విధానం నాకు తెలీటం లేదు. క్లుప్తంగా ఇతివృత్తం జతపరుస్తున్నాను. ఆ వుత్తరం మీరే వ్రాయరూ!

మీ కథలో నా పేరుని మీ హీరోయిన్‌కి పెట్టుకున్నారు. అలాగే మీ వుత్తరాన్ని నా రచనలో—మీ ప్రోత్సాహంపై నేను వ్రాస్తోన్న నా రచనలో చూసుకునే అవకాశం యిస్తారు కదూ! వ్రాసి, నన్ను గమ్యం చేరుస్తారు కదూ!!

నేను ఎన్నిక చేసిన పేరుని మీ రచనకి పెట్టనందుకు ఓ బండెడు ధన్యవాదాలు! (ఎమ్. జి. లో బుక్ చేశాను. పార్సిల్ విడిపించుకోండి;)

వుంటామరి—కథ పూర్తిచేసి మీకే పంపిస్తాను. శ్రమనుకోక తప్పులు దిద్దండి. — వంశీప్రియ"

వుత్తరంలో చివరి వాక్యాలు నన్నానందపరిచాయి. వుత్తరానికి ఎన్‌క్లోజ్ చేసున్న మరో కాయితం చూశాను.

ఇతివృత్తం పాతదే! ఓ యువతి-యువకుడు ప్రేమించు

కుంటారు. ఆ ప్రేమికుడు మోసగాడు. ఆమెని బాగా నమ్మిస్తాడు. పూర్తిగా దోచుకుంటాడు. ఆ తర్వాత నువ్వెవరో నాకు తెలీదు పొమ్మంటాడు. ఆమె నిరసపడుతుంది, రకరకాలుగా ప్రాధేయపడుతుంది, విన్పించుకోడు. ఆమె సమయం కనిపెట్టి అతన్ని హతమార్చి తనూ చనిపోవాలని చూస్తుంది. అది గ్రహిస్తాడు మోసగాడు. ఆడది తల్చుకుంటే ఏమైనా చెయ్యగలదని భావిస్తాడు. భయకంపితుడవుతాడు.

ఇలా కథంతా గజిబిజిగా సాగింది. ఇతివృత్తంలో అంతా కన్ఫ్యూజనే. శిల్పం బొత్తిగా లేదనే చెప్పాలి. ప్లాట్ రూపొందించుకోవడంలోనే దెబ్బతింది. ఇక కథెలా వ్రాయగలదు??

అయినా మాటిచ్చాను. ఎంకరేజ్ చేశాను. కాబట్టి ఆమె కోరింది వ్రాస్తాను. ఆ రచన ఎటూ నాకే వస్తుంది గాబట్టి ఆ తర్వాత నేను చూసుకుంటాను.

నేను వ్రాసే వుత్తరానికీ కథకీ సంబంధం వుంటుందా? తర్వాత చూసుకోవచ్చన్న ఆలోచన నన్ను ఆలోచించ నివ్వలేదు. కాగితం, కలం అందుకున్నాను.

ఇప్పుడు నేను వాళ్ళు ప్రేమించుకునే కాలంలో— అంటే మోసం చెయ్యకముందన్నమాట—అతడు ఆమెకు వ్రాసిన ప్రేమలేఖ వ్రాయాలి. పేర్లుగూడ సూచించింది వంశీప్రియ.

హరి, చిట్టి....

వ్రాయనారంభించాను.

"....డియర్ చిట్టీ!!

నిన్ను చూడక వారమైంది. యిన్నిరోజులు కన్పించక పోతే నేనూ నా హృదయమూ ఏంకావాలి? వట్టివేళ్ళ సుగం

ధంతో ఘుమఘుమలాడాల్సిన నా హృదయం విరహాగ్ని సోకి__పట్టిపోయింది. ఇది నీకు న్యాయమా? నన్నిలా ఉడికించడం నీకు భావ్యమా?

నీవులేక ఒక్క నిమిషమైనా గడపలేని నన్ను ఇంత శిక్షకి గురిచెయ్యటం బాగోలేదు.

లేక ....నన్ననుమానిస్తున్నావా?

నేను నిన్ను వివాహం చేసుకోననీ మోసంచేసి పారి పోతాననీ-లేదా దబాయించి తప్పించుకుంటాననీ-నిర్లక్ష్యం చేసి అవమానిస్తాననీ అనుమానిస్తున్నావా?

నీకోసం ఆత్రంగా ఎదురుచూసే నా కళ్ళనడుగు. సత్యం చెబుతాయి. ఉద్వేగంతో మాటిమాటికీ తపిస్తోన్న నా దేహాన్నడుగు. నిజం కన్పిస్తుంది. నీ తలపులు మదిలో ప్రవేశించగానే బిరబిరా ప్రవహించే నా రక్తాన్నడుగు. నిజం తెల్సుకోగల్గుతావు. నువ్వు దూరమైతే ఆగిపోయే నా గుండెనడుగు. నిజాన్ని వివరిస్తుంది.

నీకోసం విరహంతో ఎదురుచూస్తూ....

నీ

హరి...."

మరోసారి చదువుకున్నాను. ఇంతకుమించి అనవసరం అన్పించింది. ఆమె ప్లాట్ చివర సూచించిన పాయింట్లన్నీ వుత్తరంలో వచ్చాయో లేదో సరిజూసుకున్నాను. తృప్తిగా తలపంకించి లెటర్‌ప్యాడ్ అందుకున్నాను.

"వంశీ ప్రియగారికి,

మీ వుత్తరమూ ప్లాటూ అందాయి. ప్లాట్ కాస్త గజి బిజిగా వుంది. మనం పర్సనల్‌గా కల్సుకొని వుంటే బాగుండేది. ప్లాట్ గూర్చిన డిస్కషన్‌కి వీలుండేది. మనం తొలిసారిగా కల్సుకున్నట్టూ వుండేది. మీ కోరిక కాదన్లేక

మీరు కోరిన విధంగా వుత్తరమైతే రాశానుగాని అదిమీకు సవ్యంగా ఉపకరిస్తుందో లేదో నని అనుమానంగా వుంది.

ఎనీహౌ వుత్తరాన్ని జతపరచి పంపుతున్నాను. మరో విషయం. 'చిట్టి' అన్నది ముద్దుపేరు. హీరోయిన్ అసలు పేరు వ్రాసివుంటే ఇంకా బావుండేది. సరే. కథ పూర్తయ్యాక పంపండి.

మీరు త్వరగా రచయిత్రి కావాలని కోరుకుంటున్నాను.

హరనాథ్."

చివరి వాక్యం చదివి—మరోసారి నవ్వుకున్నాను. ఆమె నాకు వ్రాసిన లెటర్ని రొటీన్‌గా చించివేసి, ఆమె పంపిన ఇతివృత్తం, కథకోసం వ్రాసిన లెటరూ దీనికి జతపరచి పోస్టు చేశాను.

6

"సర్—మీకు ఫోనొచ్చింది...." ఇ.డి. ప్యాకర్ వచ్చి చెప్పాడు.

యివాళ మా శ్రీమతి నన్ను త్వరగా రమ్మంది. 'ఆలా పన సిన్మాకెళ్ళాలిట....

మళ్ళీ గుర్తుచెయ్యటం కోసం కాబోలు....అనుకుంటూ ఫోనువద్దకి వెళ్ళి - రిసీవరందుకున్నాను.

"...హలో...."

"కథ పూర్తయిపోయింది మిష్టర్ హరనాథ్" అవతల్నుండి కరకుగా విన్పించింది ఓ ఆడకంఠం.

"ఎవరు మీరు?" కోపంగా, సందిగ్ధంగా అడిగాను.

"మీరు కథకోసం ఎవరికైతే వుత్తరం వ్రాసిచ్చి పోస్టు చేస్తూ 'కథ పూర్తయ్యాక పంపండి....' అని రాశారో."

"యూ మీన్....వంశీప్రియ!?

"నో వంశీప్రియ—నథింగ్!!"

"అంటే....?" అయోమయంగా అడిగాను.

"ఆ పేరు, ఆ ఉత్తరాలు, వాటిలోని సన్నివేశాలు కేవలం కల్పితాలు. ఎవ్వర్నీ వుద్దేశించి వ్రాసినవి కావు."

"ఏమిటీ నాటకం?"

"షటప్!! ఎవరిదిరా నాటకం? హీరోయిన్ అసలు పేరు వ్రాసివుంటే బావుండేదని సలహా పారేశావు. అసలు పేరే రాసుంటే నువ్వా వుత్తరం వ్రాసుండేవాడివా? సరే. అసలు పేరు మాలతి!"

"మాలతి!?"

నా గుండెల్లో బాంబులు పడ్డాయి. మాలతి!! ఒక నాటి....

"....ఏం? గుర్తొచ్చిందా? దాన్ని నమ్మించి గొంతు కోశావు. చెయ్యాల్సిందల్లా చేసి, నాన్న చావు బతుకుల్లో వుంటూ హఠాత్తుగా నీ పెళ్ళి ఖాయం చేశారని మొసలి కన్నీరు కార్చావు. అది నిన్ను నమ్మి అన్నివిధాలా మోస పోయింది. నీకు తెల్సా. మాలతి చచ్చిపోయింది...."

"....నిజమా!?" అన్నాను హీనస్వరంతో.

"అవ్రా ఇడియట్!!"

"ఇంతకీ....నువ్వు....నువ్వు...."

"నేనా! ఇన్నాళ్లూ వంశీప్రియ పేరుతో చెలామణీ అయిన జ్యోతిర్లతని! మాలతి చెల్లెల్ని!!"

నాకు నోట మాటరాలేదు.

"నువ్వు చేసిన మోసానికి ఫలితంగా అది కడుపు తెచ్చుకుంది. ముభావంగా వుంటోన్నదాన్ని చూసి ఓ రోజు నిలదీశాను. అంతా చెప్పి భోరుమంది. ఓదార్చాను. ధైర్యం చెప్పాను.

నీ గురించి పరిశోధన సాగించాను. నీకు ముసలి నాన్న లేడు; ముసలి తల్లీ లేదు!! మాకు వ్యాపారంలో నష్టం వచ్చిందనీ నీకు గిట్టుబాటు వుండదనీ భావించి - ఎటూ మోజు తీరిందిగదాని దాన్ని కాలదన్నావు.

నువ్వు రాసిన వుత్తరా లున్నాయేమోనని చూశాను. అక్క నడిగాను. అయిదో ఆరో వుంటే చించేశానని చెప్పింది. అప్పుడే నాలో పథకం రూపు దిద్దుకుంది. నిన్ను పట్టాలంటే మాకు ఎలిబీ కావాలి. మా అక్కని కాదన్న నిన్ను కనీసం దాన్ని గురించి ఆలోచనైనా లేకుండా నిర్భయంగా మరో పెళ్ళి చేసుకొని కులుకుతోన్న నిన్ను రచ్చకీడ్చి నలుగుర్లో నిలదీయాలన్న పట్టుదల ఏర్పడింది.

వంశీప్రియగా పరిచయ మయ్యాను.

మా అక్క తొందర మనిషి. పైగా వేవిళ్ళు మొదలయ్యాయి. ఇంట్లో తెలిస్తే చంపేస్తారని ఆత్మహత్య చేసుకుంది.

ఆ వారం పది రోజులూ అందుకే నీకు వుత్తరం వ్రాయలేకపోయాను.

ఆ తర్వాత పట్టుదల విజృంభించింది. పోలీసులకి ఫోన్ చేసి పిలిపించి ఆత్మహత్యగా వివరించి కారకుడివి నువ్వేనని నెత్తీ నోరూ కొట్టుకున్నాను. కాని వాళ్ళు అశక్తత వ్యక్తపరిచారు. అక్క ఆత్మహత్యకి కారణం నువ్వేనని ఋజువయితే తప్ప - సంఘంలో రచయితగా పేరు తెచ్చుకున్న నిన్ను లొంగదీసుకోవడం అసాధ్యమని చెప్పారు. 'వారం లోగా అలాంటి ఋజువులు తేగలిగితే వాడి అంతు చూస్తాం' అన్నారు.

మాలతి ముద్దు పేరు చిట్టి. నీ ముద్దుపేరు 'హరిగా'

పోలీసులు తప్పక నమ్ముతారు. నువ్విప్పుడు కథ కోసం నీ దస్తూరితో వ్రాసిన వుత్తరం మా అక్కకి వ్రాసిన ప్రేమలేఖగా పోలీసులకి ఎగ్జిబిట్ చేస్తాను. వంశీప్రియగా నేను వ్రాసిన వుత్తరాల్ని నువ్వు చించివుంటావని నాకు తెల్సు. నీకు వచ్చిన వుత్తరాల్ని చించిపడేసే అలవాటుందని అక్క చెప్పింది. నన్ను గమ్యం చేర్చినందుకు ధన్యవాదాలు. మోసం చేసి ఆరోగ్యంగా ఆనందిస్తోన్న నీకు నా 'టాబ్లెట్' సరైన ఆరోగ్యాన్ని చేకూరుస్తుంది.

టి-ఎఫ్-టి....దట్ మీన్స్. టి టి ఫర్ టాట్....నీ డ్యూటీ అయిపోయేలోగా పోలీసులు అరదండాలతో నిన్ను కలుస్తారు. గుడ్ బై...." ఫోను క్లిక్ మంది.

మరో గంటలో రానున్న పోలీసులు ఇప్పుడే నాక్కనబడుతున్నారు. □

కళాచోరుడు?

మీ కళా నైపుణ్యానికి జోహార్లు దొంగగారూ!

సీరియల్

(గత సంచిక తరువాయి)

30

నరసింహం కారు దిగాడు. రెడ్ సెల్ ఆవరణలో అడుగుపెట్టాడు. చకచకా అడుగులు వేశాడు. సింహ ద్వారంవద్ద అతడికి ఫుల్ సూట్లో ఉన్న వ్యక్తి ఎదుర

య్యాడు. నరసింహం అతడికి గ్రీన్‌కార్డు చూపించాడు.

ఆ వ్యక్తి నరసింహాన్ని ఎగాదిగా చూసి-ఓ గదివైపు చూపించి "అందులోకి వెళ్ళండి" అన్నాడు.

నరసింహం ఆ గది గుమ్మాన్ని సమీపించి నెమ్మదిగా తలుపు తోశాడు. తలుపు తెరుచుకుంది. అతడు లోపల కడుగు పెట్టాడు.

తలుపు దానంతటదే మూసుకుంది.

గదిలో గోడవార నిలబడి ఉంది - నిలువెత్తు విగ్రహం. తలుపు మూసుకోగానే ఆ విగ్రహంలో చలనం కలిగింది.

నరసింహం ఆ విగ్రహం వంకే చూశాడు.

అది నెమ్మదిగా అడుగు తీసి అడుగు వేస్తోంది.

నరసింహం దాని మోకాటివరకూ వస్తాడు. అతడా విగ్రహాన్నే చూస్తున్నాడు.

విగ్రహం రెండు చేతులూ దగ్గరగా తాటించింది.

అప్పుడు పుట్టిన వెలుగు సామాన్యమైనది కాదు.

నరసింహం అప్రయత్నంగా కళ్ళు మూసుకున్నాడు.

విగ్రహం అతణ్ని సమీపించి ఓ చేత్తో అందుకుంది. గాల్లోకి ఎగురవేసి రెండు చేతులూ దగ్గరగా తాటించింది.

విగ్రహం చేతుల్లో వెలుగు. ఒక సూర్యుడు మండుతున్న వెలుగది.

గాల్లోంచి నరసింహం ఆ విగ్రహం చేతుల్లోకి పడవలసి వుంది. కానీ అతడు గాలిలోనే పల్టీలు కొట్టాడు. విగ్రహం తలమీద వాలి శక్తికొద్దీ పిడికిలితో ఒక్కటిచ్చాడు.

విగ్రహం తల నుగ్గు నుగ్గయింది. నరసింహం నేల మీదకు దూకాడు. విగ్రహాన్ని రెండు చేతుల్తోటీ ఎత్తి గాల్లోకి విసిరేశాడు.

విగ్రహం నేలమీద పడింది. నరసింహం ఎగిరి దాని మీద నిలబడి కాసేపు తాండవనృత్యం చేశాడు. విగ్రహం ముక్కలు ముక్కలయింది.

అప్పుడు విగ్రహం లోంచి ఏదో వాయువు రాసాగింది,

నరసింహానికా వాసన నచ్చలేదు. అతడు చుట్టూ చూశాడు. వచ్చినదికాక వేరే యింకో గుమ్మముంది. వెళ్ళి తలుపు లాగి చూశాడు. రాలేదు.

కాలితో ఒక్క తాపు తన్నాడు. తలుపు విరిగి ముందుకు పడింది. నరసింహం ఆ గదిలో ప్రవేశించాడు.

అక్కడ ఇరవై మంది ఆడవాళ్ళున్నారు. అంతా మిస మిసలాడే వయసులో ఉన్నారు. ఒక్కరికీ ఒంటిమీద బట్టలు లేవు.

నరసింహం వంక వారాశ్చర్యంగా చూశారు. నరసింహం వారిని చూసి "మీ రిక్కడ బందీలా?" అన్నాడు.

వాళ్ళేమీ మాట్లాడలేదు. భయంగానూ, ఆశ్చర్యం గానూ అతడి వంక చూశారు.

"నేను మీకు హాని చేయను, మీ రిక్కడ బందీలైతే మీకు విముక్తి కలిగిస్తాను. నా మీద ప్రయోగించబడాలని నియమించబడితే మీ అంతు చూస్తాను...." అన్నాడు నరసింహం.

"మా కెవ్వరూ విముక్తి కలిగించలేరు...." అంది వారిలో ఒక యువతి.

"ఎందుకని?"

"ఈ రెడ్ సెల్‌లో ఎవరయినా లోపలకు రాగలరు. బయటకు పోగలరు. మేము బయటకు పోవాలంటే వంటి మీద దుస్తులుండాలి. మా దుస్తులా పక్క గదిలో

ఉన్నాయి. అవి ధరించినప్పుడు మేము యథేచ్ఛగా బయటకు పోగలం. బందీలను సులభంగా గుర్తించడం కోసం ఈ దుస్తులు లేని పద్ధతి విధించబడిం దిక్కడ...."అందా యువతి.

"అంటే మీ బట్టలు మీకు విముక్తి నిస్తాయి...." అన్నాడు నరసింహం. అతడు వారి నడిగి తెలుసుకుని - వారు చెప్పిన గది తలుపు పగలగొట్టాడు. అక్కడ తలుపులు విరగ్గొట్టి స్టీలు బీరువాలు తెరిచాడు.

యువతులందరూ చకచకా బట్టలు ధరించారు.

"మీరంతా హాయిగా బయటకు పొండి" అన్నాడు నరసింహం.

"మీరు సామాన్యులు కారు. అవతారపురుషులు" అంటూ వాళ్ళతడి కాళ్ళకి మ్రొక్కారు.

"అవును. ఇది నరసింహావతారం" అన్నాడు నరసింహం.

అక్కణ్నించి తలుపులు బద్దలు కొట్టుకుని మరో గదిలోకి వెళ్ళాడు నరసింహం.

అక్కడ ఓ యువకు డున్నాడు. అతడు నరసింహాన్ని చూసి "మీ కీ రెడ్ సెల్ స్వాగతం పలుకుతోంది...." అన్నాడు.

"ఎవరు నువ్వు?" అన్నాడు నరసింహం.

"నన్నిక్కడ జగపతిరావుగారు మీ కోసం ఉంచారు"

"ఎందుకు?"

"స్పెషల్ గ్రీన్ కార్డుతో వచ్చారిక్కడికి మీరు." -

"అందుకేనా నన్ను చంపడానికి ప్రయత్నాలు జరిగాయి...."

"అవి ప్రయత్నాలు కావు...." అన్నా డా యువకుడు.

"మరేమిటి?"

"మీ శక్తికి పరీక్ష విగ్రహం. మీ నిగ్రహానికి పరీక్ష ఆ నగ్నసుందరులు...." అన్నాడా యువకుడు.

"ఎందు కా పరీక్ష?"

"ఒక మనిషికి అంతశక్తి, నిగ్రహం అసాధ్యం! అదే మా అందరికీ ఆశ్చర్యంగా ఉంది" అన్నాడా యువకుడు.

"నే నా పరీక్షలో నెగ్గకపోతే ఏమవుతుంది?"

"మీకు ప్రాణప్రమాదం రానివ్వరు జగపతిరావుగారు."

నరసింహం నవ్వి "జగపతిరావు గురించి మీకంటే నాకు బాగా తెలుసు. నా ప్రాణాలు తీసిన మనిషి నాకు ప్రాణప్రమాదం రానివ్వడంటే అది నమ్మతగ్గమాటే!" అన్నాడు.

"మీ గురించి మీకంటే ఎక్కువ తెలుసు నాకు. పోయిందనుకున్న మీ ప్రాణాన్ని నిలబెట్టి మిమ్మల్ని మళ్ళీ మనిషిని చేసిందే ఆయన...." అన్నాడా యువకుడు.

"ఏమన్నావ్?" అన్నాడు నరసింహం.

శల్యరాజు జగపతిరావుకు చెప్పిన ఉపాయాన్ని ఆ యువకుడు నరసింహానికి కథగా చెప్పాడు.

నరసింహం ఆశ్చర్యంగా "అయితే నేను మనిషి నంటావు" అన్నాడు.

"అవును...." అన్నాడా యువకుడు.

"కాదేమోనని అనుమానంగా ఉంది" అన్నాడు నరసింహం.

"మీ కా అనుమానం వద్దు" అన్నాడా యువకుడు.

"అనుమానం తీరాలిగా" అన్నాడు నరసింహం.

"ఎలా తీరుతుంది?"

"చాలా సులభం" అన్నాడు నరసింహం.

ఆ యువకు డతడి వంక కుతూహలంగా చూశాడు.

"అలా చూడకు. తక్షణం పరుగున వెళ్ళిపో 'అన్నాడు నరసింహం.

"ఎందుకు?"

"నే నిప్పుడో పరీక్ష చేయబోతున్నాను. పరీక్ష మిగిలే సరికి రెడ్ సెల్ లో మనుషులన్న వారెవ్వరూ మిగలరు. మనిషి కానివాడే మిగులుతాడు'' అన్నాడు నరసింహం.

"ఏమి టా పరీక్ష?"

"సమయం వృథా చేసుకోకు. ఇప్పటికి సరిగ్గా అయిదు నిముషాలు వ్యవధి యిస్తున్నాను. మొత్తం రెడ్ సెల్ లోని వారందర్నీ హెచ్చరించి బయటకు తీసుకునిపో. లేకుంటే ఎవ్వరూ మిగలరు.''

"ఎందుకు మిగలరు?''

"ఉన్నపళంగా ఈ భవనం కూలిపోతే మనిషన్న వాడెవడయినా మిగుల్తాడా? నువ్వే చెప్పు" అంటూ నరసింహం వళ్ళు విరుచుకుని పెడబొబ్బ పెట్టాడు.

ఆ కేక భయంకరంగా వుంది.

ఆ యువకుడు భయంగా అక్కణ్నించి పరుగెత్తాడు.

సరిగ్గా అయిదంటే అయిదు నిముషాలు నరసింహం నిశ్శబ్దంగా, నిశ్చలంగా ఉన్నాడు. ఆ తర్వాత తాండవ నృత్యం చేస్తూ రెడ్ సెల్ గోడల్ని పిడికిలితో బలంగా గుద్దుతూ, కాలితో బలంగా తన్నసాగాడు.

క్రమంగా ఆ భవనం మొత్తం కూలిపోసాగింది.

రెడ్ సెల్ లో సంచలనం కలిగింది. అందులో ఉన్న అన్నికాల మనుషులూ పారిపోవడానికి ప్రయత్నిస్తున్నారు. వారిలో కొందరికి కాళ్ళు, కొందరికి చేతులు

విరుగుతున్నాయి. కొందరు రాళ్ళక్రిందపడి చస్తున్నారు. ఎటు చూసినా భయంకరంగా ఆర్తనాదాలు.

ఏదో పేలుడుకు గురయినట్లు రెస్ట్ హౌస్ భవనం మొత్తం కూలిపోయింది. అదొక వింతగా చుట్టూ జనం చూడ్డానికి మూగారు.

ఏమి జరుగుతోందో ఎవరికీ అర్థం కాలేదు.

కొందరిది భూకంపం అనుకున్నారు. కొందరది ప్రమాద మనుకున్నారు. అందరూ ముందుకు వెళ్ళడానికి భయపడుతున్నారు.

నరసింహానికి కథ చెప్పిన యువకుడు ప్రమాదాన్ని ముందుగానే శంకించాడో యేమో - హెచ్చరిక వినగానే తా నింకెవరినీ హెచ్చరించకుండా భవనంలోంచి బయట పడ్డాడు. ఇప్పుడతడి కళ్ళ ఎదుటే మొత్తం భవనం పూర్తిగా కూలిపోయింది.

అతడు నిశ్చేష్టుడయాడు.

ఆ నరసింహం ఎవరు? అతడి కింత బలమేమిటి? ఇప్పుడీ కూలిన శిధిలాల్లో అతడింకా జీవించి ఉన్నాడా!

ఆ యువకుడి అనుమానం తీర్చడానికా అన్నట్లు - కుప్పగా పడినరాళ్లు, దూలాలు, కాంక్రీటు ముక్కలు చేత్తో తొలగించుకుని నరసింహం ఆ శిధిలాలలోంచి పైకి వచ్చాడు. నెమ్మదిగా నడుచుకుంటూ ఆ యువకుణ్ని సమీపించాడు.

యువకుణ్ని చూస్తున్నాడు. నరసింహం ధరించిన బట్టలు నలిగాయి. దుమ్ము కొట్టుకున్నాయి. నరసింహం మాత్రం పువ్వులా వున్నాడు.

నరసింహం ఆ యువకుడితో "నువ్వు చెప్పిన కథ

సరయినది కాదు. నేను మనిషిని కాను. అవునా?"
అన్నాడు.

ఆ యువకుడు అవునన్నట్లు తలూపాడు.

ఈలో గా కొందరు జనం నరసింహం చుట్టూ మూగారు.

"రెండంతస్థుల పెద్ద మేడ ఉన్నట్లుండి కూలి పోయింది. నేను తప్పించుకుని బయట పడడం నా అదృష్టం" అన్నాడు నరసింహం. ఇంకా ప్రశ్నలు వేస్తున్న మరికొందరితో అతడు "వెళ్ళండి. కొన ప్రాణాలతో వున్నవారిని బ్రతికించడానికి ప్రయత్నించండి" అన్నాడు విసుగ్గా.

జనం ముందుకు వెడుతున్నారు. ఆ జనాన్ని చూస్తూ నరసింహం కాసేపక్కడే నిలబడ్డాడు. తర్వాత నెమ్మదిగా దారి మార్చాడు. అతణ్నెవరయినా పరీక్షగా చూస్తే - ముఖం చూసి భయపడతారు.

31

"శల్యరాజూ! నువ్వే నన్ను రక్షించాలి-" అన్నాడు జగపతిరావు.

"నేను మిమ్మల్ని రక్షించడమా?" అన్నాడు శల్యరాజు.

"ఇలాంటి వింత ఎక్కడా వినలేదు. ఒక్కగా నొక్క మనిషి పటిష్టమైన రెండంతస్థులమేడను పడగొట్టాడు. డాక్టర్ జయరాజ్ సృష్టి అద్భుతమైనది. నేను నరసింహాన్ని ఎదుర్కోలేను. ఇప్పుడు నా మీద నాకే నమ్మకంపోతోంది. రెడ్ సెల్‌ను పడగొట్టిన నరసింహానికి నేనో లెక్కకాదు. అతడిప్పుడు నేనేం చెప్పినా వినడు...." అన్నాడు జగపతిరావు.

"నేను చెప్పనే చెప్పాను. మీకు అంతం సమీ

పించింది...."

"నీ మాటలు నిజమేననిపిస్తోందిప్పుడు. రెడ్ పెల్ పోయాక నా ప్రాణమే పోయినట్లుంది...." అన్నాడు జగపతిరావు.

"వెళ్ళి జయరాజ్ కాళ్ళు పట్టుకోండి. నరసింహాన్న దుపు చేయగలిగిన శక్తి అతడికే ఉంది...."

"జయరాజ్ నన్ను రక్షించడు...."

"ఈ ప్రపంచంలో ఏ ఒక్కరికీ మిమ్మల్ని రక్షించాలని ఉండదు. కానీ ప్రేమనెరిగిన మనిషి ఎంతటి దారుణాన్నయినా క్షమించగలడు. ఆ విధంగా మీ అదృష్టం పరీక్షించుకోండి. జయరాజ్ మిమ్మల్ని కాపాడితే నే నాశ్చర్యపోను...."

"ఇంక ఉపాయమేదీ లేదా?" అన్నాడు జగపతిరావు.

శల్యరాజు చిత్రంగా జగపతిరావువంక చూసి—"ఎందుకు మీ కంత భయం? ప్రాణాలు పోతాయనే!" అన్నాడు.

"ప్రాణాలంటే ఎవరికి తీపికాదు?"

"అది తెలిసే అందరి ప్రాణాలతో ఆడుకున్నారా?"

జగపతిరావు మాట్లాడలేదు.

శల్యరాజు లేచి నిలబడి—"నేనిక వెడతాను. సెల విప్పించండి—" అన్నాడు.

"ఇప్పుడు నిన్ను వదలను. నా కిప్పుడే నీ సాయం కావాలి...."

శల్యరాజు నవ్వి—"ఇప్పుడు నువ్వు నన్నాపలేవు...." అన్నాడు.

జగపతిరావు అతడి నాపాలనుకున్నాడు. కానీ కాళ్ళు కదలలేదు. చేతులు కదలలేదు. ఆగమని అరవాలను

కున్నాడు. గొంతు పెగలలేదు.

శల్యరాజక్కణ్ణించి వెళ్ళిపోతూ- "ప్రస్తుతానికి నేను మీకు చెయగలిగిన ఉపకారమిదే! నేనిక్కడుంటే అను క్షణం మనసులో మీకు శాపనార్ధాలు పెడుతూనే ఉంటాను. నా ఉసురు మీ బలాన్ని తగ్గిస్తోంది. నరసింహం బలాన్ని పెంచుతోంది. నే క్కణ్ణించి వెళ్ళిపోవడంవల్ల నా ఉసురు మీకుండదు. అయితే ఇది ఉడతాభక్తి మాత్రమే! ఎందు కంటే నాలాంటి ఎందరి ఉసురు మీకు కొడుతుందో నేను చెప్పలేను...." అన్నాడు.

శల్యరాజు వెళ్ళిపోయాడు.

జగపతిరావు కాసేపటిదాకా అక్కణ్ణించి కదల్లేక పోయాడు. తర్వాత నెమ్మదిగా అక్కణ్ణించి లేచి గది లోంచి బయటకు వచ్చాడు.

"ఇప్పుడు నరసింహం ఏం చేస్తాడు?"

ఇదే ఆలోచన ఆయన బుర్రను దొలిచేస్తోంది. లోతుగా ఆలోచిస్తూంటే వళ్ళంతా వణుకు పుట్టుకొస్తోంది.

నరసింహం రెడ్ పెల్‌ను కూలగొట్టి బయటపడతాడని ఆయన వూహించలేదు. అది ఆయన ఊహకు కూడా అందని విషయం.

ఇప్పుడు తను అర్జంటుగా నందనరావును కలుసు కోవాలి. ఫలించినా ఫలించకున్నా నందనరావును రథ సారధిని చేసి తను అమాయకుడిగా నటించాలి. ఆ పైన భగవంతుడున్నాడు.

ఎన్నడూ లేనిది జగపతిరావు శల్యరాజున్న చోటనుంచి కాలి నడకన బయటకు వచ్చాడు. రోడ్డుమీద కాలినడకన పోతున్నాడు.

ఉన్నట్లుండి ఆయన ముందు కారొకటి ఆగింది.

"డాడీ!" అన్నాడు రంజన్ కార్లోంచి.

జగపతిరావు ఉలిక్కిపడి- 'నువ్వా?" అన్నాడు.

"త్వరగా రా డాడీ-యింటికి పోదాం—"

"ఎందుకు?"

"నరసింహం మనింట్లో ఉన్నాడు...."

"అమ్మబాబోయ్—అయితే నేను రాను...."

"అలాగనకు డాడీ! అరగంటలో నిన్ను తీసుకుని రాకపోతే ఉన్న పళంగా మనిల్లు కూలగొట్టేస్తా నంటున్నాడు."

"నేను వస్తే నన్ను చంపేస్తాడు...."

"నిన్నేకాదు. మనలనెవరినీ ఏమీ చేయట్ట...."

"ఆఁ" అన్నాడు జగపతిరావు ఆశ్చర్యంగా.

"కారెక్కు డాడీ! అన్నీ చెబుతాను...."

"ఎక్కను. నరసింహం నీకేదో ఆశ చూపి నన్ను తీసుకుని రమ్మని ఉంటాడు. మాయ మాటలు చెప్పి నన్ను తీసుకుని రమ్మన్నాడు. అవునా?"

"డాడీ-నువ్వు నన్ననుమానిస్తున్నావా?" తెల్లబోయాడు రంజన్.

"మరేం చేయను. ఇది ఎవర్నీ నమ్మదగ్గ సమయం కాదు...."

"డాడీ-ఇప్పుడు నువ్వు దొరక్కపోతే - నరసింహం నిన్ను వెతికి వెతికి చంపుతానన్నాడు. మాయ మాటలు చెప్పేవాణ్ణయితే నరసింహం పేరు చెప్పకుండానే - ఇంకేదో చెప్పి యింటికి తీసుకుని వెళ్ళేవాణ్ణికదా! ఇప్పుడు నువ్వు రావడంమీదే మనందరి ప్రాణాలూ ఆధారపడి ఉన్నాయి. త్వరగా కారెక్కు డాడీ!" అన్నాడు రంజన్ కంగారుగా.

జగపతిరావు అతడి కళ్ళలో కంగారు చూశాడు. ఏమనుకున్నాడో వెంటనే కారెక్కి—"సరే పద!" అన్నాడు.

రంజన్ వాచీ చూసుకున్నాడు. కంగారుగా కారు స్టార్టు చేశాడు.

అప్పుడు కారు విమానంలా దూకింది.

"ఇలాగైతే నరసింహం వరకూ అక్కర్లేదు. యాక్సిడెంట్లోనే ప్రాణం పోవచ్చు" అని ఎవరికైనా అనిపించవచ్చు. కానీ ఆ క్షణంలో ఇద్దరికీ ఆ విషయం తోచలేదు.

జగపతిరావుకు ఎదురుగా కూలిన రెడ్ సెల్ తప్ప ఇంకేమీ కనపడంలేదు. ఒక్కడంటే ఒక్కడు.... నరసింహం రెడ్ సెల్‌ను ఏ ఆయుధమూ ఉపయోగించకుండా కూల్చేశాడు. ఆ దృశ్యాన్నాయన ఇంట్లో కూర్చుని లైవ్ టెలికాస్ట్ చూశాడు. అప్పుడే శల్యరాజు వద్దకు పరుగెత్తాడు.

ఇప్పుడు శల్యరాజు కూడా విముక్తుడయ్యాడు.

రెడ్ సెల్ పోయింది, శల్యరాజు వెళ్ళిపోయాడు.

శల్యరాజు చెప్పినట్లు తనకు పతనం ప్రారంభమయింది

జగపతిరావు యిల్లు రాగానే-రంజన్ కారాపాడు. ఇద్దరూ కారు దిగారు. లోపలకు వెళ్ళారు.

హాల్లో ఉన్నాడు నరసింహం!

"వెల్‌కం మిస్టర్ జగపతిరావ్!" అన్నాడు నరసింహం.

జగపతిరావతణ్ణి పరీక్షగా చూశాడు.

నరసింహం ముఖంలో అలసటలేదు. కోపం లేదు. అతడు నలగని పువ్వులా ఫ్రెష్‌గా ఉన్నాడు. ముఖంలో ఎన్నడూ ఎరుగని ప్రశాంతత ఉంది.

"నీ అనుచరుడికి నేను మనిషినేమోనన్న అనుమానం వచ్చింది. ఏం చేయను? అతణ్ణి నమ్మించడం కోసం రెడ్ సెల్‌ను పడగొట్టాల్సి వచ్చింది!"

చాలా తాపీగా అన్నాడతడు.

రెడ్ సెల్‌ను కూల్చడానికి సామాన్యమైన శక్తి చాలదు. ఆ శక్తి నరసింహానికుంది. అతడు తనకు ప్రత్యర్థి!

"నన్ను చూస్తే బాగా భయపడ్డట్లు కనబడుతున్నావు. నేను నిన్నేమీ చేయను. ఎందుకంటే నువ్వు తప్పులు చేసి ఉన్నప్పటికీ అది నీ తప్పుకాదు. మనిషి దగ్గర కాస్తడబ్బు చేరగానే చుట్టూ చీమల్లా ముసురుకుంటారు స్వార్థపరులు. తమ ప్రయోజనాలకోసం ఆ మనిషిని తప్పుడు సలహాలతో పెడదారులు తొక్కిస్తారు. అందుకని తప్పంతా నీ అనుచరులది, సలహాదారులది. వాళ్ళపని పడతాను. నిన్ను వదిలిపెడతాను. అందుకని నువ్విప్పుడేం చేయాలంటే...."

అని ఆగాడు నరసింహం.

అతడేం చెబితే అది చేయడానికి సిద్ధంగా ఉన్నాడు జగపతిరావిప్పుడు. ఏం చెబుతాడా అని ఆత్రతగా చూస్తున్నాడాయన.

"అర్జంటుగా నందనరావునీ, శ్రీకాంత్‌నీ, సదానందాన్నీ ఇక్కడికి పిలు. మీరంతా విడివిడిగా వేర్వేరు గదుల్లో కూర్చుని మీరెవరెవరితో డీల్ చేస్తున్నారో ఆయా వ్యక్తులపేర్లు నా కివ్వాలి. మొత్తం నీ రహస్య కార్యకలాపాల్లో భాగమున్న వారందరిపేర్లూ నువ్వు రాసివ్వాలి. ఆ పేర్లూ మిగతావాళ్ళు రాసిచ్చిన వాటితో సరిపోవాలి. ఇదంతా ఓ గంటలో జరిగిపోవాలి. జరుగదూ - ఈ ఇల్లు కూల్చేసి, మీ ఇద్దరినీ చంపి వెళ్ళిపోతాను...."

"రంజన్-వాళ్ళకు ఫోన్ చేయి—" అన్నాడు జగపతి రావు.

అంతకుముందే రంజన్ ఫోన్ దగ్గరకు పరుగెత్తాడు.

32

సత్యేంద్రకుమార్‌కు యాక్సిడెంటయింది. తలకు బలంగా గాయం తగిలింది. అతడిప్పుడు హాస్పిటల్లో ఉన్నాడు.

కబురందగానే జయరాజ్ కంగారుగా హాస్పిటల్‌కు వెళ్ళాడు. ప్రకాష్ జయరాజ్ ననుసరించాడు.

"మనిషికి ప్రాణ ప్రమాదమేమీలేదు. రెండ్రోజుల పాటణ్ణి డిస్టర్బ్ చేయడానిక్కానీ మాట్లాడించడానిక్కానీ వీల్లేదు-" అన్నాడు డాక్టర్.

సత్యేంద్ర కుమార్‌ని కలుసుకుని మాట్లాడాలని ఆత్ర పడుతున్న జయరాజ్ బాగా నిరుత్సాహపడ్డాడు. అతడు తిరిగి లాబొరేటరీకి వెళ్ళేసరికింకా ఆసక్తికరమైన వార్త విన్నాడు.

సూర్యం వారిముందు రెండు పేపర్లుంచి - "మొదటి పేజీలోని ఈ వార్త చూడండి-" అన్నాడు.

నగరానికి సంబంధించిన ప్రముఖులు ఇరవై మంది హత్యచేయబడ్డారు. వారి జేబుల్లో ఉత్తరాలున్నాయి. ఆ ఉత్తరాలలో వారు తాముచేసిన ఘోరాలన్నీ స్వహస్తంతో రాసి ఉన్నారు. అంటే ఎవరో వారిని బెదిరించి అలా రాయించి అప్పుడు చంపేశారు.

"ఇది నరసింహానికి తప్ప సాధ్యపడదు-" అన్నాడు ప్రకాష్.

"నరసింహం నుంచి నే నాశించిన దిది కాదు...." అన్నాడు జయరాజ్ నిట్టూర్చుతూ.

రక్తానికి రక్తం - ప్రాణానికి ప్రాణం అన్న పట్టుదల కథల్లో హీరోయిజం అనిపించుకోవచ్చును. కానీ వాస్తవంలో అది నేరస్తుల సంఖ్యను పెంచుతుంది. ఒకే ఒక్క నేరస్థుడి తెర వెనుక జీవితాన్ని బయటపెట్టాలనీ-ప్రపంచానికి అతడి పీడ విరగడ చేయాలనీ — జయరాజ్ నరసింహాన్ని సృష్టించాడు. అతడిప్పుడు ఘోర హంతకుడిగా మారితే—అది అతడి తప్పు అవుతుంది.

"నరసింహం ఇప్పుడెక్కడున్నాడో?" అన్నాడు ప్రకాష్.

"పద చూద్దాం!"

ఇద్దరూ లాబొరేటరీలోకి వెళ్ళారు. టీవీ ముందు కూర్చున్నారు. జయరాజ్ ఆన్ చేయగానే స్క్రీన్‌మీద నరసింహం ప్రత్యక్షమయ్యాడు.

అతడి ఎదుట జగపతిరావున్నాడు.

"ఒక్కరాత్రిలో ఇరవైమంది ఫినిష్!" అన్నాడు నరసింహం.

"అవును-ఇరవై మంది...."

"దుర్మార్గులను నాశనం చేయాలనుకున్న అవతార పురుషులకు ఉచ్చి వచ్చిన అంకె ఇరవై ఒకటి. నేను ఒకటి తగ్గించాను ఎందుకో తెలుసా?"

"తెలియదు...."

"నా కప్పుడే నిన్ను చంపే ఉద్దేశ్యంలేదు...."

"ఎప్పుడూ నన్ను చంపవద్దు-ప్లీజ్!"

నరసింహం కోపంగా అతడివంక చూసి-"నిన్నెందరో ఎన్నోసార్లు రక్షించమని వేడుకున్నారు. వాళ్ళను నువ్వు రక్షించావా? అబద్ధం చెప్పకు. ఇప్పుడే చస్తావ్...." అన్నాడు.

"లేదు...." అన్నాడు జగపతిరావు వెంటనే.

"నేనూ అంతే! నువ్వడిగావని నేను నిన్ను రక్షించను. అలా అడిగితే నాక్కోపం వస్తుంది కూడా! నాకేంతోస్తే అది చేస్తాను. నీ ప్రాణాలు రక్షించుకుందు కిప్పుడొక్కటే మార్గం ఉంది. అదేమిటంటే?" మళ్ళీ ఆగాడు నరసింహం.

జగపతిరావు మనసులో ఆశ చోటు చేసుకుంటోంది.

"నువ్వు, నీ భార్య, కొడుకు - ముగ్గురూ మాసిన, చిరుగుల బట్టలు కట్టుకుని బాలా త్రిపురసుందరి గుడిదగ్గర కూర్చుని అడుక్కోవాలి. అలా చేయలేదూ మీ ముగ్గుర్నీ వికలాంగుల్ని చేసి నేనే భిక్షేశ్వర్ కమ్మేస్తాను...." అన్నాడు నరసింహం.

"భిక్షేశ్వర్‌ని విడిచిపెడతావా?" అన్నాడు జగపతిరావు.

"నీకు తెలియదేమో—భిక్షేశ్వర్‌ని నీ కోసమే ఇంకా అట్టే పెట్టాను...."

"ప్లీజ్—ఇంకేదైనా చెప్పు...." అన్నాడు జగపతిరావు భయంగా.

"నో కన్సెషన్స్...." అన్నాడు నరసింహం కరకుగా. "నువ్వడిగితే ఏ పనీ చేయనని నీకు తెలుసు. ఇప్పుడు నేను చంపవలసిన వారు వేరే ఉన్నారు...."

"ఎవరు?" కంగారుగా అడిగాడు జగపతిరావు.

"పోలీసు డిపార్టుమెంటు నేరస్థుల్ని శిక్షించడానికీ, ప్రజల్ని రక్షించడానికీ ఏర్పాటు చేయబడింది. ఇన్నేళ్ళ పాటు నీ నేరాలెందుకు బయటపడలేదు? అంటే ఆ డిపార్టుమెంట్లో నీకు మద్దతుంది. అక్కడున్న నీ మద్దతుదారు లందర్నీ వెతికి వెతికి చంపుతాను...."

"ఊఁ" అన్నాడు జగపతిరావు.

"ప్రజానాయకులు పరిపాలనలో తప్పులుంటే సవ

రించుకోవాలి. నీవంటి నేరస్థులు దశాబ్దాల తరబడి వర్ధిల్లు తూంటే వాళ్ళేంచేస్తున్నట్టు? అంటే నీకు వాళ్ళ మద్దతూ ఉంది. అలాంటివారందరినీ వెతికి వెతికి చంపుతాను...."

ఉన్నట్లుండి జగపతిరావు—"మరి నువ్వు నీ భార్యా బిడ్డల్ని కలుసుకోవా?" అన్నాడు.

"కలుసుకోను." అన్నాడు నరసింహం.

జగపతిరావు తెల్లబోయి—"ఏం?" అన్నాడు.

"వాళ్ళను కలుసుకోవాలంటే నా అవతారం చాలిం చాలి. నా కార్యక్రమం పూర్తికానిదే అవతారం చాలిం చను. నాతోపాటే నువ్వు వాళ్ళ చావుకూ ముహూర్తం పెట్టావనీ—వాళ్ళిలోకంలో లేరనీ నాకెప్పుడో తెలుసు."

"అయితే?"

"ఒక్క దెబ్బతో నిన్ను చంపితే "జూ"లో జంతు వును చంపినట్లుంటుంది. అడవిలో వేటాడినట్లు నిన్ను వేటాడాలని నా సంకల్పం. మధ్యమధ్య తప్పించుకున్నా నన్న భ్రమను నీకు కలగజేయాలి. నీమాటలు నేను నమ్మలేదు. నమ్మినట్లు నటించాను. నీ చావెప్పుడో నీకు తెలియదు. కానీ నీకు చావు తథ్యం. బ్రతికుండగా కూడా చావులాంటి జీవితం నీకు రాసిపెట్టి ఉంది. నువ్వాజీవితం జీవిస్తూండగా ఈలోగా నేను ప్రపంచాన్ని చక్కబెడ తాను." అని ఆగాడు నరసింహం.

"నీయిష్టం వచ్చినట్లు చేయడానికి నువ్వు స్వతంత్రు డివి కాదు. నిన్ను శాసించగలవాడు సైంటిస్టు జయరాజ్ ఉన్నాడు. రిమోట్ కంట్రోల్ నాశనమైనంతమాత్రాన అత డింకొకటి తయారుచేయకుండా ఉండడు. నేను జయ రాజ్‌ను నావాణ్ని చేసుకుని నిన్ను శాసిస్తాను. అప్పుడేం చేస్తావ్?" అన్నాడు జగపతిరావు ఉన్నట్లుండి.

ఆయనలాగనడానికి కారణముంది. నరసింహం ఎలాగూ తన అంతు చూస్తాడు. అతడిని తనేమీ చేయ లేడు. నరసింహాన్ని సృష్టించిన జయరాజ్‌కు వ్యతిరే కంగా—నరసింహాన్ని తయారుచేస్తే అతడు నరసిం హాన్ని నాశనమైనా చేస్తాడు. లేదా తనే నాశనమైపోతాడు. మొదటిది జరిగితే తనకు లాభం. రెండోది జరి గితే తనకేమీ లాభం లేకపోయినా—కనీసం తన పగ కొంత చల్లారుతుంది. తనమీదకు నరసింహాన్ని ఉసి గొల్పినవాడికి ఘోరమైన అంతం రావాలి!

నరసింహం నవ్వి—"జగపతిరావ్! నువ్వు నీ బుద్ధి బయటపెట్టుకుంటున్నావు! నేను నువ్వనుకున్నకంటె చాలా రెట్లు తెలివైనవాణ్ని. ఎక్కడెక్కడ ఏమి జరుగుతున్నదీ అంతా నాకు తెలుసు. డాక్టర్ జయరాజ్ నేను మరమనిషి నన్న భ్రమలో ఉన్నాడు. తన ప్రయోగం జయప్రదమైన దని ఆనందిస్తున్నాడు. కానీ అది నిజంకాదు.

అతడు సృష్టించిన మరమనిషిని ఆలంబనగా చేసుకుని నా ఆత్మ ఆవహించింది. అంటే మనిషి సృష్టించిన శరీ రాన్ని దేవుడు సృష్టించిన ఆత్మ ఆవహించింది. నాది అసలు సిసలు నరసింహావతారం. రిమోట్ కంట్రోలుతో నన్ను అదుపుచేయగలనన్న భ్రమను నేను వారికి కావా లనే కలిగింటాను. నేను ఒకే క్షణంలో ఎక్కడెక్కడ ఏం జరుగుతున్నదీ చూడగల శక్తిమంతుణ్ణి. ఇప్పుడు జయరాజ్, అతడి అసిస్టెంటు ప్రకాష్—టీవీలో మని ద్దర్నీ చూస్తున్నారు. జయరాజ్ చేతిలో రిమోట్ కంట్రోల్ ఉంది. ఇప్పుడు నేనన్నమాటలు విని అతడు SLEE స్విచ్ నొక్కుతున్నాడు. నాకేమీ కావడంలేదు. అతడు తెల్లబో తున్నాడు.

నే నిప్పుడెవ్వరి అదుపులోనూలేదు. ఈ ఊళ్ళో ఉన్నంతకాలమూ జయరాజ్ నా ఉనికిని తెలుసుకోగల్గు తాడు. అతడి టీవీ రేంజ్ అంతవరకే ఉంది. ఆ తర్వాత అతడికి నా ఉనికి కూడా తెలియదు. నన్నెవరూ ఆపలేరు. అన్యాయాల్నీ, అక్రమాల్నీ కాలరాయడానికి నేను బయ ల్దేరేముందు బిచ్చగాడుగా—నీ జీవితాన్ని కొద్దిరోజుల పాటు చూసి తరిస్తాను........

జయరాజ్ స్విచాఫ్‌చేసి "నరసింహం అలాగంటున్నా డేమిటి? కథగానీ అడ్డం తిరిగిపోలేదుకదా!" అన్నాడు.

"తిరిగినట్లే ఉందిసార్! మన SLEEP స్విచ్ అతడి మీద పనిచేయలేదు" అన్నాడు ప్రకాష్ కంగారుగా.

"రిమోట్ కంట్రోల్ పనిచేయకపోతే నరసింహం ప్రపంచానికే ప్రమాదమవుతాడు. మనమేదో ఒకటి చేయాలి."

"ఎందుకు సార్! అన్యాయాల్నీ, అక్రమాల్నీ మాత్రమే అతడణుస్తాడు. ఒకవిధంగా ప్రపంచానికి అదే మంచిది" అన్నాడు ప్రకాష్.

జయరాజ్ కంగారుగా- "ప్రపంచానికది మంచి దెలా గవుతుంది? ఊళ్ళో కొత్తగా అడుగుపెట్టినవాణ్ణి రిక్షావా డన్యాయం చేస్తాడు. సామానెక్కువుంటే రైల్వేకూలీ అన్యాయం చేస్తాడు. మన దేశంలో అవినీతి లేనిదెక్కడ? అన్యాయం జరుగనిదెక్కడ? అక్రమాలకు నెలవులేని దెక్కడ? నరసింహం అవినీతినీ, అన్యాయాన్నీ, అక్ర మాలనూ కాలరాయాలనుకుంటే ఈ ప్రపంచంలో మని షన్నవాడు మిగలడు...." అన్నాడు.

"అవినీతీ, అన్యాయం, అక్రమం—ఈ మూడూ లేకుండా ప్రపంచం మనలేకపోతే - ఆ ప్రపంచం అంతం

కావడమే మంచిది" అన్నాడు ప్రకాష్.

"ప్రకాష్! నీ ఆలోచనలు తప్పుదారిలో నడుస్తున్నాయి. చిన్న చిన్న తప్పులు ప్రతిఒక్కరూ చేస్తారు. ఆ తప్పుల కారణంగా ప్రపంచ నాశనాన్ని కోరడం అవివేకం. ఎందుకంటే తప్పొప్పులు—మనిషి చేసుకున్న నియమావళి తప్పితే - ఏది తప్పో ఏది ఒప్పో ఆ పరమాత్మడికే తెలియాలి. నరసింహాన్ని ఆపడానికి మనచేతనైన ప్రయత్నం చేయకపోతేమాత్రం, అది క్షమించరాని తప్పే అవుతుంది. సంపన్నదేశాలు అణ్వాయుధాలు సృష్టించి వాడడానికి భయపడుతున్నాయంటే అందుకు కారణం ఎంతటి దుర్మార్గులైనా తమ బలాన్ని పెంచుకునేందుకు చూస్తారు తప్పితే—ప్రపంచ వినాశనాన్ని కోరరు....జగపతిరావువంటి దుర్మార్గులు కొందర్ని అంతం చేయడం మన ఆశయం కావచ్చు. ప్రపంచ వినాశనాన్ని మనం కోరకూడదు. మనకా హక్కులేదు...." అన్నాడు జయరాజ్.

"అయితే ఇప్పుడేం చేద్దాం?"

"ఏదో చేయాలి. సత్యేంద్రకుమార్‌కు త్వరగా స్పృహ వస్తే బాగుంటుంది...." అన్నాడు జయరాజ్.

33

ఆరోజు జగపతిరావు, ఆయన భార్య, రంజన్— ముగ్గురూ మాసినబట్టలు కట్టుకుని, గుడివద్ద అడుక్కున్నారు. అలా జరుగని మరుక్షణాన వాళ్లు ముగ్గురూ 'ఫినిష్' అని నరసింహం గట్టిగా హెచ్చరించాడు.

అలా ఒకటికాదు....రెండుకాదు....వారంరోజులు గడిచాయి.

జగపతిరావు కా జీవితం దుర్భరంగా ఉంది.

గుడివద్ద ఒకరోజున వారికి ఎంగిలాకుల్లో సగం తిన్న ఇడ్లీలు ధర్మం చేశాడు నరసింహం. అతడికి భయపడి వా రవి తినవలసి వచ్చింది.

వేషం మారిపోతే—మనుషుల ఉనికి కూడా మారిపో తుంది.

జగపతిరావును జగపతిరావుగా చాలామంది గుర్తించ లేదు. గుర్తించినవారు కూడా ఆయనై ఉండదను కున్నారు.

నరసింహం ఆయన భిక్షాటన చేస్తూ ఉండగా మధ్య మధ్య పలకరించి వెడుతూండేవాడు.

"నన్ను చంపేసేయ్" అన్నాడాయన.

"నిన్ను చంపను. నీ జీవితం నీవంటివారికి గుణపాఠం కావాలి" అన్నాడు కసిగా నరసింహం.

ఇప్పుడు జగపతిరావు తన ఊహకందని జీవితం గడుపుతున్నాడు. ఆయన తెలివి, సిరిసంపదలు-ఎందుకూ కొరగాకుండా పోయాయి. అతడి కదలికలను అనుక్షణం నరసింహం గమనిస్తున్నాడు.

34

"హి యీజ్ నౌ పెర్‌ఫెక్టలీ ఆల్‌రైట్!" అన్నాడు డాక్టర్.

జయరాజ్ కళ్ళు మెరిశాయి. అతడు ప్రకాష్‌ని వెంట బెట్టుకుని సత్యేంద్రకుమార్‌ని కలుసుకుందుకు వెళ్ళాడు.

సత్యేంద్రకుమార్ బెడ్‌మీద నీరసంగా పడుకుని ఉన్నాడు. అతడి తలకు బ్యాండేజి ఉంది.

"మొత్తంమీద మళ్ళీ మనం కలుసుకుని మాట్లాడుకో గల్గుతున్నాం...." అన్నాడు జయరాజ్ నిట్టూర్చి.

"నా తప్పును మీరు మన్నించాలి" అన్నాడు సత్యేంద్ర

కుమార్.

"ఏమిటది?" అన్నాడు జయరాజ్.

"ప్రాజెక్ట్ నరసింహావతారం వ్యవహారంలో నేను చాలా అశ్రద్ధగా వ్యవహరించాను. అయితేనేం నేనిప్పుడు నా తప్పును సవరించుకున్నాను...." అన్నాడతడు.

"ఏమీ ఫరవాలేదు. అనుకోని యిబ్బందివస్తే తప్ప నువ్వు మధ్యలో నన్ను వదిలివెళ్ళవని నాకు తెలుసు. అందు గురించి నువ్వేమీ బాధపడకు. ప్రస్తుతం నువ్వు చాలా మంచి సమయంలో వచ్చావు...." అన్నాడు జయరాజ్.

సత్యేంద్రకుమార్ కళ్ళుమూసుకుని - "ఒక మంచి ముహూర్తం పాడు చేశాను. అయినా మీరేమీ అనుకోకుండా మంచి సమయంలో వచ్చానంటున్నారు. అది మీ మంచితనం. ఇక ఆలస్యం చేయవద్దు. మనం వెంటనే నరసింహాన్ని రంగంలో ప్రవేశపెడదాం. ముహూర్తం మీరు చెప్పండి" అన్నాడు.

జయరాజ్ ఆశ్చర్యంగా—"నీమాటలు నాకర్థం కావడంలేదు. నరసింహం అనుకున్న ముహూర్తానికి రంగప్రవేశం చేశాడుగా-" అన్నాడు.

"లేదు. నేను అతి జాగ్రత్తకుపోయి ఒక పొరపాటు చేశాను. నరసింహావతారం ప్రయోగసమయంలో మా అమ్మ ఇక్కడుండడం మంచిది కాదనిపించి తనని మామయ్యింటికి పంపించేశాను. నరసింహానికి సంబంధించిన వాల్యు నేను యింట్లో బీరువాలో లాకర్లోపెట్టాను. పొరపాటున అమ్మ ఆవాల్యున్న భరిణను కూడా - తన నగలతోపాటు సూట్ కేసులో వేసుకుంది. ప్రయాణంలో ఆ సూట్ కేసు తారుమారయింది.

ఆ వాల్యు సంపాదించడంకోసం నేను చేసిన పరిశోధన యంతా అంతా కాదు. అదృష్టవశాత్తు ఆ పెట్టె దుర్మార్గుల చేతబడలేదు. నిజంగా పొరపాటునే అది తారుమారయింది. అది కనుక్కొందుకు నాకు వారంరోజులు పట్టింది. మొత్తంమీద అమ్మనగలు, ఆ వాల్యు సాధించుకుని తిరిగి మీదగ్గరకు వచ్చాను. మిమ్మల్ని కలుసుకునేలోగా యాక్సిడెంటయింది. ఏదో అజ్ఞాతశక్తి ఇదంతా చేసినట్లు నా కనిపించింది. ఏమైతేనేం—మొత్తంమీద మన ప్రాజెక్టు ప్రారంభించే మంచిరోజు రానేవచ్చింది.... అన్నాడు సత్యేంద్రకుమార్.

జయరాజ్ నిశ్చేష్టుడై సత్యేంద్రకుమార్‌వంక చూస్తున్నాడు. ప్రకాష్ ముందు తెల్లబోయినా తర్వాత తమాయించుకుని - "ఆ వాల్యు లేకుండానే నరసింహం ప్రజల మధ్యకు వెళ్ళలేదా?" అన్నాడు.

"ఇంపాసిబుల్-" అన్నాడు సత్యేంద్రకుమార్.

"అయితే నరసింహం ప్రజలమధ్య ఎలా తిరుగుతున్నాడు?"

సత్యేంద్రకుమార్ తెల్లబోయి - "తిరుగుతున్నాడని ఎవరన్నారు?" అన్నాడు.

అప్పటికి జయరాజ్ తేరుకున్నాడు "సత్యేంద్రా! అయితే ఇక్కడ జరిగింది నీకేమీ తెలియదన్నమాట. నువ్విప్పుడు కొన్ని విశేషాలు తెలుసుకోవలసి ఉంది...." అంటూ జరిగినదంతా అతడికి వివరించాడు.

సత్యేంద్రకుమార్ ఆశ్చర్యంగా - "అదెలా సాధ్యం? ఆ వాల్యులేనిదే—ఒక్క అంగుళం కూడా కదలలేదా నరసింహావతారం?" అన్నాడు.

"కానీ కదిలింది" అన్నాడు ప్రకాష్.

"కదలడమేకాదు. రెడ్ పెల్ను కూల్చింది. దిగ్గజాలను ఘాతమార్చింది. ఇప్పుడు ప్రపంచంమీదనే జైత్ర యాత్రకు బయల్దేరుతోంది" అన్నాడు జయరాజ్.

సత్యేంద్రకుమార్ చటుక్కున లేచి కూర్చుని—"మీరు చెబుతున్నది నిజమా?" అన్నాడు.

"నీ వాల్వు లేకుండా నరసింహం సజీవంగా తిరుగుతున్నాడు. నిన్నూ అతడిపద్దకు తీసుకుని వెళ్ళి పరిచయం చేస్తాను" అన్నాడు జయరాజ్.

"వాల్వ లేకుండా అతడెలా తిరుగుతున్నాడు? అతడిని నడిపిస్తున్న శక్తి యేది?" అన్నాడు సత్యేంద్రకుమార్.

"ఆ శక్తి నరసింహమే అయుండాలి!" అన్నాడు జయరాజ్.

"అంటే?"

"మానవాతీత శక్తి!"

"బాప్ రే!" అన్నాడు సత్యేంద్రకుమార్.

35

జగపతిరావు చేసిన ఘోరాలొకటొక్కటిగా బయట పడుతున్నాయి. శల్యరాజు తన విషాదగాధను పత్రికల వారికి చెప్పుకున్నాడు. అంతర్జాతీయంగా కూడా ఆ కధకు ప్రాముఖ్యత లభించింది.

పోలీసులు జగపతిరావింటిని స్వాధీనపర్చుకున్నారు. ప్రజలిప్పుడు జగపతిరావు కుటుంబాన్ని వెతికి వెతికి చంపడానికి సన్నద్ధులై వున్నారు. జగపతిరావు కుటుంబంతో సహా విదేశాలకు పారిపోయాడన్న పుకారు ఊళ్ళో ప్రబలమయింది. ఆ ఊళ్ళోనే ఆయన నీచాతినీచమైన జీవితమనుభవిస్తున్నట్లు ఎవరికీ తెలియదు.

నరసింహం ఎవరో అతడి వెనుకనున్న శక్తి ఏమిటో ఎవరికీ తెలియడంలేదు. అతడిని పట్టించి పోలీసులు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. అతడు తుపాకీ గుండులకు లొంగడు. అతడి బలం అనితరసాధ్యం. తన్ను తరుముతూ వచ్చిన ట్రక్కును సైతం అతడు అమాంతం విసిరి పారేయగలడు.

నగరంలో ఇప్పుడు రోజుకొక హత్య జరుగుతోంది. హతులు దుర్మార్గులే అయియుండవచ్చు కానీ ఇది ఊళ్ళో అరాచకానికి దారితీస్తోంది. నరసింహాన్ని పట్టి తెచ్చినవారికి బహుమతులిస్తామని కూడా ప్రకటనచేశారు.

జయరాజ్‌కిది తీరని సమస్యగా పరిణమించింది. నరసింహం ఇక ఎంతోకాలం ఈ ఊళ్ళో ఉండడు. అతడీ ఊరు పొలిమేరలు దాటాడంటే అతడి ఉనికి తెలుసుకోవడం అసాధ్యమవుతుంది. త్వరగా ఏదో చేయాలి.

ఇంతకాలం నరసింహం తన సృష్టి అన్న ధైర్యంతో ఉన్నాడు జయరాజ్. అతడు మానవాతీతశక్తి అన్న అనుమానం కలగ్గానే అతడికి బెంగ పట్టుకుంది. ఎన్నో ఏళ్ళుగా చేసిన తన వైజ్ఞానిక కృషి ఫలితం తెలియకుండా పోయింది.

సత్యేంద్రకుమార్‌కు ఆరోగ్యం చేకూరే వరకూ ఆగాడతడు సత్యేంద్రకుమార్ లేచి మామూలుగా తిరిగేస్థాయి చేరుకునేందుకు వారంరోజులు పట్టింది. అప్పుడు వాళ్ళు టీవీ సాయంతో అతడి ఉనికిని తెలుసుకుని—అక్కడికి వెళ్ళారు.

ఒక లాడ్జింగ్ హౌసులో వుంటున్నాడు నరసింహం.

గౌరవంగా, అభిమానంగా ఆహ్వానించాడు నరసింహం సైంటిస్టు జయరాజ్‌నీ, అతడి శిష్యులనీ!

"మీరు కంగారుపడవద్దు. నాకు మీమీద పగలేదు. నేను మిమ్మల్నేమీ చేయను. నా కార్యక్రమం వేరే ఉంది—" అన్నాడు నరసింహం వాళ్ళతో.

"నేను సృష్టించిన శరీరమది! దీనిమీద నాకూ కొంత అదుపుండడం న్యాయం" అన్నాడు జయరాజ్.

"ఈ శరీరాన్ని నువ్వే సృష్టించావు. కానీ దీన్ని నడిపిస్తుంది నువ్వుగాదు దీన్నదుపుచేయాలనుకోవడం నీ అత్యాశ!" అన్నాడు నరసింహం.

"అత్యాశకాదు. విశ్వమానవ కళ్యాణాన్ని కోరేవాణ్ని నేను!"

నరసింహం నవ్వి "మనిషి స్వార్థపరుడు. నువ్వు మనిషివి" అన్నాడు.

"నువ్వు మనిషివి కాదా?"

"కాను...."

"నాకున్న స్వార్థమూ-నీకు లేని స్వార్థమూ ఏమిటి?"

"నువ్వు శ్యామలను ప్రేమించావు. జగపతిరావామెను అంతంచేశాడు. అందుకని ఆ జగపతిరావును నువ్వంతం చేయాలనుకుంటున్నావు. ఈ ప్రపంచం నిండా ఎందరో జగపతిరావులున్నారు. వాళ్ళగురించి నీకు బాధలేదు. అదే నీకున్న స్వార్థం—నాకు లేనిదీ అదే!"

అతడి మాటల్లోని తర్కం జయరాజ్‌కు నచ్చింది— "నువ్వు చెప్పింది నిజమే! కానీ జగపతిరావు వంటివారి నెదుర్కొనేందుకు ప్రజల్లో చైతన్యం రావాలి. జగపతిరావు వంటి వారిని భరించడానికీ, సహించడానికీ ప్రజలు సిద్ధంగా ఉన్నప్పుడు - నువ్వెందుకు వారితరఫున హింసకు పాల్పడాలి!"

"సమాధానం నీకే తెలుసు!" అన్నాడు నరసింహం

"భారత ప్రజలు స్వతంత్రం కావాలని ఆక్రోశించలేదు. బ్రిటిష్ పాలనను వారు సహనంతో భరించారు ఒక గాంధీ వారి ను త్తేజపరిచాడు. స్వతంత్రం వచ్చింది. ఇప్పుడు నేను అవతరించాను. నాకు అపరిమితమైన శక్తి ఉంది. నీ శక్తి మేరకు నువ్వు జగపతిరావును మాత్రం నాశనం చేయాలనుకున్నావు. నా శక్తి మేరకు నేను ప్రపంచంలో నుంచి జగపతిరావు లందర్నీ తుడిచిపెట్టగలను. ఎవరి శక్తికొలదీ వారు ప్రయత్నిస్తారు...."

"ఈ విషయంలో కూడా నువ్వు మా సాయం తీసుకోవడం మంచిది!" అన్నాడు జయరాజ్ — "మనుష్యుల వ్యవహారాలకు మనుష్యులను సంప్రదించకపోతే—నువ్వు అమానుషంగా ప్రవర్తిస్తావు...."

"మనుషుల్లోనే అమానుష మున్నప్పుడు, ఆ అమానుషు ల్నణచడానికి-నేనమానుషంగా ఉంటే తప్పేమిటి?" అన్నాడు నరసింహం.

ఏం చెప్పాలో జయరాజ్‌కు తోచలేదు.

"మా నరసింహాన్ని నువ్వెలా స్వాధీనం చేసుకున్నావు?" అన్నాడు సత్యేంద్రకుమార్. ఇదంతా అతడికో విచిత్రానుభవంలా ఉంది.

"నాకు ప్రాణంపోయినా భావన నన్ను వీడలేదు. నాకు శరీరంలేదు. జ్ఞానేంద్రియాలు లేవు. కానీ నేను నరసింహాన్నన్న భావన నన్ను వదిలిపెట్టడంలేదు. ఆ భావనలోనే నేను మరణానికి ముందు నాకు ప్రియస్నేహితుడైన జయరాజ్‌ను అంటిపెట్టుకుని తిరుగుతున్నాను. అతడి ప్రయోగాలు నాకెంతో ఉత్సాహాన్నిచ్చేయి. నా కథకు అతడి లాబొరేటరీలో ప్రాధాన్యత లభిస్తూంటే నా కుత్సాహం వచ్చింది.

కృత్రిమ నరసింహం తయారైనప్పుడు నేనెంతో సంతోషించాను. నా శరీరం నాకు తిరిగి లభించినట్లనిపించింది. వాల్వ్ పెడితే ఆ శరీరం మనిషిలా కదలడం ప్రారంభిస్తుందని నా కర్థమయింది. అప్పుడే నా కనిపించింది. ఆ వాల్వ్ స్థానాన్ని నేను తీసుకుని ఆ శరీరాన్ని ప్రభావితం చేయగలిగితే! అదే చేశాను. సత్యేంద్ర కుమార్ని వాల్వ్ పేరు చెప్పి దూరంగా తరిమాను.

అనుకున్న ముహూర్తానికే నరసింహావతారం దాల్చి-రిమోట్ కంట్రోలుకు అనుగుణంగా వర్తిస్తూ అసలు విషయం తెలియకుండా సైంటిస్టులను భ్రమలో ఉంచాను. లేకుంటే జయరాజ్ నాకీ శరీరం ఆసరా లేకుండా చేస్తాడని నా భయం. ఈ శరీరం పూర్తిగా నా అదుపులోకి వచ్చింది. దీనికున్న శక్తికి, నా శక్తి తోడైతే ఏమేం చేయగలనో పరీక్షించుకున్నాను. ఇప్పుడిక నన్నెవ్వరూ ఆపలేరని అర్థమయింది. కొద్దిరోజుల్లో ఈ ఊరు వదిలి పెడుతున్నాను'' అన్నాడు నరసింహం.

''ఒకే ఒక్క చిన్న కోరిక నాది....'' అన్నాడు సత్యేంద్రకుమార్.

''ఏమిటది?''

''మాకంటే నీకున్న వివేచన ఎక్కువ. నువ్వు మాకిచ్చే సలహా ఏమిటి?'' అన్నాడు సత్యేంద్రకుమార్.

''అదేనా నీ కోరిక?''

''నీ సలహా విన్నాక నా కోరిక చెబుతాను....''

అప్పుడు నరసింహం వాళ్ళ ముగ్గురికీ మూడు సలహాలిచ్చాడు.

ముందుగా ప్రకాష్‌తో అతడు శోభను పెళ్ళి చేసుకోవద్దని చెప్పాడు. శోభ విశాల్‌ని ప్రేమించింది. ప్రేమ

రెండు మనసుల కలయిక. విశాల్ పిరికితనం కలిగించిన జుగుప్సతో శోభ ప్రకాష్ అంటే మోజు పడుతోంది. ఈ విధమైన ప్రేమను ప్రోత్సహిస్తే - రేపు ప్రకాష్‌ని మించిన మగధీరుడు కనపడితే శోభ ప్రేమ మారిపో వచ్చు. అదీకాక శోభను ప్రకాష్ మనస్ఫూర్తిగా ప్రేమించ లేదు దగ్గరగా వస్తే మోజుపడ్డాడు. విశాల్ శోభను అపు రూపంగా చూసుకోగలుగుతాడు.

"శోభను నేను పెళ్ళి చేసుకోను" అన్నాడు ప్రకాష్.

తర్వాత నరసింహం సత్యేంద్రకుమార్‌తో "పెళ్ళ య్యాక నువ్వు నీ జీవితకాలంలో ఒక వంతు మాత్రమే పరిశోధనలకూ మూడు వంతులు భార్యా బిడ్డలకూ ఉపయోగించు" అని చెప్పాడు. విజ్ఞానశాస్త్రం తగినంతగా వృద్ధి చెందింది. మనిషి జీవితం సమిష్టి జీవనానికీ, సహ జీవనానికీ ఉద్దేశించబడింది.

సత్యేంద్రకుమార్ తల ఊపాడు.

"డాక్టర్ జయరాజ్! నీ అల్లుడి నిర్ణయం నీ కెంతో సంతోషాన్ని కలిగించి ఉంటుంది నీ కూతురేవిధంగా సుఖపడాలని నువ్వు కోరుకున్నావో - అదే సుఖాన్నింత వరకూ నువ్వు నీ భార్య కివ్వలేదు. ఆమె మానసికంగా పరిణతి చెందని మనిషయితే - నరసింహావతారాన్ని సృష్టించగల నీ వామెకు మానసిక పరిణతి కలిగించాలి. లేకుంటే నీ పరిశోధనలకు విలువే వుండదు. నీ తెలివి తేటలు ప్రపంచానికే కాక-అయినవాళ్ళకూ సుఖస తోషాల నివ్వాలి...." అన్నాడు నరసింహం జయరాజ్‌తో.

జయరాజ్ తలూపాడు.

"ఇప్పుడు చెప్పు - నీ కోరిక ఏమిటి?" అన్నాడు సత్యేంద్రకుమార్‌తో నరసింహం.

"నువ్వు మా కిసాావనుకున్న సలహాలు వేరు...."
అన్నాడు సత్యేంద్రకుమార్.

"ఏమిటి?"

"జగపతిరావు వంటి వారిని శిక్షించడానికి ఇంకా యింకా కృత్రిమ మానవులను తయారుచేయమంటావను కున్నాను...."

"నేను చెప్పాననే మీరీ శరీరాన్ని తయారు చేశారా?" అన్నాడు నరసింహం తమాషాగా నవ్వి.

"కానీ యిప్పుడు నీ సాయం లేకుంటే ఎన్నో యేళ్ళ మా శ్రమ వృధా అయిపోతుంది. ఒక్కసారి మా వాల్యూతో ఈ శరీరాన్ని నడిపించే అవకాశమివ్వు. అప్పుడే మా పరిశోధనను సరిగ్గా పరిశీలించినట్లవుతుంది. ఇంతకాలం ఈ శరీరం నీ శక్తితో నడిచింది. కాసేపు మా శక్తితో కూడా దీన్ని నడువనీ...." అన్నాడు సత్యేంద్రకుమార్.

"అదేనా నీ కోరిక?" అన్నాడు నరసింహం.

"ఏ సైంటిస్టుకైనా తన పరిశోధనా ఫలితాలను చూసుకోవాలనుంటుంది. ఇంతవరకూ నాకూ, శ్రీ జయరాజ్‌కీ ఆ అవకాశం రాలేదు...."

నరసింహం ముఖం ముందు గంభీరంగా అయింది. ఆ తర్వాత అతడి కళ్ళు ఎర్రబడ్డాయి. "నువ్వు నన్ను మోసం చేయాలని చూస్తున్నావు, ఒకసారి ఆ వాల్వు ఈ శరీరంలో ప్రవేశిస్తే ఈ శరీరం పూర్తిగా రిమోట్ కంట్రోల్ అదుపులో వుంటుందని నీ అభిప్రాయం...."

సత్యేంద్రకుమార్ చలించకుండా "నీవు మానవాతీత శక్తివి. ఏ విధంగానూ నిన్నదుపు చేయగలనని నేననుకోవడం లేదు...." అన్నాడు.

"అవును-నేను నరసింహావతారాన్ని!" అన్నాడు నరసింహం—"అయినప్పటికీ నాకో శరీరం కావాలి. ఆ శరీరంపై నాకే పూర్తి అదుపుండాలి. మీరు చెప్పినట్లు ఈ శరీరాన్ని వాల్వ్‌తో పరీక్షించుకోవడం మీకు న్యాయమైన కోరిక. అందుకు మీకు ఒక గంట టైమిస్తాను. గంటసేపు ఈ శరీరాన్ని మీ యిష్టం వచ్చినట్లు పరీక్షించుకోండి. గంట తర్వాత నుంచి ఇక మీకూ నాకూ ఏ సంబంధమూ వుండదు. నా వ్యవహారాల్లో మీరు జోక్యం చేసుకోకూడదు. అర్థమయిందా?"

"నీకు చాలా చాలా థాంక్స్"

"ఈ శరీరంలోని అణువణువూ నాకు పరిచయమైంది. ఎప్పుడైనా నేనీ శరీరాన్ని స్వాధీనం చేసుకోగలను. గంట తర్వాత మీకు మీరై ఈ శరీరంలోంచి - మీరు ప్రవేశపెట్టిన వాల్వును తీసేయాలి! లేదూ—మీరుండరు" అన్నాడు నరసింహం.

ఆ తర్వాత ఆ శరీరం వెంటనే మొదలు నరికిన చెట్టులా నేల కూలింది.

"ఆత్మ శరీరాన్ని వదలిపెట్టింది...." అన్నాడు జయరాజ్.

"అదంతా తర్వాత ఆలోచిద్దాం— ముందిప్పుడేం చేయాలి?" అన్నాడు సత్యేంద్రకుమార్.

"వెంటనే వాల్వు ప్రవేశపెడదాం...." అన్నాడు జయరాజ్.

"ముందీ శరీరాన్ని లాబొరేటరీకి తీసుకుని వెడదాం! ఉన్నట్లుండి ఈ శరీరంలో వాల్వు లేకుండా చలనం లిగిందంటే అందుక్కారణం లోపల ఏదో వైరు

షార్టయి ఉండాలి...." అన్నాడు సత్యేంద్రకుమార్.

"ఏమిటీ" అన్నాడు జయరాజ్.

"నాకు ఆత్మలపై నమ్మకంలేదు. ఈశరీరంలో ఎన్నో కనెక్షన్సున్నాయి. వాటన్నింటినీ కలపడానికే—ఈ వాల్వ్ ఉంచాలనుకున్నాం. లోపల అనుకోకుండా ఏదో షార్టయి ఉంటుంది. ఈ శరీరంలో చలనం ప్రారంభమయుంటుంది. ఇంచుమించు మనిషి మెదడుకు దగ్గర్లో ఉన్న కృత్రిమ మెదడు—తను నరసింహం ఆత్మనన్న భ్రమను డెవలప్ చేసుకుని ఉంటుంది. ఇప్పుడదే భ్రమలో ఈ శరీరం నిశ్చలమైంది. వెంటనే మనం అన్ని కనెక్షన్సూ పరీక్షించ వలసి ఉంది. చాలారోజులుగా నేనీ విషయమే ఆలోచిస్తు న్నాను. తార్కికంగా ఆలోచించగల మరమనిషిని తార్కి కంగానే పడగొట్టాలని ఈ ఉపాయం పన్నాను ఒకసారి నిశ్చలమైన ఈ మరమనిషి మరిక లేవడు...."

జయరాజ్ ఒరుగ్గా—"నువ్వు చెప్పినట్లు జరగడాని కవకాశం లేకపోలేదు. కానీ అది తప్పుడు ఊహాయితే ఈ ప్రపంచానికే ప్రమాదం. లాబొరేటరీకి వెళ్ళి ఈ శరీరాన్ని పరీక్షించడానికి గంట టైముచాలదు. గంటలో వాల్వ్ ప్రయోగం పూర్తికావాలని నరసింహం శాసనం. వాల్వ్ ప్రయోగం జయప్రదమైతే—ఒకేఒక్క సంవత్సరంలో ఇలాంటి మరమనుషుల్ని మనం పదిమందిని సృష్టించి నరసింహాన్నదుపు చేయవచ్చు" అన్నాడు.

ఆ విషయమై కాసేపు వాగ్వివాదం జరిగింది. చివరకు వాల్వ్ నరసింహం శరీరంలో ప్రవేశపెట్టాలన్న నిర్ణయం జరిగింది.

సత్యేంద్రకుమార్ ముందుకువెళ్ళి నరసింహం శరీరం ముందుకు వంగుని కూర్చున్నాడు. హృదయభాగంవద్ద వున్న చిన్న అరతలుపు తెరిచాడు. తన జేబులోంచీ వాల్వును తీసి ఆ అరలో ఉంచి తలుపు మూశాడు.

నరసింహంలో ఇంకా చలనంలేదు.

"సత్యేంద్రకుమార్! నువ్విలారా! ఈ రిమోట్ కంట్రోల్‌ను ఆన్‌చేస్తున్నాను...." అన్నాడు జయరాజ్. అతడి చేతిలో వున్నది రిమోట్ కంట్రోల్.

సత్యేంద్రకుమార్ వెనక్కు వచ్చాడు.

జయరాజ్ రిమోట్ కంట్రోల్ స్విచాన్ చేశాడు.

ప్రకాష్‌తో సహా ముగ్గురూ ఉత్సుకతతో నరసింహాన్నే చూస్తున్నారు.

ఇప్పుడతడేం చేస్తాడు?

తమ అదుపులో ఉంటాడా? లేక పూర్వపు నరసింహం లాగే ప్రవర్తిస్తాడా?

నరసింహం పడుకున్నవాడల్లా కాళ్ళూ చేతులూ జోడించి లేచి నిలబడ్డాడు.

"హుర్రే" అన్నాడు జయరాజ్.

జయరాజ్ రిమోట్‌కంట్రోల్ ఆపరేట్ చేయసాగాడు.

ఇప్పుడు నరసింహం అతడు నుంచోమంటే నుంచుంటున్నాడు. కూర్చోమంటే కూర్చుంటున్నాడు. నవ్వమంటే నవ్వి—ఏడ్వమంటే ఏడుస్తున్నాడు.

"పరుగెత్తు!" అన్నాడు జయరాజ్ ఓ స్విచ్‌నొక్కి.

నరసింహం బయటకు పరుగెత్తాడు.

"ఆ పరుగు చూడు—ఒలింపియన్సులా ఉంది. హౌ గ్రేస్‌ఫుల్!" అన్నాడు జయరాజ్ ముచ్చటగా.

"అతణ్ణి ఆపండి. ఎక్కడికి పోతాడో ఏమో!" అన్నాడు సత్యేంద్రకుమార్.

"ఎక్స్‌పెరిమెంట్ గ్రాండ్ సక్సెస్!" అన్నాడు ప్రకాష్ ఉత్సాహంగా.

జయరాజ్ స్విచాఫ్ చేశాడు. ముగ్గురూ గదిలోంచి బయటకు వచ్చారు. దూరంగా కనబడ్డ దృశ్యం వారి నాశ్చర్యచకితులను చేసింది.

దూరంగా పడివున్నాడు నరసింహం. అతడినుంచి ఏదో ద్రవం బయటకు వస్తోంది. జనం చుట్టూ మూగుతున్నారు.

వాళ్ళు ముగ్గురూ అక్కడకు చేరారు.

రిమోట్ కంట్రోల్‌తో నరసింహం కదలడంలేదు. ఆ తర్వాత గంట గడిచినా నరసింహం లేవలేదు. అతడి నుంచి మాత్రం ఆగకుండా పొగ వస్తోంది. అతడినుంచి వచ్చే ద్రవం అగ్నిపర్వతం నుంచి వచ్చే లావాలాగుంది!

పైనుంచి నరసింహాన్నెవరూ అంతం చేయలేక పోయారు.

లోపల్నుంచి ఇప్పుడతడే నశించిపోతున్నాడు.

అదే సమయంలో—బాల త్రిపురసుందరీ దేవి గుడివద్ద ముగ్గురు బిచ్చగాళ్ళు విషం తిని ఆత్మహత్య చేసుకున్నారన్న వార్త నగరంలో గుప్పుమంది.

36

"లోపల వైర్లు షార్టయ్యాయి. మనం ఆ పరిస్థితిలో వాల్యూపెట్టాం. అందుకే మొత్తం యంత్రం నాశనమైంది. వైర్లు షార్టయినప్పుడు ఆన్‌చేస్తే ఏ యంత్రమైనా నాశనమవుతుంది" అన్నాడు సత్యేంద్రకుమార్.

"ఒకే ఒరలో రెండు కత్తులిమడవు. ఒకే శరీరంలో రెండు ఆత్మలిమడవు. నరసింహం ఆత్మ ఆ శరీరాన్నంటి పెట్టుకునే ఉంది. మన వాల్యూ ఆ శరీరానికి రెండవ ఆత్మ. ఫలితం—నరసింహావతార సమాప్తి!" అన్నాడు జయ రాజ్.

ఇప్పుడా సైంటిస్టు లిద్దరూ ఒక విచిత్ర స్థితిలో ఉన్నారు. తమ ప్రయోగం జయప్రదమో, కాదో వారికి తెలియడంలేదు.

నరసింహావతారం—నరసింహం ఆత్మతో నడిచిందో, వైర్లు షార్టయితే నడిచిందో ఇద్దరికీ తేలియదు. కానీ ఇప్పుడలాంటి మరోమనిషిని సృష్టించాలంటే ఇద్దరికీ భయంగానే ఉంది.

ఏది ఏమైనా—ఊళ్ళో నరసింహం గురించి రకరకాల కథలు ప్రచారంలోకి వచ్చాయి. శల్యరాజుకూడా జయరాజ్ గురించి ఎక్కడా చెప్పలేదు. చెప్పినా నమ్మడానికి అసాధ్య మైన విశేషమది!

ప్రపంచానికో దుర్మార్గుడి పీడ విరగడయింది. ఇంకా బయటపడ్డ జగపతిరావు నేరాల్లో భాగస్వాములను పట్టు కునే విషయంలో పోలీసులు కొంత జాగ్రత్త వహించారు. భిక్షేశ్వర్ వంటి కొందరు ప్రముఖులకు తగిన సత్కారం లభించింది. అతడి నేరాలు బయటపడగానే ప్రజలతణ్ణి వేటకుక్కల్లా తరిమారు. అతడికి బయటి ప్రపంచంకంటె పోలీస్‌స్టేషన్లోనే రక్షణ ఎక్కువ లభిస్తుందనిపించింది.

నందనరావు భగవంతుడి ముందు చెప్పిన జగపతిరావు పాపాలను రికార్డుచేసి చంప పోలీసులకు అందజేసింది.

ఇంకా....

ప్రకాష్ తనకు తోడుగా జయరాజ్ వద్దనే పనిచేస్తున్న స్వప్నను వివాహం చేసుకున్నాడు.

సత్యేంద్రకుమార్ గతంలోలా లాబొరేటరీకే జీవితాన్నంకితం చేయక తరచుగా అమెరికాలో ఉన్న శ్వేతకు ప్రణయలేఖలు వ్రాస్తున్నాడు.

జయరాజ్ తన భార్య చంద్రమతిలో మానసిక వికాసం తీసుకుని వచ్చేందుకు లాబొరేటరీకంటే ఎక్కువ కాలాన్ని వెచ్చిస్తున్నాడు.

ప్రపంచానికి మిస్టరీగా మిగిలిపోయిన నరసింహావతారం తన కార్యక్రమాన్ని జయప్రదంగానే నిర్వహించుకున్నందువల్ల—ఆత్మలంటూ ఉంటే నరసింహం ఆత్మ ఈపాటికి దైవసాన్నిధ్యాన్ని చేరుకునే ఉంటుంది.

—సమాప్తం:—

నెంబర్ వన్!



ప్రేమరోగి

కె.వి.యస్.యస్.మూర్తి

మెట్లమీదనుండి క్రిందికి దిగిపోతున్నా డతడు.

ఆమె తలుపులు దబదబ బాదింది.

అడుగుల చప్పుడు ఒక్కసారిగా ఆగింది. ఆమె గట్టిగా అరిచింది.

"ఏం కావాలి?" బయటనుండే అడిగాడు అతడు.

"తలుపు తియ్యి! లేకపోతే అరుస్తాను!"

అతడు పక పకా నవ్వేడు. "పిచ్చిదానా! అరు! ఈ ప్రాంతానికి పాతిక మైళ్ళలోపు నరమానవుడు లేడు. నువ్వు ఎంత అరిచి గీపెట్టినా లాభం లేదు. గొడవ చెయ్యకుండా లోపల పడుండు. వృధా ప్రయాసకు పోకు" అన్నాడు.

వనిత అతడు చెప్పేది వినిపించుకోలేదు. ఇంకా గట్టిగా అరిచింది.

అతడు కోపంగా తలుపులు తీసి లోపలకు వచ్చాడు. "చెప్పేది నీకు కాదూ!" అన్నాడు.

వనిత అతనిని అసహ్యంగా చూసింది. "ఎందుకు నన్నిక్కడకు తీసుకొచ్చావ్?" అంది.

"చూడు వనితా! నువ్వు నాకు భార్యవు కావలసిందే. అందుకోసం నేను ఏం చెయ్యడానికయినా వెనుకాడను. నీ అంతట నువ్వుగా నాకు లొంగాలి. అప్పటివరకూ నీకు ఈ బందిఖానా తప్పదు!"

"అది ఎప్పటికీ జరగదు!"

"అయితే నీ ఖర్మ! ఓపిక వున్నంతకాలం నేను నీ గురించి కాచుకొంటాను. ఓపిక నశిస్తే నిన్ను యిక్కడ వదలి వెళ్ళిపోతాను" అని గబ గబ బయటకు వెళ్ళి తలుపు గడియ వేశాడు. మరో అయిదు నిముషాలలో దూరంగా కారు స్టార్టయిన చప్పుడు వినపడింది.

వనిత నిస్త్రాణగా గది మూలనున్న నులక మంచం మీద కూలబడింది. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

సరిగ్గా యిరవైనాలుగంటల క్రితం యిదే సమయంలో యింట్లో అమ్మ చేసిన వంట రుచి చూస్తోంది తను.

నిన్న తన పుట్టిన రోజు. చాలా సరదాగా గడిచింది. సాయింత్రం పెద్ద పార్టీకి ఏర్పాటు చేశాడు తండ్రి. సరిగా పన్నెండు కావస్తోందనగా వూడి పడ్డాడు బాబ్జీ. తల్లి వంటింట్లో ఏదో సర్దుకుంటోంది.

"వనితా! మెనీ రిట్రన్స్ ఆఫ్ ద డే!" అన్నాడు బాబ్జీ.

"థాంక్యూ!" అంటూ స్వీట్ అందించింది తను.

స్వీట్ అందుకోని "ఐ లవ్ యూ వనితా!" అన్నాడు.

"చూడు బాబ్జీ! అనవసరంగా నా మూడ్ పాడు చెయ్యక. నీకు ఎన్నిసార్లు చెప్పాలి! ప్లీజ్ నన్ను వదిలెయ్."

"వనితా! నాకేం తక్కువ! ఆస్తి లేదా? చదువు లేదా? కురూపినా? ఎందుకు. ఎందుకు నన్ను కాదంటున్నావు? నాకేం తక్కువ?" ఆవేశపడిపోయాడు.

"సంస్కారం!" అంది తను. బయటకు రాబోయింది.

"అయితే నువ్వు నన్ను పెళ్ళి చేసుకోవటానికి యిష్ట పడవా?"

"ఐ హేట్ యూ!"

"అంతేనా!"

"అంతే!"

"నిన్ను బలవంతంగా వప్పించయినా పెళ్ళి చేసుకుంటాను."

"ఇంపాసిబుల్!"

"అదీ చూస్తాను!" అంటూ తన దగ్గరకు వచ్చాడు. చటుక్కున తనను బలంగా అదిమిపట్టుకొన్నాడు. తను అరవబోయింది. అప్పటికే జేబులోంచి రుమాలు తీసి

ముక్కు దగ్గర పెట్టాడు. తియ్యగా వాసన వేసింది. తల వాల్చేసింది.

వనిత ట్రూస్తోంది. స్పృహ వచ్చేటప్పటికి తను యిక్కడ మంచం మీద పడుంది.

ఆలోచిస్తున్నకొద్దీ తల బద్దలయిపోతోంది. 'ఏం జరిగితే అది జరుగుతుంది' అనుకొని మంచం మీద వాలింది వనిత. మరుక్షణం నిద్రాదేవి ఒడిలో ఒరిగి పోయింది.

2

చటుక్కున మెలకువ వచ్చింది వనితకు.

తనను బాబ్జీ ఏం చెయ్యదల్చుకున్నాడు? ఇప్పటివరకు తిన వంటిమీద చెయ్యి వెయ్యలేదు. అతనికి నిగ్రహం ఎంతకాలం వుంటుంది! అసలు తనను బంధించింది ఏ ప్రాంతం?

వెలుతురు సన్నగా పడుతోంది కిటికీలోంచి. అసలు తనకి యింత మొద్దు నిద్ర ఎలా పట్టింది?

వనిత తల విదలించింది. ఎదురుగా చిన్న బల్లమీద మూతలు పెట్టి వున్న భోజన పదార్థాలు కనిపించాయి. వాటిని చూడగానే వనితకు ఆకలి గుర్తుకు వచ్చింది.

నిన్న ఎప్పుడో తిన్న అన్నం. బహుశా బాబ్జీ తను పడుకున్న సమయంలో వీటిని యిక్కడ పెట్టి వుండాలి. ఆకలితో శోష వచ్చేలా వుంది. ఏదో కొంత కడుపులో పడితేగాని ప్రాణం నిలచేలా లేదు. వనిత ఆహార పదార్థాలను ముందుకు లాక్కొని చాలా ఆకలిగా తింది.

తను వెంటనే యిక్కడి నుండి బయటపడాలి. ఎలా?

వనిత తాను బంధింపబడ్డ గదిని చాలా జాగ్రత్తగా పరిశీలించింది.

చాలా విశాలమయిన గది. ఓ బల్ల, మంచం తప్పితే అందులో ఏ వస్తువులేం లేవు. తలుపు బయట నుండి బంధింపబడి వుంది. తలుపును లాగి చూసింది. రాలేదు. తలుపుకు చిన్న బెజ్జం వుంది. దాన్నుంచి బయటకు చూసింది.

బయట పెద్ద హాలు. బయట నుండి వెలుగు పడుతోంది. వనిత హాలును నిశితంగా పరికించి చూసింది. ఎవరూ కనిపించలేదు. బాబ్జీ బయటకు వెళ్ళి వుంటాడు.

వనిత తలుపుని నిశితంగా చూసింది. తలుపుకు తాపడం చేయబడ్డ పొడవాటి రేకు ఆమె కంట బడింది. దానిని పట్టుకొని లాగింది. రాలేదు. ఆ రేకును అటూ యిటూ వంచింది. రేకు బాగా తుప్పుపట్టిపోయింది. తుప్పు దిగి సున్నితమయిన ఆమె వ్రేళ్ళు నొప్పి పుడుతున్నాయి. మొహం అంతా చెమటతో తడిసిపోయింది. అయినా ఆమెకు బాధ తెలియటంలేదు. పావుగంట కష్టపడ్డాక రేకు చేతులోకి వూడి వచ్చింది.

అయిదు నిముషాలు గోడకు ఆనుకొని ఆయాసం తీర్చుకుంది.

రేకును తలుపుకు ఉన్న సందులోకి తోసింది. తలుపు చుట్టూ గీతలా గీస్తూ వెళ్ళింది! తలుపుకు ఒక ప్రక్క రేకుకు ఏదో అడ్డం తగిలింది!

వనిత అరక్షణం వూపిరి పీల్చుకోవడం మరచిపోయింది. రేకుతో మెల్లగా వత్తింది. 'టిక్' అన్న శబ్దంతో గడియ ప్రక్కకు తప్పుకొంది. తలుపు తెరచుకొంది. ఒకసారి అటూ యిటూ హాలులోకి చూసింది. మెల్లిగా అడుగులు వేసుకొంటూ మెయిన్ ద్వారం తెరచుకొని బయటకు వచ్చింది.

అంతా అడవి. చుట్టూ దట్టమైన చెట్లు; గుట్టలు.

ఇంకా పూర్తిగా చీకటి పడలేదు. మసకగా వుంది. ఒక్కసారిగా వెనక్కు తిరిగి తనున్న భవనాన్ని చూసింది.

అదేదో మాయలపకీరు స్థావరంలా ఉంది. భవనం నిండా ఎక్కడ పడితే అక్కడ పిచ్చి మొక్కలు మొలచి వున్నాయి. ఒక వయిపు పూర్తిగా కూలిపోయి వుంది. ప్రతి ద్వారం దగ్గరా రెండేసి దెయ్యాలు నిలబడి తనకేసి ఆశగా చూస్తున్నట్లు భ్రమపడింది వనిత. గబ్బిలాలు వీర విహారం చేస్తున్నాయి. భవనం చుట్టూ బ్రహ్మజెముడు కట్టవ దట్టంగా పెరిగిపోయి చూడడానికి వికృతంగా వుంది. దూరంగా పెద్ద పెద్ద చెట్లు జుత్తు విరబోసుకున్న దెయ్యాల్లా వున్నాయి.

వనిత వడిపడిగా ఆ అడవిలో నడవసాగింది.

దూరం నుండి ఏవో క్రూర జంతువుల అరుపులు వినబడుతున్నాయి.

దగ్గిర నుండి ఏదో కమ్మని వాసన వస్తోంది. ఈ వాసన గురించి తను అమమ్మ దగ్గిర వింది. పాములు వుంటే అటువంటి వాసన వేస్తుందిట. వనిత గుండె గుభేల్ మంది. ఈలోగా దూరం నుండి నక్క పెద్దగా వూళ పెట్టింది. సహజంగా వనిత ధైర్యస్థురాలు. అయినా చాలా భయపడి పోయింది.

వనిత ధైర్యంగా ముందుకు అడుగులు వేయసాగింది.

చెట్లమీద నిద్రపోతున్న పక్షులు ఒక్కసారిగా గోలగా అరిచాయి ఎందుకో! వాటి అరపులు ఆ నిశ్శబ్దపు అరణ్యంలో భయంకరంగా వున్నాయి. వనితకు ఏదో అనుమానం వచ్చింది.

పక్కనుండి యేదో గబ్బువాసన! ఏమిటది?—పులి!

అవును ఆ మృగం ఎండుటాకులమీద నడిచొస్తోంది. శబ్దం అవుతోంది. కొద్దిక్షణాలు టెన్షన్‌తో అదిరే గుండెతో అలాగే కదలక మెదలక నిల్చున్నది వనిత. వూపిరి తీసుకోవడం మరిచిపోయింది. శిలావిగ్రహంలా బిగుసుకుపోయింది. ఇక తన పని అయిపోయింది.

ఒక్కసారి భయంతో కళ్ళు మూసుకుంది వనిత.

పులి గాల్లోకి ఎగిరింది. వనితమీద పడబోయింది!—ఇంతలో ఎక్కడినుండో రెండు బుల్లెట్లు వచ్చి ఆ పులిని బలి తీసుకున్నాయి.

వనిత ఆశ్చర్యపోయింది! ఎవరు? ఎవరు తనని రక్షించారు?

ఆయాసంతో ఎగిసిపడే ఎదపై చెయ్యి వుంచుకొని పక్కకు చూచింది. ఆమెకు గుండాగిపోయినంత పనైంది. అక్కడ బాబ్జీ విషపు నవ్వుతో నిలబడి వున్నాడు. వనిత నీరుగారి పోయింది. "పులి నోట్లో పడ్డా బాగుండును. వీడి నోట్లో పడ్డాను మళ్ళీ!" వాపోయింది.

దాదాపుగా లాక్కుపోతున్నట్లుగా వనిత జబ్బ పట్టుకుని పాడుబడిన భవంతిలోకి తీసుకుని వెళ్ళాడు బాబ్జీ. "నా నుంచి తప్పించుకుందామనుకున్నావా! అది ఈ జన్మలో జరగదు!" అరిచాడు కోపంగా.

నేలచూపులు చూస్తూ వుండిపోయింది వనిత.

3

పై సంఘటన జరిగాక బాబ్జీ. వనితను ఒక చీకటి గది లాంటిదాంట్లో బంధించాడు. ప్రొద్దుటే కాలకృత్యాలకు వనితను బయటకు తీసుకువెళ్తున్నాడు. మూడు పూట్లా తినటానికి టిఫెన్, భోజనం అందిస్తున్నాడు.

అప్పుడప్పుడు తనని పెళ్ళి చేసుకోమని బలవంత

పెడుతున్నాడు. దురుసుగా ప్రవర్తిస్తున్నాడు. నాలుగు రోజులు గడిచిపోయాయి.

అయిదవ రోజు హృదయం బాగా తాగొచ్చాడు బాబ్జీ.

"వనితా! ఆఖరిసారిగా హెచ్చరిస్తున్నాను. సాయంత్రం లోగా మనసు మార్చుకో! ఇంక నాకు ఓపికలేదు! అలా కాదంటే నీకు యిష్టం లేకుండానే జరగాల్సినవన్నీ జరిగి పోతాయి!" అని చెప్పి, విసురుగా బయటకు వెళ్ళి పోయాడు.

వనిత వెక్కి వెక్కి ఏడ్చింది. తనను ఆ గండం నుండి గట్టెక్కించమని వెయ్యి దేముళ్ళకు మొక్కు కొంది. ఎలాగైనా బాబ్జీ బారినుండి బయటపడాలి. లేదా అతడిని చంపైనా తనని తాను రక్షించుకోవాలి—

వనిత వాచీ చూసుకొంది. మధ్యాహ్నం రెండు కావ టానికి అయిదునిముషాల వ్యవధి వుంది. గదిలో అటూ యిటూ తిరుగుతూ గోడల్ని, నేలని, లోపల వున్న సామగ్రిని పరిశీలించింది.

గోడలన్నీ నల్లగా బూజులు పట్టి పెచ్చులు వూడిపోయి అసహ్యంగా వుంది ఆ గది. ఆమె మేధ తీవ్రంగా పని చేయసాగింది.

నేలకు నాపరాళ్ళ ఫ్లోరింగ్ వుంది. నేలను జాగ్రత్తగా పరిశీలించింది. ఒక నాపరాయి క్రింద డొల్లగా వుంది. వెంటనే టేబిల్ మీద వున్న సిల్వర్ ప్లేటును విరగ గొట్టింది. దానితో నెమ్మదిగా నాపరాయి చుట్టూవున్న గచ్చును పెచ్చులు పెచ్చులుగా వూడగొట్టింది. ఒళ్ళంతా చెమటలు పట్టింది. ఎప్పుడూ కష్టపడి ఎరగదేమో ఆయాసం వస్తోంది. చేతులు వరుసుకుపోతున్నాయి.

ఒక అరగంట శ్రమపడ్డాక ఆమె ప్రయత్నం ఫలిం

చింది. నాపరాయి చుట్టూవున్న గచ్చు వూడిపోయింది. నాపరాయి చుట్టూ అరంగుళం మేర బోర్డరులా ఖాళీ జాగా యేర్పడింది. జాగ్రత్తగా ఆ యేర్పడిన ఖాళీ జాగాలోకి వేళ్ళు జొనిపి రాయిని పైకెత్తబోయింది.

అంతలోనే "అమ్మా" అంటూ చెయ్యిని వెనక్కు కొంది.

కుడిచేతి మధ్యవేలు నాపరాయి మధ్య ఇరుక్కుపోయి గోరు పూర్తిగా వూడిపోయింది. బొట బొటా రక్తం కారింది. ఆమెకు ఏడుపు ముంచుకొచ్చింది. చీరచెరగు చింపి రక్తం రాకుండా వ్రేలికి కట్టు కట్టింది. రెండు నిముషాలు అలుపు తీర్చుకొంది.

శక్తినంతా కూడదీసుకుని నాపరాయిని పైకెత్తింది. వేలు నెప్పి పుడుతోంది. అయిదునిముషాల తర్వాత నాప రాయి పూర్తిగా పైకి లేచింది.

ఆమె కళ్ళు మెరిశాయి. నాపరాయి కిందనుండి మెట్లు న్నాయి. ఆమె గబగబా మెట్లు దిగింది.

అదొక నేలమాళిగ. అది మట్టిని దొలిచి చేసిన సొరంగం. గోడలన్నీ చెమ్మగా అసహ్యంగా వున్నాయి. నేలంతా తడి తడిగా వుంది. సొరంగం లోపలకు ఎక్కడి నుండో వెలుగు సన్నగా పడుతోంది.

వనిత అడుగులువేస్తూ ముందుకు వెళ్ళింది. సొరంగ ద్వారంవద్దకు వచ్చింది. ద్వారం దగ్గర కూలిపోయిన మట్టి గోడ వుంది. నెమ్మదిగా ఆ గోడను దాటి బయటకు వచ్చింది.

తను యిప్పుడు భవనం వెనుక ప్రాంతంలో వుంది. టైము చూసుకొంది. నాలుగైంది.

తనున్న భవనం యిప్పుడు ఎక్కడ వుంది? పట్నానికి

పాతికమైళ్ళ దూరంలో వుందని చెప్పాడు బాబ్జీ. అంటే, నడుస్తూ వెళితే పట్నం చేరుకోవటానికి నాలుగుగంటలు పైన పడుతుందన్న మాట. తను యెటువెళితే పట్నం వస్తుంది? దారి తప్పితే?

వనిత భవనం ముందుకు వచ్చింది. పరికించి చూసింది. బాబ్జీ లేదు. కారు కూడా లేదు. గేటు దగ్గరకు వచ్చింది. కారు టైరు గుర్తులున్నాయి. ఆ గుర్తులు ఆధారంగా చేసుకొని ముందుకు వెళ్ళింది.

4

చీకటి చిక్కబడుతోంది.

వనిత గంట నుండి విరామం లేకుండా నడుస్తోంది. ఎటు వెళితే ఏమొస్తుందో ఆమెకు తెలియదు. అయినా గుండె నిబ్బరం చేసుకుని టైరు గుర్తుల ఆధారంగా ముందుకి సాగిపోతోంది. అంతుతెలియని కీకారణ్యం. భయం భయంగా వుంది.

ప్రక్క 'సర్'మని శబ్దమయింది. వనిత అటువైపు చూసింది. ఐదడుగుల పైబడ్డ నాగుపాము జర జరా ప్రాక్కుంటూ వెళ్ళిపోయింది. అప్రయత్నంగా ఒక్క అడుగు వెనక్కి వేసింది వనిత. సరిగ్గా అప్పుడే ఆమెకు సమీపంలో యేదో కారాగిన శబ్దం వినబడి చటుక్కున వెనక్కితిరిగి చూసింది.

నిలువుగుడ్లేసుకొని నిలబడిపోయింది వనిత.

కారులోంచి బాబ్జీ దిగాడు. తన వయిపే వస్తున్నాడు. బాగా త్రాగివున్నాడనటానికి నిదర్శనంగా తూలిపోతూ, అంతలోనే నిలదొక్కుకుని నడుస్తున్నాడు.

వనిత ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి.

ఒక్కసారిగా భయం, టెన్షన్ ఆమె నర నరంలోకి పాకిపోయి వణికిపోయింది. తాగివున్న మనిషి మృగంతో సమానం.

తను ఒంటరిగా ఆ నిర్జనప్రదేశంలో....తాగివున్న ఒక మగాడిముందు — ఇందుకేనా నానా కష్టాలూపడి ఆ యింట్లోంచి ప్రాణాలకు తెగించి బయటపడత — వీల్లేదు! బాబ్జీకి దొరకకూడదు! ఆమె యింక ఆలోచించలేదు. ఒక్కసారిగా ముందుకు పరుగుతీసింది.

ఆమె అలా పారిపోతుందని వూహించలేదు బాబ్జీ. ఆమె వెనుకపడ్డాడు.

దట్టంగా పెరిగిన పొదలు, చెట్లు భయంకరంగా కని పిస్తున్నాయి. తన వెనుకవస్తున్న మనిషి దొరికితే తనను సర్వనాశనం చేస్తాడని ఆమెకు తెలుసు.

చురకత్తుల్లాంటి రాళ్ళూ, ముళ్ళపొదలూ ఆమె కాళ్ళను కోసేస్తున్నా, చీర చీలికలై పోతున్నా, ఆమె పరుగును ఆప లేదు. రెండుమూడుసార్లు చీర కాళ్ళకు అడ్డం వచ్చి ముందుకు పడబోయింది. అతి కష్టంమీద నిలదొక్కు కుంది. పరుగెడుతూనే ప్రక్కకు తిరిగి చూస్తోంది.

అతను వస్తూనే వున్నాడు.

వనితకు ఆయాసంతో నాలుక పిడచగట్టుకు పోయింది. బాగా దాహం వేస్తోంది. అయినా లెక్కచేయకుండా ముందుకు పరుగెడుతూనే వుంది. ఆయాసంతో ఆమె ఎద సముద్రపు కెరటంలా ఎగిరెగిరి పడుతోంది.

ఆమెకు ఓపిక నశించింది. ఇక ముందుకు పరుగెట్ట లేనని తెలుసుకొంది. ఏం చేయాలో పాలుపడలేదు.

ఎదురుగా పెద్ద మర్రిచెట్టు కనపడింది. దానినుండి

వూడలు వ్రేలాడుతున్నాయి. కర్తవ్యం వెంటనే స్ఫురించింది వనితకు. చకచక ఒక ఊడను ఆధారం చేసుకొని చెట్టు ఎక్కేసింది.

విశాలమైన చెట్టు అది. బాగా గుబురుగా ఉంది. కొమ్మల మధ్య ఆకుల చాటున దాక్కుంది. తను అక్కడ దాక్కున్న విషయం క పెట్టడం కష్టం!

వనిత అక్కడ కూర్చుని చూస్తోంది. చాలా స్పష్టంగా కనబడుతున్నాడు అతడు. తూఁతూనే పరుగెట్టుకు వస్తున్నాడు. సరిగ్గా చెట్టుక్రిందకు వచ్చాడు.

వనిత మనసంతా టెన్షన్‌తో నిండిపోయింది. గుండె వేగం పెరిగింది.

బాబ్జీ జేబులోంచి సిగిరెట్ తీసి వెలిగించాడు. తాపీగా పొగ వదుల్తున్నాడు.

ఏమిటి ఈ మనిషి యిక్కడ నిలబడ్డాడు? కదలటం లేదు! తను చెట్టెక్కడం చూశాడా? వనిత వూపిరి బిగబట్టుకొని కూర్చుంది. బల్లిలా కొమ్మలకు కరుచుకుని టెన్షన్‌తో చూస్తోంది.

బాబ్జీ టార్చిలైటుతీసి చెట్టుమీదకి వేశాడు "వనితా, నన్ను తప్పించుకు పారిపోలేవు! క్రిందకు దిగు మర్యాదగా" అన్నాడు.

వనిత ఉలుకూ పలుకూ లేకుండా కూర్చుంది.

"వెల్! నామాట వినవన్నమాట! నేను సరిగ్గా పది అంకెలు లెక్కపెడతాను. ఆలోగా క్రిందికి దిగి రాకపోతే తర్వాత చింతిస్తావు" అంటూ అంకెలు లెక్కపెట్టడం మొదలుపెట్టాడు.

"వన్ ...., టూ ...."

వనితకు గుండె దడ ప్రారంభమయ్యింది. 'ఏం చేద్దా

మబ్బా!' అని ఆలోచించసాగింది. అంతలో పైనుండి సన్నగా శబ్దం వినపడింది. పైకిచూచిన వనిత అదిరి పడింది. పై కొమ్మలమీదినుండి నోరు తెరుచుకుని సాగు తోంది ఓ ఆకారం. అది కొండచిలువని వెన్నెల్లో గుర్తు పట్టింది. వనితకు వళ్ళంతా చెమటపట్టేసింది. ఆమె ముఖం దాకా వచ్చేసింది.

"నైన్" అన్నాడు బాబ్జీ.

ఒక్కసారిగా నేలమీదికి దూకేసింది వనిత. నేలమీద ఎండుటాకులు పరుపులా పేరుకుపోయి వున్నాయి. లేక పోతే కాళ్ళూ చేతులూ విరిగిపోయి వుండేవి. నెమ్మదిగా లేచింది. ఒంటికి అంటుకున్న దుమ్ముని ఎండుటాకులను దులుపుకుంది.

"టెన్" అనాల్సిన బాబ్జీ నోటిలోంచి మూలుగు విన పడింది, నూతిలోంచి వచ్చినట్లు.

పక్కకి తిరిగి చూచిన వనిత అదిరిపడింది. ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. మెడలోని లాకెట్ ఆమె గుండెలమీద ఎగిరిపడుతోంది.

తను చూచిన కొండచిలువ బాబ్జీని పూర్తిగా ఆక్ర మించుకొంది. వెన్నెలలో అతని మొహం వికృతంగా కనిపించింది. ముక్కులోంచి రక్తం కారుతోంది.

అకస్మాత్తుగా జరిగిన సంఘటననుండి కోలుకోవటానికి అయిదు నిముషాలు పట్టింది వనితకు.

వనిత వెనక్కు తిరిగి పరుగెత్తింది. అరగంటలో బాబ్జీ ఆపిన కారుని చేరుకొంది. ఆమె అదృష్టం కలి సొచ్చి కారులోనే తాళంచెవులు వున్నాయి. వనిత కారుని స్టార్టుచేసి పట్నం వైపుకు వురికించింది. □

ప్రాణభీతి

బి.వి. ఈశ్వర్



సమయం రాత్రి 8-15 నిముషాలు అయ్యింది. అపుడే ఫస్ట్ షో వదిలారు. సాయిబాబా థియేటర్ దగ్గర రద్దీగా వుంది. శేఖర్, రాజు థియేటర్ నుంచి బయటకు వచ్చారు. స్టాండులో పెట్టిన బుల్లెట్ తీసి స్టార్టుచేసాడు రాజు. వెనుకనే కూర్చున్నాడు శేఖర్.

మోటర్ సైకిల్ వేగంగా కడప వీధులగుండా దూసుకున వెళుతుంది. వూరు చివరకు వచ్చింది వెహికల్. అది తిరుపతివెళ్ళే రోడ్డు. రాజు, శేఖర్ ఇద్దరూ బద్వేలు వెళ్ళాలి.

శేఖర్ బద్వేలులోని సినిమా థియేటర్ ఓనరు కొడుకు. రాజు ఇంజనీర్ తమ్ముడు. ఇద్దరూ కలసి రిలీజ్ అయిన క్రొత్తసినిమా చూడడానికి "కడప" వచ్చారు.

సాధారణంగా రాత్రిళ్ళు 'కడప'నుంచి "సిద్ధవటం" మీదుగా "బద్వేలు" రావటానికి భయపడతారు. కారణము "సిద్ధవటం"నుంచి 14 కి॥మి పొడవున నల్లమలై అడవులకు చెందిన శాఖలు విస్తారంగా వున్నాయి.

ఆ అడవులలో ఎర్ర చందనం ఎక్కువగా దొరుకుతుంది. దానికితోడు ఎర్ర చందనాన్ని దొంగరవాణా చేసే కాంట్రాక్టర్లు కూడ ఎక్కువే.

ఎర్రచందనము అక్రమ రవాణా కొంతవరకూ అరికట్టడానికి ప్రభుత్వము రెండు చిరుతపులులను ఆ అడవిలో వదిలిపెట్టి, దానిని రక్షిత ప్రాంతంగా ప్రకటించింది.

'కడప'నుంచి 'బద్వేలు' రావటానికి మరో దారివుంది. అది 'మైదుకూరు' మీదుగా వస్తుంది. జాతీయ రహదారి. కాని పదిహేను కిలోమీటర్లు ఎక్కువ ప్రయాణము చెయ్యాలి.

టైమ్ కూడా వేస్ట్.

అందుకే కొంచెము రిస్క్ అయినా సిద్ధవటం వైపుగా రావటానికి సిద్ధపడ్డారు ఇద్దరూ.

'కడప' వూరు చివర పెట్రోల్ బంకువుంది. అక్కడ ఆపాడు బుల్లెట్‌ని రాజు. టాంకునిండా పెట్రోల్

పోయించుకున్నాడు.

మరలా బుల్లెట్‌ను స్టార్ట్ చేసాడు రాజు. బుల్లెట్ నెమ్మదిగా కదిలింది.

"రాజూ స్పీడ్‌గా పోనియ్‌రా" శేఖర్ అన్నాడు.

"అలాగే" అంటూ మరికొంత స్పీడ్ పెంచాడు రాజు.

"నీకు అంత భయము ఎందుకురా" నవ్వుతూ ప్రశ్నించాడు రాజు.

"భయం కాదురా జాగ్రత్త. మనము వెళ్ళే రూట్ మంచిగా వుండదని తెలుసు. దానికి తోడుగా అడవి మధ్యలో రోడ్డు ప్రక్కగావుండే ఆ పాడుపడిన బిల్డింగ్ దగ్గర దొంగలు ఈమధ్య దారిదోపిడి చేస్తున్నారని తెలిసింది" వివరించాడు శేఖర్.

రాజు వేగంగా బుల్లెట్ డ్రైవ్ చేస్తున్నాడు. ఎదురుగా తిరుపతినుండి వచ్చే బస్సు వేగంగా క్రాస్‌చేసి వెళ్ళిపోయింది.

సమయం రాత్రి పది గంటలు దాటుతుంది. చీకటి చిక్కగా వ్యాపించింది. బుల్లెట్ లైటువెలుగు రోడ్డుపై ప్రసరిస్తుంది.

కీచురాళ్ళు నిర్విరామంగా అరుస్తున్నాయి. ఆ శబ్దాన్ని బుల్లెట్ శబ్దము మింగివేస్తుంది.

"శేఖర్! సప్తపదిలో ముగింపు బావుంది కదరా!" ఆ శబ్దాన్ని బద్దలుచేస్తూ అన్నాడు రాజు.

"ఏ మామగారు అలా కోడల్ని మరొకడికి ఇచ్చి పెళ్ళి చెయ్యటానికి అంగీకరించరు. సినిమా కదా" నవ్వుతూ జవాబిచ్చాడు శేఖర్.

'భక్రాపేట' సమీపించింది బుల్లెట్. అక్కడనుంచి రోడ్డు ఎడమ ప్రక్కకు చీలుతుంది. అది బద్వేలు వెళు

తుంది. డైరెక్టుగా వెళ్ళే రోడ్డు "రాజంపేట" మీదుగా తిరుపతి వెళుతుంది.

సంభాషణల మధ్య వేగంగా ప్రయాణిస్తుంది బుల్లెట్. కాలము నెమ్మదిగా కరుగుతుంది.

"ఒరేయ్ రాజు. రెండురోజుల క్రితం నేను, మా ఆపరేటర్ రాత్రి ఒంటిగంట దాటాక ఇటువైపే వస్తున్నాము బండిమీద. నేను చాలా వేగంగా డ్రైవ్ చేస్తున్నాను.

దూరంగా లైటు వెలుగులో ఏదో కనిపించింది. దగ్గరకు వచ్చాక చూస్తే ఏముంది. శవం. ఎవరో రోడ్డుకు అడ్డంగా వచ్చినపుడు ఏ లారీవాడో కొట్టేసి వుంటాడు. అంతే. అవుట్." నవ్వుతున్నాడు శేఖర్ చెపుతూ.

బుల్లెట్ వేగంలో మార్పు వచ్చింది. అప్పటికే వాళ్ళు "సిద్ధవటం" దగ్గర దగ్గరకు వచ్చారు.

"పెన్నానది పై వున్న "కాజ్‌వే" దగ్గరకు వచ్చేసరికి బుల్లెట్ లైటు ఆరిపోయింది. బండి పూర్తిగా స్లో అయ్యింది.

రాజు ఎక్స్‌లేటర్‌ను అటు యిటు త్రిప్పుతున్నాడు. ఒక్కసారిగా లైటు పోవడముతో కళ్ళు చీకటికి అలవాటు పడకపోవడముతో బుల్లెట్‌కు బ్రేక్ వేసి ఆపాడు.

అప్పటికి బండి రోడ్డు దిగిపోయి ముళ్ళచెట్ల దగ్గర ఆగింది.

నవ్వుతున్న శేఖర్ ఒక్కసారిగా లైటు పోవడముతో ఉలిక్కిపడ్డాడు.

"ఏమయిందిరా" ఆత్రుతగా అడిగాడు శేఖర్.

సమాధానం చెప్పలేదు రాజు.

"అసలేం జరిగిందిరా" మరలా అడిగాడు శేఖర్.

"ఏమోరా, బహుశ బ్యాటరీ కనెక్షను వూడిపోయి వుంటుంది"

"ఇప్పుడెలారా" శేఖర్ భయంగా అడిగాడు. ఆ చిక్కని చీకటి శేఖర్‌ను భయపెడుతుంది.

కీచురాళ్ళ ధ్వని కీచుగా వినిపిస్తుంది.

రాజుకు ఏం చెయ్యాలో అర్థము కావడములేదు. బ్యాటరీ చెక్ చెయ్యడానికి వెలుతురు లేదు. చీకటి ఓ భూతంలా వుంది.

"ఏదైనా వచ్చేవరకూ ఆగాలి" నెమ్మదిగా అన్నాడు రాజు.

ఇద్దరూ నడుచుకుంటూ కాజ్‌వే వరకూ వచ్చారు. అక్కడనుంచి చూస్తే డౌన్‌లో వెలుగుతూ మంట కనిపించింది.

ఆ మంట శవ దహనముగా గుర్తించారు ఇద్దరూ. చితి అంటించి వెళ్ళిపోయి వుంటారు దాని తాలూకు మనుష్యులు.

పెన్నానదిలో ఎపుడూ నీళ్ళు వుండవు. ఒక్క వర్షా కాలము తప్ప. అందుకే ఆ ఇసుక మేటలను స్మశానంగా వుపయోగిస్తారు సిద్ధవటం నివాసులు.

చిక్కటి చీకటి. అందులో శవము కాలడము. వున్న ధైర్యం కూడ నెమ్మదిగా సడలిపోతుంది శేఖర్‌కి.

శేఖర్ రాజు చెయ్యి పట్టుకున్నాడు ధైర్యం కోసమా అన్నట్లు.

రాజులో ఓ విధమైన తెగింపు. "అక్కడ కాలుతున్న కట్టె తెచ్చుకుంటే దాని వెలుతురులో మన బండి రిపేరు చేసుకోవచ్చు" నెమ్మదిగా చెప్పాడు.

"వద్దురా, వద్దు" భయంగా అన్నాడు శేఖర్.

"మరో దారి లేదురా" కొంచెము విసుగు ధ్వనించింది రాజు గొంతులో.

"అయితే నువ్వు ఇక్కడేవుండు నేను వెళ్ళితెస్తాను" మళ్ళీ అంటూ రెండడుగులు ముందుకు వేసాడు రాజు.

"రాజూ అటు చూడు" అంటూ సిద్దవటం నుంచి వచ్చే రోడ్డువైపు చూపించాడు శేఖర్. అతని మాటల్లో కంగారుతో కూడిన ఆనందము వుంది.

రాజు దృష్టి సారించాడు. దూరంగా రోడ్డు మలుపులో కాజ్‌వేకి ఆవలివైపున రెండు లైట్లు కనిపించాయి. అవి వేగంగా దగ్గర అవుతున్నాయి.

రాజు, శేఖర్ చెయ్యి అందిపుచ్చుకుని వేగంగా బుల్లెట్ ఆపిన చోటుకు వచ్చాడు.

రోడ్డుకు అడ్డంగా చెయ్యిచాపి నిలుచున్నారు.

లైటు వెలుగులో రోడ్డుకు అడ్డంగా వున్న ఆ ఇద్దర్ని చూసి తొట్రుపడ్డాడు ఆ లారీ డ్రైవర్.

రోడ్డుకు ప్రక్కగా ఆపిన బుల్లెట్‌ను చూసాడు తరువాత. తరువాత ఇద్దర్ని గమనించి స్లోచేసాడు. దగ్గరకు వచ్చాక ఆపాడు.

"ఏం జరిగింది సార్" లారీనుండి దిగకుండా, డోర్ నుండి తల బైటపెట్టి అడిగాడు. లారీ ఇంజను ఆపలేదు.

"బుల్లెట్ చెడిపోయింది" ఆత్రంగా చెప్పాడు శేఖర్.

"మీరు హెడ్‌లైట్లు ఆన్‌చేసి వుంచితే, నేను రెండు నిముషాల్లో రిపేరు చేసుకుంటాను" సంస్కారాన్ని గొంతులో నింపుకుని అడిగాడు రాజు.

ఒక్కక్షణం ఆలోచించాడు డ్రైవర్. తర్వాత ఒప్పు

కున్నట్టుగా తలవూపాడు.

రాజు వేగంగా బుల్లెట్‌ని రోడ్డుమధ్యకు తెచ్చాడు. బేటరీ కనెక్షను చెక్ చేసాడు. వూడిపోయివుంది. వెంటనే సరిచేసాడు.

బుల్లెట్‌ను స్టార్ట్ చేసాడు. స్టార్ట్ అయ్యింది. లైటు స్విచ్ వేసాడు. వెలిగింది.

శేఖర్ ముఖములోకి ఒక్కసారిగా ఆనందము తన్నుకు వచ్చింది. ఆ ఆనందములో "హుర్రే" అని చిన్నగా అరిచాడు.

ఒక్కసారిగా టెన్షన్ తగ్గిపోయింది. ఇద్దరూ ఒకళ్ళనొకళ్ళు చూసుకున్నారు ఆనందంగా. కళ్ళు పలకరించుకున్నాయి.

లారీ డ్రైవర్‌కు 'థాంక్యూ' చెప్పారు. లారీముందుకు కదిలింది.

బుల్లెట్ సిద్ధపటంలో ప్రవేశించింది. సమయం రాత్రి 12 గం॥ దాటుతుంది.

సెకండ్ షో అయిపోయేవరకూ వుండే ఓ 'టీ' షాపు ముందు బుల్లెట్ ఆపాడు రాజు.

శేఖర్ నవ్వుతూ ఏదో చెప్తున్నాడు రాజుకు. రాజు నవ్వుతున్నాడు.

వాళ్ళలో అంత రిలీఫ్ రావడానికి కారణము రాత్రిళ్లు సాధారణంగా ఆ రోడ్డుపై ఎటువంటి వాహనాలు తిరగవు ఎప్పుడైనా ఒకటి. అరా లారీలు తప్పించి.

ఆ టైమ్‌లో ఎదురుగా లారీ రావడము వాళ్ళ అదృష్టం!

2

టీ తాగి తృప్తిగా సిగరెట్ కాల్చుకున్నారు ఇద్దరూ.

బుల్లెట్ స్టార్ట్‌చేసాడు రాజు. నెమ్మదిగా 'బద్వేలు'

వైపు కదిలింది బుల్లెట్. గాలిని చీల్చుకుంటూ వేగం పెంచుకుంటుంది బుల్లెట్.

సరిగ్గా అక్కడినుంచే ప్రారంభం అవుతుంది అడవి. రోడ్డుకు ఇరుప్రక్కలా అంతులేని వృక్ష సంపద. పగలే భయం కలిగించే నిశ్శబ్దము.

రోడ్డు ఎత్తు. పల్లాలతో వుంటుంది.

రాజు దృష్టి తీక్షణంగా బుల్లెట్ వెలుగు పడినంత మేర వుంది.

శేఖర్ ఏమీ మాట్లాడకుండా పరిసరాలను గమనిస్తున్నాడు.

అడవి కారణంగా మరీ చీకటిగా వుంది.

ఆ భయంకర నిశ్శబ్దములో బుల్లెట్ శబ్దము ప్రతిధ్వనిస్తుంది. ఆ చీకటిని చీల్చుకుంటూ బుల్లెట్ హెడ్ లైటు వెలుగు దూసుకుపోతుంది.

స్పీడామీటరు 80 కి॥మీ 90 కి॥మీ మధ్య అల్లల్లాడుతుంది.

గాలిలో తేలిపోతున్న అనుభూతి.

ఇద్దరిలోను ఏవో ఆలోచనలు. ఒకరితో ఒకరు మాట్లాడుకోవడము లేదు

ఆ మౌనాన్ని భరించలేక 'ఏమైనా మాట్లాడరా శేఖర్' తల వెనక్కి త్రిప్పి నెమ్మదిగా అన్నాడు రాజు.

"ఈ ఫారెస్టు దాటేవరకూ నన్ను ఏమి పలకరించవద్దు" కామ్‌గా చెప్పి మాట్లాడకుండా వూరుకున్నాడు శేఖర్.

రాజు మరలా పలకరించడానికి ప్రయత్నించలేదు.

బుల్లెట్ వేగంగా పరిగెడుతూంది.

కళ్ళు చిట్లించుకుని ముందుకు చూస్తూ డ్రైవ్ చేస్తున్నాడు రాజు.

దూరంగా లైటు వెలుగు చివర ఏదో కనిపించింది రాజుకు. లైటు వెలుతురులో ఏవో మెరుపులు.

మరికొంచెము ముందుకు వెళ్ళింది బుల్లెట్. అస్పష్టంగా రాజు కళ్ళకు ఏదో జంతువు కనిపించింది.

ఒక చేత్తో కళ్ళు నులుముకుని చూసాడు.

పిల్లిలా వుంది.

అంతే?

అప్రయత్నంగా బుల్లెట్ వేగం తగ్గి బ్రేక్ పడింది. గేరు న్యూట్రల్‌కు వచ్చేసింది.

ఇంజను ఆడుతూనే వుంది. హెడ్‌లైటు వెలుగుతూనే వుంది.

ఆ జంతువు ఇపుడు ఇద్దరికి క్లియర్‌గా కనిపిస్తుంది.

రోడ్డుకు అడ్డంగా పడుకుని వుంది.

గోధుమ రంగులో నల్లని చారలతో 8 అడుగుల పొడవు వుంది.

చిరుత.

అటవీశాఖ అడవిలో వదిలిన చిరుతపులి!

తల విలాసంగా పైకెత్తి బుల్లెట్ లైటువంక కళ్ళు గుచ్చి చూస్తుంది.

భయంతో బిగుసుకుపోయాడు రాజు. బుల్లెట్‌పైనే కూర్చుని వున్నారు ఇద్దరూ. కాళ్ళు నేలను తాకి బుల్లెట్‌ను బ్యాలన్స్ చేస్తున్నాయి.

శేఖర్‌కు నోట మాట రావడములేదు. సన్నని వణుకు మొదలయింది అతనిలో.

చల్లని గాలి కూడ వాళ్ళ శరీరాన్నుంచి వస్తున్న స్వేద బిందువులను ఆపలేకపోతోంది.

మాట్లాడడానికి కూడా పెదవులు వీడని పరిస్థితి.

వూపిరి బలంగా పీలుస్తున్న ధ్వని, ఇంజను శబ్దంలో కలిసిపోయింది.

చిరుత కదల్లేదు. అలానే కళ్ళు విప్పార్చి లైటువంక చూస్తూ ఆ శబ్దాన్ని గ్రహిస్తోంది.

రాజు ఆలోచిస్తున్నాడు.

"గేర్ వేసి బండిని వేగంగా పోనిస్తే?"

కాని ధైర్యమూ చాలటము లేదు. ఎందుకంటే చిరుత చాలా వేగంగా పరుగెడుతుంది. పరుగు ప్రారంభము లోనే 60 కి.మీ. వేగము వుంటుంది.

మరో దారంట వెళదాము అంటే, రోడ్డుకు అటు యిటు చెట్లు. ఎటూ దరిలేని పరిస్థితి.

"వెనక్కు పోనియ్య" చాలా నెమ్మదిగా చెప్పాడు శేఖర్. భయంతో అతని గొంతు వణుకుతోంది.

మనసులోనే దైవప్రార్థన చేస్తున్నారు ఇద్దరూ.

రాజు ఏమీ సమాధానం చెప్పలేదు. ఈ లోపుగానే—

చిరుత లేచింది. ఒకసారి ఒళ్ళు దులుపుకుంది. లైటు వంక తీక్షణంగా చూసింది. ఆ వెలుతురులో దాని కళ్ళు వింతగా మెరుస్తున్నాయి.

చిరుతపులికి బుల్లెట్ కి 40 గజాల దూరము వుంది.

అది రెండడుగులు వేసింది బుల్లెట్ వైపు. దాని ముఖం చూడడానికి పెద్ద జంగుపిల్లిలా వుంది.

బలంగా రాజు నడుంచుట్టూ చెయ్యివేశాడు శేఖర్. ఇద్దరిలోను భయం. ముఖంలో చావు కళ. కాళ్ళలో వణుకు.

ప్రాణభీతి. యేదో యేదో చెయ్యాలనే తపన. ఏమీ చెయ్యలేని నిస్సత్తువ. భయంతో యే అవయవము సరిగా పనిచెయ్యలేని పరిస్థితి.

బ్లడ్ ప్రెజర్ పెరుగుతోంది.

నరాలు చిట్లిపోతాయా అన్నంత గట్టిగా బుల్లెట్ హేండిల్‌ని బలంగా పట్టుకున్నాడు రాజు.

చిరుత మరో అడుగు ముందుకు వేసింది. మరో అడుగు. దాని కళ్ళలో నీలి రంగుకు తిరిగిన కనుపాపలు.

మరో అడుగు ముందుకు వేసింది చిరుత. గుర్రుగా లైటు వంక చూస్తూ అరిచింది గాండ్రుమని.

అడవంతా ప్రతిధ్వనించింది ఆ శబ్దము.

ఇద్దరిలోను భయం విపరీత స్థాయికి చేరుకుంది.

శేఖర్ విపరీతంగా భయపడిపోయాడు. దానికి తోడు పులి అరుపు. ఆ భయంలో యేమి చేస్తున్నాననే ఆలోచన మాని వెర్రిగా కేకపెట్టాడు.

ఆ కేకలో ప్రాణభీతి వినిపించింది.

అడవిలో మరోసారి మార్మోగింది. ఆ అరుపు చాలా కర్ణకఠోరంగా వుంది.

చిరుత ఆగింది. చెవులు నిక్కరించింది.

రాజులో చావు భయం తెగింపచేసింది. గీరువేసి బండిని ముందుకు ఉరికించాలని, కాలుని కదిపి గీరు వేశాడు.

ఏక్సిలేటర్ ఒక్కసారిగా వెనక్కు త్రిప్పాడు.

బుల్లెట్ నుండి "బోయ్"మని శబ్దము వచ్చింది. కాని బండి కదలలేదు.

మరింత వెనక్కు త్రిప్పాడు ఎక్సిలేటర్.

శబ్దము మరింత పెరిగింది.

కంగారులో గీరు సగ్గా వెయ్యలేకపోయాడు రాజు. అది రాజు గమనించలేదు.

రాజులో కంగారు పెరిగింది.

గీరు పడకపోవడము వాళ్ళ అదృష్టమని రాజుకు తెలీదు.

విపరీతమయిన శబ్దము ఒక్కసారిగా రెండుసార్లుగా వినిపించడముతో కొంచెము బెదిరింది చిరుత.

ఒక నిముషము ఆగింది. మరునిముషము దిశ మార్చుకుని చెట్లలోకి వెళ్ళిపోయింది చిరుత.

ఒక్కసారిగా ఇద్దరినుండి నిట్టూర్పులు వచ్చాయి వెచ్చగా.

మరోసారి గీర్ వేసి క్లచ్ వదిలాడు. బుల్లెట్ కదిలింది మెల్లిగా. ఏక్సిలేటర్ ఒక్కసారిగా యిచ్చాడు. బండి వేగము ఒక్కసారిగా పుంజుకుంది.

ప్రాణగండం నుంచి బయటపడిన ఆనందము వెనుక భయం బండిని చాలా వేగంగా నడిచేలా చేస్తుంది.

ఆ వేగానికి చిరుత తరుముతుందేమో అన్న భయం కూడ వుంది.

బుల్లెట్ మరో రెండు కిలోమీటర్లు ముందుకు వచ్చింది. ఆ అడవి దాటాలంటే 5 కి.మీ. ముందుకు వెళ్ళాలి,

3

బుల్లెట్ గాలిని చీల్చుకు వెళుతూంది. "జుయ్" మన్న శబ్దము గాలిలో కలుస్తుంది.

మరో కిలోమీటరు వెనక్కు జరిగింది.

అపుడే అంతకు ముందు అనుభవించిన టెన్షన్ నుంచి రిలీఫ్ ఫీలవుతున్నారు.

చల్లగాలికి శరీరాలు శక్తిని పుంజుకుంటున్నాయి.

ఇద్దరి మధ్య మౌనం రాజ్యం చేస్తోంది.

మాట్లాడుకోవడానికి కూడా భయపడుతున్నారు.

శేఖర్ లో యేవో విపరీతమైన ఆలోచనలు.

బుల్లెట్ వేగం తగ్గి మందంగా ఎక్కుతుంది అప్. అది ఆ రోడ్డులో వచ్చే పెద్ద ఎత్తుప్రదేశము.

ఆ ఎత్తు యెక్కిన వెంటనే 'డౌన్' వస్తుంది. అంటే రోడ్డు ద్వారా ఓ కొండ పై భాగానికి చేరి మరలా వెంటనే క్రిందకు దిగడము లాంటిది.

పూర్తిగా ఎత్తు ఎక్కింది బుల్లెట్.

సరిగ్గా.

అపుడే కనిపించారు రాజుకు రోడ్డుకు అడ్డంగా కర్ర పెట్టుకుని నిలుచున్న ఇద్దరు మనుషులు.

గండం గడిస్తే మరో గండం.

వెనక్కు వెళ్ళడానికి కూడా సమయం సరిపోదు.

అప్రయత్నంగానే న్యూట్రల్ చేసి బ్రేక్ వేసాడు రాజు.

భయంతో పిడచకట్టుకుపోయింది శేఖర్ గొంతు.

ప్రమాదము వెనుక ప్రమాదము అతణ్ని దాదాపు పిచ్చివాడ్ని చేసింది.

రాజులో ఓ విధమైన ధైర్యము.

"ఎందుకు ఆపారు మమ్మల్ని?" తెలిసికూడ తెలియనట్టు ధీమాగా అడిగాడు రాజు.

అది "అప్" కాకపోతే వేగంగా ఆపకుండా వెళ్ళిపోయేవాడే. కాని స్లోగా వెళ్ళడమువలన వాళ్ళు కర్రలతో కొడితే ఇద్దరికి తగిలే ప్రమాదము వుంది. అందుకే ఆపి ప్రశ్నించాడు.

క్రూరంగా నవ్వాడు కర్ర పట్టుకున్న వ్యక్తి.

అపుడు గమనించాడు అక్కడో పాడు పడిన ఇల్లు వుందని.

రాజు అరచేతుల్లోని తడి అతనికే తెలుస్తుంది.

"బండి దిగుదే ముందు. తరువాత చెబుతాను" యాసగా ధ్వనించింది ఆ వ్యక్తి స్వరము.

వాళ్ళు ముసుగులు వేసుకున్నారు. మూతి తప్ప ముఖము కనపడడములేదు. గుర్తించడము కష్టం.

వాళ్ళను ఎదిరించడము అంటే ప్రాణాల మీదకు తెచ్చుకోవడమేనని ఇద్దరికి తెలుసు.

అందుకే ఇంజను ఆపి స్టాండు వేసారు. దొంగలు ముందు వెనుక రాజు, శేఖర్ నడిచారు.

పాడుపడ్డ యింటిలోకి తీసుకుని వెళ్లారు.

అక్కడ మరో ఇద్దరు.

"మీ దగ్గర వున్న డబ్బులు, వాచీలు, వుంగరాలు ఇచ్చెయ్యండి" గదిలోని వ్యక్తి హుంకరించాడు. అతని గొంతులో కరుకుదనము వుంది.

వాళ్ళను ఏవిధంగానైనా ఎదుర్కోవడానికి అవకాశము వుందేమో అని ఆలోచిస్తున్నాడు రాజు.

క్రూర జంతువు నుంచి తప్పుకున్న ధైర్యము అతనిలో.

శేఖర్ అప్పటికే తన దగ్గర వున్నవన్ని అక్కడ కిటికిలో పెట్టాడు.

దూరంగా సన్నని ధ్వని. ఎంతో నిశితంగా వింటే తప్ప వినిపించదు. దానిని రాజు విన్నాడు.

నెమ్మదిగా తన చేతి వాచీ తీసాడు.

"తొందరగా ఇవ్వవే" కంగారు పెట్టాడు ఓ దొంగ.

శబ్దము దగ్గర అవుతోంది.

దానిని వాళ్ళు వినిపించుకోలేదు.

రాజు తన వస్తువులు అన్ని తీసి కిటికీలో పెట్టాడు.

శబ్దము మరి కొంచెము దగ్గరగా వచ్చింది.

దొంగల చెవులు ఆలకించాయి. మొదట ఇద్దరు ముందుకు వురికి రోడ్డుపైకి వచ్చారు.

లైట్లు చాలా దగ్గరగా కనిపించాయి.

లైట్లు దగ్గర అయ్యాయి. రోడ్డు మధ్యలో బుల్లెట్.

షడన్‌గా రోడ్డుకు రెండు ప్రక్కల నుంచి ఇద్దరు వచ్చారు, చేతిలో కర్రలతో.

అది జీప్. కీచు శబ్దముతో ఆగింది.

ఇద్దరూ డోర్ వైపు వెళ్ళారు.

అంతే: లోన వ్యక్తులను చూసి బెదిరిపోయారు.

"పోలీసులు, పోలీసులు" అంటూ అరుస్తూ చెరో ప్రక్కకు చెట్లలోకి పరుగెత్తారు.

ఇన్‌స్పెక్టర్ చేతిలోని రివాల్వర్ ప్రేలింది.

పోలీసులు వెంట తరిమి ఆ ఇద్దరినీ పట్టుకున్నారు.

రోడ్డుపై బుల్లెట్. ఏదో అర్థమయినట్టు వేగంగా అడుగులు వేసాడు ఇన్‌స్పెక్టర్ కిరణ్ పాడుబడిన ఇంటి వైపు. అనుసరించారు పోలీసులు.

బయటి అరుపులు, శబ్దముతో లోన వ్యక్తులు జరిగింది వూహించి అక్కడ వస్తువులను చేతిలోకి తీసుకుని ముందు కురికారు.

ముందుకు వస్తున్న ఓ దొంగ కాళ్ళకు రాజు కాలు అడ్డం పెట్టాడు.

ఆ వ్యక్తి వేగంగా ముందుకు రావడముతో షడన్‌గా

అడ్డు వచ్చిన కాలు తగిలి బోర్లా పడ్డాడు.

ముఖము పగిలిపోయిన బాధతో కీచుగా అరిచాడు. అతని చేతిలోని వస్తువులు జారిపోయాయి.

ఈలోపుగా బయటివాళ్ళకి తమ వునికి తెలియచెయ్యాలని శేఖర్ గొంతు పెద్దది చేసి "దొంగలు, దొంగలు" అని అరిచాడు.

శేఖర్ అరుపుతో కోపము వచ్చిన మరో దొంగ తన చేతిలోని కర్రతో శేఖర్ తలపై బలంగా కొట్టాడు.

శేఖర్ బాధగా అరిచి తల పట్టుకుని నేలపై వ్రాలిపోయాడు.

ఆ దొంగ రాజు వైపు అడుగు వెయ్యబోయాడు.

క్రిందపడ్డ దొంగ పైకి లేచాడు.

రాజులో భయం ఆవహించింది.

సరిగ్గా అపుడే వచ్చాడు ఇన్‌స్పెక్టర్ కిరణ్. దొంగలు మరి ప్రతిఘటించలేదు.

ఇన్‌స్పెక్టర్ రాజుకు, శేఖర్‌కు పరిచయం వున్నవాడే. ఆప్యాయంగా రాజు చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

శేఖర్‌ను జీపులోకి తరలించారు పోలీసులు.

క్రొత్తగా డ్యూటీలో జాయిన్ అయ్యాడు కిరణ్. వూరి పెద్దగా శేఖర్ తండ్రికి పలుకుబడి వుంది. అపుడు ఇచ్చిన పార్టీలో పరిచయమయిన వ్యక్తులు రాజులు.

ఈ మధ్య దారి దోపిడీలు గురించి విపరీతంగా వస్తున్న కంప్లైయింట్స్ ఆధారంగా రాత్రిళ్ళు ఆ దారిలో రైడింగ్ మొదలు పెట్టాడు కిరణ్ బాధ్యత గల పోలీసు ఆఫీసర్‌గా.

కిరణ్‌కు పట్టుబడ్డ మూడవ బ్యాచ్ ఇది.

పోలీసులకు ఏదో చెప్పాడు కిరణ్. తర్వాత రాజు చెయ్యి పట్టుకుని జీప్ వయిపుగా నడిపించాడు.

కానిస్టేబుల్స్ ఇద్దరు బుల్లెట్ వైపుగా నడిచారు.

"యూ ఆర్ లక్కీ ఫెలోస్" నవ్వాడు కిరణ్.

రాజుకు నవ్వు రాలేదు. ఓ శుష్క మందహాసం మెరిసింది అతని పెదవులపై.

జరిగింది అంతా పూసగ్రుచ్చినట్లు చెప్పాడు కిరణ్‌కి.

జీప్ వేగంగా బద్వేలు వైపు వెళుతోంది. ముందు బుల్లెట్ దారి చూపిస్తుంది.

శేఖర్ అప్పుడే స్పృహలోకి వస్తున్నాడు.

రాజు కళ్ళు మూసుకుని సీటుకు చేర్లబడ్డాడు.

చల్లనిగాలి హృదయాన్ని సేద తీరుస్తూంది. □

దంచు! దంచు!

క్రొత్త సీరియల్ ప్రారంభం!

ప్రతాప రవిశంకర్

సీరియల్ మహా యాత్ర

కనుచూపుమేర అంతా చీకటి.

ఎక్కడా వెలుతురు లేదు. ఆకాశంలో నక్షత్రాల వెలుగు కూడా అంతమాత్రంగానే వున్నది.

రెండో ప్రపంచ యుద్ధకాలం. బ్రిటిష్‌వాళ్ళు ఈ దేశాన్ని నిరంకుశంగా పాలిస్తున్నారు. అప్పటికి గ్రామాల్లో నాగరికత బలిసిపోలేదు. గ్రామాలు అభివృద్ధి చెందనూ లేదు.

కాని—స్వేచ్ఛావాయువుల కోసం తిరగబడే భారతీయుల్ని ఎక్కడికక్కడే అణచివేయటానికి వీలైనన్ని ఎక్కువ గ్రామాల్లో పోలీసు ఠాణాలను మాత్రం ఏర్పాటు చేశారు.

అంతేకాని—ఇతర సదుపాయాల గురించి వాళ్ళు పట్టించుకోలేదు.

తనకేమీ పట్టనట్టు చల్లటిగాలి అటూ ఇటూ పరుగులు

పెడుతోంది.

చలి బాగానే ముదిరింది. దూరంగా ఎక్కడో ఎత్తుగా పెరిగిన చెట్లు గాలికి కదులాడుతూ ఎవరో వెకిలిగా నవ్వుతున్న చప్పుడు చేస్తున్నాయి.

చీకట్లో రాతికోటకు కొంచెం దూరంలో నిలబడి వున్నాడు నరేంద్ర. చీకటిని చీల్చుకుంటూ అతడు ముందుకు చూస్తున్నాడు. వెలుగు పూర్తిగా అంతరించి పోకముందే అతను ఆ రాతికోట దగ్గరకు వచ్చాడు.

వెలుగు కరిగిపోయింది. చీకట్లు కమ్ముకొచ్చేశాయి. కాని—నీలూ రాలేదు.

దాదాపుగా రోజూ సూర్యుడు పడమటి కొండల్లోకి దిగిపోయేవేళ ఆ రాతికోట దగ్గర నరేంద్ర—నీలూ కలుసుకుంటారు.

వాళ్ళిద్దరూ ప్రేమికులు.

ఆమె అతడికోసం ప్రాణం యిస్తుంది. అతడికోసం ఆమే ముందు వచ్చేది అతనొచ్చేసరికి—కాని ఆ రోజు రాలేదు.

అతను వెళ్ళిపోవాలని అనుకుంటూనే అక్కడ చాలా సేపు నిలబడిపోయాడు. నీలూని నిరాశపరచటం అతనికి ఇష్టంలేదు—వెళ్ళిపోయి.

ఐనా ఆమె ఇక రాదనే ఆలోచన అతన్లో కలగలేదు. ఆమె తప్పకుండా వస్తుందనే ఆశ అతన్లో చావలేదు.

అందుకే దూరంగా ఆ చెట్లు చేస్తున్న వెకిలినవ్వు చప్పుడును వింటూనే అక్కడ నిలబడ్డాడు.

ఆ ప్రదేశాన్నంతా చీకటి దుప్పటిలా కప్పేసింది. బాగా దూరంగా ఎక్కడో ఎత్తుగా కట్టిన ఓ ఇంట్లోనించి చిమ్నీ వెదజల్లుతున్న వెలుగు అస్పష్టంగా అక్కడ పడుతోంది.

ఇక వెళ్ళిపోవటానికే నిర్ణయించుకున్నాడు నరేంద్ర. ఆ చీకట్లో ఆమె ఆ రాతికోట దగ్గరకు వస్తుందనే ఆశ ఆతన్లో చచ్చిపోయింది.

ముందుకు కదిలాడు చీకట్లో....వెనుకనించి యెవరో తరుముతున్నట్టు ఆ చప్పుడు వినపడుతూనే వుంది.

రెండడుగులు వేశాడు.

అప్పుడు వినపడింది అతనికి దూరంనించి—ఆ వైపుకే ఏదో టాంగా వస్తున్నట్టు....

ఆగిపోయాడు.

నీలూ టాంగాలో వస్తోందా?

ఐవుండొచ్చు....

ఒకసారి ఇలాగే జరిగింది. బాగా చీకటిపడిందని టాంగాలో వచ్చింది. చివరికి యిద్దరూ టాంగాలోనే వెళ్ళి పోయారు.

అందుకే అతను అక్కడే ఆగిపోయాడు.

టాంగాకు కట్టిన గుర్రం మెళ్ళో గజ్జెల చప్పుడు బాగా దగ్గిరగా వినపడుతోంది.

ఒక నిముషం తర్వాత అతనికి టాంగాకు ఎడమవైపు కట్టిన లాంతరు వెలుగుతూ కనబడింది. కళ్ళు చిట్లించి చూశాడు—అందులో యెవరు వున్నదీ అతనికి సరిగ్గా కనపళ్ళేదు.

ఉన్నట్టుండి టాంగాలోనించి యెవరివో గొంతులు వినబడ్డాయి. ఒక్క మనిషి కాదు. అంతకంటే ఎక్కువ మంది వున్నారని అతనికి అర్థమయింది.

నీలూ కాదు.

మళ్ళీ కదిలాడు.

టాంగా దగ్గిరయ్యింది.

హఠాత్తుగా అందులో కూర్చున్న ఒక మనిషి టార్చి వెలిగించి నరేంద్రమీదకు ఫోకస్ చేశాడు. వెలుతురు మొహంమీద పడగానే కళ్ళు మూసుకున్నాడు నరేంద్ర.

ఎవరో అరిచారు—"నరేంద్రా"—అంటూ.

"టాంగా ఆపు" టార్చి ఫోకస్ చేసిన మనిషి ఆజ్ఞాపించినట్టుగా అరిచాడు.

బండీ ఆగిపోయింది.

జరుగుతున్నదేమిటో తెలుసుకునేలోపల టాంగాలోనించి నలుగురు మనుషులు దిగి నరేంద్ర యెదురుగా నిలబడ్డారు.

విసుగ్గా మెడను విదిలిస్తోంది గుర్రం.

దాని మెడకు వున్న తోలుపట్టీలో గజ్జెలు చప్పుడు చేస్తున్నాయి.

"నీలూ యెక్కడ?" అతనే—ఆ టార్చి ఫోకస్‌చేసిన మనిషే అడిగాడు నరేంద్రను.

అలా అడుగుతూనే నీలూ కోసం చూశాడు అతడి వెనగ్గా—

అతడ్ని గుర్తుపట్టాడు నరేంద్ర. అవును. అతనే.... జేబులో వుంది నరేంద్ర చెయ్యి. అతని చేతికి ఒక మడతపెట్టిన కాగితం తగులుతోంది. ఆ కాగితంలో యేం రాసివున్నాదో అతడికి సరిగ్గా అప్పుడే గుర్తుకు వచ్చింది. ఐనా అందులో రాసివున్న విషయం గురించి అతను భయపడదల్చుకోలేదు.

"మాట్లాడవేం? నీలూ ఎక్కడ?"

టాంగా తోలేవాడు ఆసక్తిగా చూస్తున్నాడు. వాడికి కొంచెం భయంగా కూడా వుంది—ఆ నలుగురూ ఆ ఒక మనిషిని యేం చేస్తారో అని....

నరేంద్ర మాట్లాడలేదు. వాళ్ళను యెదుర్కొనే దారి కోసం మనసులో వెతుకుతున్నాడు! ఆ నలుగుర్నీ తనొక్కడే ఎదుర్కోవటం కష్టమని అతనికి బాగానే తెలుసు. కాని యేదో ఒకటి చెయ్యాలి. తప్పదు.

ఎంత వద్దనుకున్నా జేబులో వున్న ఆ కాగితం—అందులో వున్న విషయం అతనికి గుర్తుకొస్తూనే వున్నాయి.

"జేబులో యేముంది? చేతులు బయటకు తియ్యి. కత్తి వుందా?" దూరంగా చెట్లు చేస్తున్న చప్పుడుకంటే ఇంకా వెకిలిగా నవ్వాడు అతను.

అతని పేరు మనోహర్....

"భయమా?" నవ్వుతూ అడిగాడు నరేంద్ర.

వెంటనే మనోహర్ పక్కనే నిలబడ్డమనిషి ముందుకు కదిలాడు....

"ఆగు....ఈ నరేంద్ర శరీరంతో నేనే ఆడుకోవాలి. ముందు జేబులోనించి చెయ్యి తీసేయ్" అంటూ అరిచాడు మనోహర్....

"కాచుకోండి....నా జేబులో కత్తి వుంది" అంటూ వేగంగా బయటకు లాగి చేత్తో మనోహర్ మొహంమీద బలంగా కొట్టాడు నరేంద్ర.

కీచుమంటూ అరిచి పక్కనేవున్న మనిషిమీద పడిపోయాడు మనోహర్. అతని చేతిలోనించి కిందపడ్డ టార్చి పగిలిపోయింది.

ముందుకు పరుగుదీశాడు నరేంద్ర....

ఇద్దరు మనుషులు అతని వెనకనే పరిగెత్తారు.

టాంగా నడిపే వ్యక్తికి బాగా ఉత్సాహంగా వుంది.

నలుగురు మనుషులకీ అతను బెదిరిపోతాడని అనుకు న్నాడు. కాని ఇలా పరుగెత్తుతాడని వూహించలేదు— దెబ్బతీసి.

రాతికోట గోడపక్కకువెళ్ళి చీకట్లో వూపిరి బిగపట్టి నిలబడ్డాడు నరేంద్ర....అతడి చేతిలో బాగా పదునుగా వున్న రాయి వుంది.

గుడ్డిగా అతడ్ని అనుసరిస్తూ వచ్చిన మనుషులు గోడ మలుపు తిరుగుతూనే చీకట్లో పెద్దగా అరిచారు భయంతో. బాధతో....ఒకే ఒక్క నిముషంలో వెనక్కు విరుచుకుని పడిపోయారు.

"వెళ్ళండి....అతన్ని పట్టుకోండి....దెబ్బ తగిలిం దేమో....అరుస్తున్నాడు" అన్నాడు టాంగావాడు. వాడికి తెలుసు బాధగా అరచిన మనుష లెవరో....

మనోహర్—ఆ రెండోమనిషి చీకట్లో పరుగుదీశారు గుడ్డిగా.

"వాడ్ని బతకనివ్వకూడదు....వాడు చావాలి. అప్పుడు నీలూ నా కౌగిట్లో వుంటుంది" అన్నాడు మనోహర్ రాతి కోట గోడ మలుపు తిరుగుతూ.

అప్పుడే అతనికి ఏదో చప్పుడు వినపడింది—ఎవరో బరువుగా వూపిరి తీస్తున్నట్టు....అదేమిటో తెలుసుకునే లోపల అతని మెడమీద బలంగా దెబ్బ తగిలింది.

కెవ్వున అరిచాడు.

ఒక్క సెకండు తేడాతో రెండోమనిషి కూడా అరిచి ఎవరో నెట్టినట్టు వెనక్కు పడిపోయాడు.

టాంగావాడికి ఆ అరుపులు కూడా వినపడ్డాయి.

వాడు సంతోషంతో గుర్రం మెడ నిమిరి నరేంద్ర అక్కడకు రావడంకోసం ఎదురుచూట్టం మొదలుపెట్టాడు.

కాని నరేంద్ర వెంటనే అక్కడకు రాలేదు.

ఆ నలుగుర్లో ఎవడైనా చచ్చిపోయాడేమోనని చూశాడు. అంతా బతికేవున్నారు. కాని స్పృహలో లేరు.

అప్పుడు అతనికి మళ్ళీ జేబులోవున్న మడతపెట్టిన కాగితం గుర్తుకొచ్చింది. దాన్నతను బయటకుతీసి ముక్కలుగా చించి మనోహర్ మొహం మీదకు విసిరాడు.

ఆ కాగితాన్ని మనోహర్ రెండ్రోజుల క్రితం ఒక మనిషికిచ్చి నరేంద్రకు పంపించాడు. నీలూని కలుసుకోవద్దని—ఆమెను కలుసుకుంటే ప్రాణాలు దక్కవనీ బెదిరిస్తూ ఉత్తరం రాశాడు.

అక్కడ్నుంచి కదులుతూ అనుకున్నాడు నరేంద్ర. భిలాస్‌పూర్‌లో చలి బాగా ఎక్కువ. ఈ చలికి ఆ నలుగురూ తెల్లవారేసరికి చచ్చిపోతారేమోనని - ఐనా అతను ఇక ఆ నలుగురు మనుషుల గురించీ పట్టించుకో దల్చుకోలేదు.

టాంగా దగరకు వచ్చాడు.

"భిలాస్‌పూర్‌కు పట్టిన శని వదిలిపోయింది" అన్నాడు టాంగావాడు.

నరేంద్ర నవ్వి "ను వ్వేమనుకుంటున్నావ్? ఆ నలుగుర్ని చంపేశాననుకుంటున్నావా? వాళ్ళు చావలేదు. బతికేవున్నారు. ఐతే స్పృహలో లేరు" అన్నాడు.

"పోన్లెండి....ఈ దెబ్బలు చాలు వాళ్ళకి....పట్టి పిరికివాళ్ళు....నీలూ అంటున్నారు. ఆ అమ్మాయేదీ? కనపడదేం?" అడిగాడు వాడు.

"రాలేదు, వస్తే ఎట్లావుండేదో....కొంతవరకు అదృష్టమే....ఇంతకీ టాంగా ఎక్కమంటావా?" అడిగాడు నరేంద్ర.

"మీకోసమే ఎదురుచూస్తున్నాను... ఎక్కండి భిలాస్‌పూర్‌కి నేను కొంచెం కొత్తమనిషిని....మీరు ఏ ప్రాంతంలో వుంటున్నారు...." అడిగాడు వాడు గుర్రాన్ని అదిలిస్తూ....

చెప్పాడు నరేంద్ర....

గుర్రం ముందుకు పరుగుదీసింది. గతుకులుగా వున్న రోడ్డుమీద టాంగా ఎగిరిపడుతోంది. లాంతరు కదిలినప్పుడల్లా రోడ్డు పక్కగావున్న చెట్లనీడలు వెనక్కి కదులుతూ సాగుతున్నాయి.

నరేంద్ర చూస్తున్నాడు.

"ఏదైనా నౌకరీ చేస్తున్నారా?" అడిగాడు టాంగావాడు.

"ఊహూ....లేదు"

"ఐతే సైనికుడిగా చేరకూడదూ....మీరు బాగా పనికొస్తారు....ఇప్పుడే చూశాను కదా....నలుగుర్ని నాలుగు నిముషాల్లో నేల కరిపించారు....ఏమంటారు?"

"ఆలోచిస్తాను...."

"మీలాంటివాళ్ళు సైన్యంలో వుంటే బాగుంటుంది."

"అవును....నాకూ చేరాలనేవుంది. కాని నీలూ ఒప్పుకోదు."

"ఇంతకీ నీలూ ఎవరండీ? ఎట్లా వుంటుంది?"

"రేపు సాయంత్రం సూర్యుడు జారిపోకముందు రాతికోట దగ్గరకు వచ్చెయ్యి....నీలూ ఎట్లా వుంటుందో నువ్వే చూడొచ్చు...."

"మళ్ళీ ఆ నలుగురు మనుషులూ వస్తారేమో!"

"భయం లేదు....రేపు ఒక్కడినే రాను....నాజేబులో ఒక్కపోటుతో ప్రాణాన్ని లాక్కునే కత్తికూడా వుంటుంది."

మీ అభిమాన డిటెక్టివ్ రచయిత

మల్లాది వెంకటకృష్ణమూర్తి

చాలా కాలం తర్వాత రాసిన డిటెక్టివ్ నవల

మిస్టర్ 'వి'

వెల: రూ. 30/-

జులై 1 న విడుదల అయింది.

కట్నం కోసం పెళ్లికాని పిల్లల్ని వివాహం చేసుకుని ఆ కట్నం డబ్బుతో వుడాయించే దుర్మార్గుడికోసం వెదికి, వేటాడి డిటెక్టివ్ పని చేసే ఓ సాహసిక యువతి కథ ఇది.

డిటెక్టివ్ నవలల్లో వుండే థ్రిల్స్, ఇన్వెస్టిగేషన్, సస్పెన్స్ వయొలెన్స్ 'మిస్టర్ వి' లో పుష్కలంగా వు-టాయి.

డిటెక్టివ్ పాఠకులకి

మిస్టర్ 'వి'

చక్కటి విందు.

ఫోన్ నెం: 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్

మ్యూజియం రోడ్ : : విజయవాడ - 2.

టాంగావాడు ఇంకేదో అడగబోయాడు కాని "ఆ చర్చి రోడ్డులోకి టాంగాని పోనివ్వూ" అన్నాడు నరేంద్ర.

నాలుగు రోడ్ల కూడలిలో ఇనుప స్తంభాలకు అమర్చబడిన గాజుపెట్టెల్లో దీపాలు నిశ్చలంగా వెలుగుతున్నాయి.

టాంగా పరుగుదీస్తుంటే రోడ్లమీద ఆడుకుంటున్న పిల్లలు పెద్దగా అరుస్తూ పక్కకు తప్పుకుంటున్నారు.

నరేంద్ర కళ్ళముందు నీలూ కదులుతూంది. ఒక ఇరుకు వీధిలోకి ప్రవేశించింది టాంగా....

గుర్రం పరుగు ఆగిపోయింది.

రెండు నిముషాలకు నరేంద్ర చూపించిన ఇంటి బయట టాంగా ఆగింది. టాంగావాడికి డబ్బులిచ్చి కదలబోయాడు నరేంద్ర....

"ఏమండీ, నిజంగానే రేపు సాయంత్రం రాతికోసం దగ్గరకు రమ్మంటారా?" అనడిగాడు వాడు.

నరేంద్ర నవ్వి "వచ్చెయ్యి.... నీలూకి నీగురించిచెబితే నవ్వుతుంది.... సర్లే.... వెళ్ళు" అంటూ ఇంట్లోకి వెళ్ళాడు.

వెళుతూనే వసారాలో కొయ్య కుర్చీలో కూర్చుని మాట్లాడుతున్న మనిషిని సులభంగానే గుర్తించాడు నరేంద్ర—తీగెకు వేళ్లాడుతున్న లాంతరు వెలుతుర్లో....

ఆమె నీలూ!

2

పోలీసు ఠాణాలో పదిగంటలు కొట్టారు. వసారాలో ఒక్కడే పడుకున్న నరేంద్ర ఆ గంటల్ని లెక్కపెట్టాడు. అంతటా పరచుకున్న నిశ్శబ్దాన్ని ఆ గంటల చప్పుడు నిలువునా చీల్చేసింది.

కిటికీ చువ్వల మధ్యనించి లోపల వెలుగుతున్న నూనె దీపం కాంతి బద్ధకంగా బయటకు వస్తోంది.

అపరాధ పరిశోధన పోటీ-218

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితం పై వ్రాసి, దానితో రూ 1.00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు 1.00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-9-'86 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు నవంబరు '86 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. రాష్ట్రంలో ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా వీరు ఆందోళన జరుపుతున్నారు—?

   (విద్యార్థులు, మత్స్యకారులు.)

2. ఇండియా యీ క్రీడలను బహిష్కరించింది—?

   (కామన్వెల్తు, ప్రపంచ కప్ ఫుట్ బాల్.)

3. దేశంలో ఇది రోజు రోజుకు పెరుగుతూనే వుంది—?

   (పేదరికం, జనాభా.)

4. జానపద కథలలో ఇది సామాన్యంగా వచ్చే పాత్ర—?

   (మాంత్రికుడు, రాకుమారై)

5. మన రాజకీయ నాయకులు దీనికే పెద్ద పీట వేస్తున్నారు—?

   (ప్రతిభకు, కులానికి)

బయటంతా చీకటి.

నరేంద్ర కళ్ళు తెరుచుకుని చీకట్లోకి చూస్తున్నాడు. కొన్నిగంటల క్రితం జరిగిపోయిన సంఘటన అతడి కళ్ళ ముందు ఇంకా కదులుతూనే వుంది.

మనోహర్‌తో శత్రుత్వం అంటే చిన్న విషయం కాదని అతనికి తెలుసు. అతని తండ్రి బ్రిటిష్ ప్రభుత్వంలో కొంచెం పలుకుబడివున్న మనిషి. అందుకే మనోహర్ బిలాస్‌పూర్‌లో అట్లా తిరుగుతున్నాడు.

నీలూ అందం అతడి కళ్ళముందు తళుక్కున మెరిసింది. ఆమెకోసం, ఆమెను దక్కించుకోటానికి తను యేమైనా చేస్తాడు. ఎవర్నయినా ఎదిరిస్తాడు అనుకున్నాడు.

ఎవరో ఇంట్లో మంచంమీద నుండి లేచిన చప్పుడు వినపడింది.

తలుపులు తెరుచుకున్నాయి.

"వదినా....నువ్వేనా?" అన్నాడతను.

"నేనే" అన్నది రేణు.

"నిద్రపోలేదా?"

"మీ అన్నయ్య ఇంకా రాలేదు" అన్నదామె.

సరిగ్గా అప్పుడే భూపేంద్ర లోపలకు వచ్చాడు. వస్తూనే "సాయంత్రం చాటింపు విన్నావా నువ్వు" అనడిగాడు నరేంద్రను.

"విన్లేదు. ఎందుగురించి?"

"మాయమైపోయిన దివాన్ ఆచూకీ ఇంతవరకు తెలీలేదు. ఆయన ఆచూకీ తెలియజేసిన వాళ్ళకు బహుమానం ప్రకటించారు" చెప్పాడు నరేంద్ర అన్నయ్య.

"ఆశ్చర్యంగా వుంది. ఇంతకీ దివాన్ ఏమైనట్టు? ఎక్కడికి వెళ్ళివుంటాడు?"



మా వద్ద సాంఘిక నవలలు, డిటెక్టివ్‌లు, బాల సాహిత్యం, నాటకములు, వైద్య, విద్య మరియు స్కూలు, కాలేజి విద్యార్థులకు అచ్చుపుస్తకములు, ఎక్సర్‌సైజు పుస్తకములు, స్టేషనరీ మొదలగునవి లభించును.

నేడే కేటలాగుకై వ్రాయండి.

శ్రీ గణేశ్ బుక్ హౌస్

(బుక్ డిస్ట్రిబ్యూటర్స్ & స్టేషనరీ)

టౌన్‌హాల్ రోడ్డు—రాజమండ్రి - 1

"ఆయన వెళ్ళి వుండడు. ఎవరో ఆయన్ని బలవంతంగా తీసుకువెళ్ళి దాచిపెంటారని అనుకుంటున్నారు"

"ఎందుకు? ఆ అవసరం ఎవరికి వుంది?"

"నాకు తెలిసి ఒక్కటే కారణం వుంది. దివాన్ బ్రిటిష్ అధికారులతో బాగా సన్నిహితంగా వుంటున్నాడు. అది సహించలేని వాళ్ళెవరో ఆయన్ని మాయంచేశారనుకుంటాను."

"ఆయనే బతికే వున్నాడా?" అనుమానంగా అడిగాడు నరేంద్ర.

"అనుమానమే. ఆ మనుషులెవరో దివాన్‌ని చంపి వుంటే ఆయన శవం కూడా ఎవరికి కనపడదు"

రేణు వాళ్ళిద్దరి మాటల్నీ ఆసక్తిగా వింటోంది. ఆ సాయంత్రం చాటింపు ఆమెకూడా విన్నది

"ఆయనకోసం ఎవ్వరూ వెతకటంలేదా?"

"భిలాస్‌పూర్ రాజా మనుషులు వెతుకుతున్నారు. బ్రిటిష్ ప్రభుత్వ పోలీసులు కూడా అన్వేషిస్తున్నారు. ఐనా దివాన్ ఆచూకీ సూచనగా కూడా ఎవరికీ తెలీలేదు"

"ఐతే దివాన్‌కోసం నేను ప్రయత్నం చేస్తాను. ఆయన్ని ఎవరు బంధించినా విడిపించి తీసుకువస్తాను" అన్నాడు నరేంద్ర.

"వద్దు. ప్రమాదం....దివాన్ మాయం వెనుక ఏదైనా రాజకీయ కుట్రవుంటే నువ్వు బలైపోతావు" అని లోపలకు వెళ్ళిపోయాడు భూపేంద్ర.

రేణుక కూడా వెళ్ళిపోయింది.

కళ్ళు మూసుకున్నాడు నరేంద్ర. అతని ఆలోచనలన్నీ మాయమైన దివాన్‌మీదకు మళ్ళాయి.

ఎక్కడున్నాడు దివాన్?

"హోమ్ డెలివరీ"

1. 'హోమ్ డెలివరీ' లో పాఠకులు ఎవరైనను చేరవచ్చును. దీనికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 10/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

2. సభ్యులకు "అపరాధ పరిశోధన" పత్రికలు వాటి అసలు ధరకే లభిస్తాయి. అంతేకాదు—వారికి పత్రికలన్నీ 'రిజిష్టరు పోస్టు' లో అందజేస్తాము. ప్రతి 6 నెలలకు ఒకసారి అంటే- జనవరి మరియు జూలై నెలల పత్రికలు మాత్రం వి.పి. ద్వారా పంపబడతాయి. వి.పి. వచ్చినప్పుడు మీరు పోస్టుమాన్‌కు అర్ధ సంవత్సర చందా చెల్లించవలసి వుంటుంది. పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము. పత్రికల ఖరీదుకు మించి మీరు పైసా చెల్లించనవసరం లేదు.

3. 'అపరాధ పరిశోధన' మాసపత్రిక మరియు సప్లిమెంట్‌కు కలిపి అర్ధసంవత్సర చందా రు. 84/-లు మాత్రమే.

4. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మీరు వెంటనే M. O. చేయాలి. లేనిచో, మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. మీ చిరునామా మారినప్పుడు వెంటనే మాకు తెలియజేయాలి. ఆ సమయంలో మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంది. కావున మీకు ప్రతి నెలా వచ్చే ప్యాకెట్ పై- మీ పేరుకు ముందు వుండే నెంబరును మాత్రమే ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయగోర్తాము.

6. సభ్యులకు ప్రతి నెలా V.P. ద్వారా పత్రికలు తెప్పించుకునే సౌకర్యంకూడా వుంది. అయితే వి.పి. ఖర్చులుకూడా వారే భరించవలసి వుంటుంది. ఈ పద్ధతిలో పత్రికలను ఏ నెల కా నెల రు. 17-60లు చెల్లించి పొందవచ్చును. యీ సౌకర్యం కావలసిన వారు మాకు ప్రత్యేకంగా తెలియజేయాలి.

హోమ్ డెలివరీ! — పత్రికలకు గ్యారంటీ!!

3

ఎక్కడో ఏదో తలుపు తెరుచుకున్న చప్పుడయ్యింది.

చీకట్లోకి చూశాడు దివాన్.

ఏమీ కనబడలేదు. చీకటే ఎంతో నల్లగా కనపడింది.

ఇంకొక్క నిముషానికి సన్నని వెలుతురు గోడలమీద అటూ ఇటూ కదిలింది.

ఎవరో వస్తున్నారని అనుకున్నా డాయన.

ఎవరు?

ఆ ముసుగు మనిషేనా?

భయంతో ఒక్కసారి శరీరమంతా కదిలిపోయింది. వాడు మరీ దుర్మార్గుడు. దారుణంగా హింసలు పెడుతు తున్నాడు-అనుకున్నాడు.

మరికొంతసేపటికి గోడ అంచున వున్న మెట్లమీదనించి కాగడా పట్టుకున్న మనిషి కనపడ్డాడు మసగ్గా....తర్వాత అతడి వెనుక వున్న ముసుగుమ షికూడా కనబడ్డాడు.

భయంతో దివాన్ కళ్ళు బెదిరాయి.

ఆ ముసుగుమనిషి తనదగ్గర రాకుండా పెద్దగా అరవా లనుకున్నాడు.

ఇద్దరూ బందిఖానా దగ్గరకు వచ్చి ఆగిపోయారు.

కాగడా నిశ్చలంగా వెలుగుతోంది.

వెలుగు అన్నివైపులకీ పరుగుదీస్తోంది....

"తాళం తియ్యి" అన్నాడు ముసుగుమనిషి....అతను దివాన్‌కి తన మొహం తెలీకుండా వుండాలనే ఆ నల్లటి ముసుగును మొహంమీద వేసుకున్నాడు. కళ్ళదగ్గర చిల్లు లున్నాయి.

కాగడాను గోడపక్కనే వున్న గొళ్ళెంలో గుచ్చి ఊచల తలుపుకువున్న తాళాన్ని తీసాడు ఆ మనిషి....వాడి

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీద బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-9-'86 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు నవంబరు '86 నెల సంచికలో ప్రకటిస్తాము. •

జులై '86 పోటీ ఫలితాలు

(1) జులై '86 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య.

కౌగిలిలో కట్టుబడితివా!
కారుకోసం పట్టుబడితివా!!

పంపినవారు: శ్రీ ముప్పిడి రాంచందర్, 18—60, కంట్రాక్టర్ బస్తీ, బెల్లంపల్లి - 504 251.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

నిన్ను చూసి గుర్రం సకిలిస్తోంది!
సూది చూస్తే నాకు భయమేస్తోంది!!

పంపినవారు: శ్రీ వి.కె. విశ్వనాథ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదాబాదు, నక్కల గుట్ట, హన్మకొండ (వరంగల్ జిల్లా)

మొహాన ఏ ముసుగూ లేదు. కాని వాడు నల్లగా వున్నాడు చీకటిలా శరీరం మొత్తాకీ ముసుగు వేసుకున్నట్టు....

దివాన్ ముడుచుకొని కూర్చున్నాడు భయంతో.

ముసుగుమనిషి దివాన్‌కు దగ్గర వచ్చి నిలబడి పలకరింపుగా నవ్వాడు—ఆ నవ్వు శబ్దం విని దివాన్ మొహం బాగా పాలిపోయింది.

"నా ఆతిథ్యం బావున్నదా?" అడిగా డతను. అతడి పేరు జస్వంత్....

మాట్లాడలేదు దివాన్.

తలవంచుకున్నాడు.

"దివాన్....ఇవాళ సాయంత్రం భిలాస్‌పూర్ వీథుల్లో మాయమైన దివాన్ గురించి చాటింపు వేయబడింది"

దివాన్ తలెత్తి జస్వంత్ మొహంలోకి చూసి మళ్ళీ తలదించుకున్నాడు.

"చెప్పమంటావా? దివాన్ ఆచూకీ తెలియజేసినవాళ్ళకి బహుమతి ఇస్తారుట భిలాస్‌పూర్ పోలీసులు. నిన్ను నేను పట్టుకున్నాను. బంధించాను. ఎందుకో నీకు తెలుసు కదూ....ఒక గొప్ప బహుమతి కోసం.... ఈ దేశంలో ఎవ్వరూ తెలుసుకోలేని అద్భుతమైన బహుమతిని నువ్వు నా కోసం నీ గుండెలో దాచి వుంచావు. ఏదీ....అదెక్కడ వుందో చెప్పు దివాన్" అన్నాడు ముసుగు మనిషి జస్వంత్ ఎంతో మర్యాదగా.

"నాకు తెలీదు. నిజంగానే తెలీదు. తెలిసి వుంటే ఈ వయసులో ఇన్ని హింసలు భరించను" అన్నాడు దివాన్.

పెద్దగా నవ్వాడు జస్వంత్.

పక్కనే నిలబడ్డ మనిషి చిన్నగా నవ్వాడు.

"నిజమేమిటో నాకు తెలుసు. కాని చాలా ఆలస్యంగా

ప్రతి మనిషికీ ఒక తోడున్నప్పుడు
తను ఒంటరిగా ఉండేది......
ఒంటరిగా వున్న ప్రతి మనిషికీ
తానే తోడుగా ఉండేది....
మౌనం ఒక్కటే!
సమస్యలు దండెత్తివస్తే పోరాటం
మౌనంగానే సాగాలి.
మేథ సాగించిన 'మౌనపోరాటం'లో
విజయం ఎవరిదో నిర్ణయించాల్సింది మీరే!

ప్రేమ కథా రచయిత్రి

యద్దనపూడి సులోచనరాణి

అత్యద్భుత కథనం

మౌన పోరాటం

వెల. రూ. 20/-

చదవండి! ఆలోచించండి!
పోస్టులో కావాలంటే రూ. 10/- ఎమ్.వో.
చేయండి. మిగతా రూ. 10/- లకి వి.పి.
పెట్టి పంపిస్తాము.

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్,
3237, రాష్ట్రపతిరోడ్, సికింద్రాబాద్ - 500 003.

ఈ నిజాన్ని తెలుసుకో గలిగాను. బిలాస్‌పూర్ రాజా పూర్వీకులు కోట్ల విలువైన వజ్రాలను రహస్యంగా ఎక్కడ దాచి వుంచారో నీకు తెలుసు. నువ్వు ఆ రహస్యాన్ని స్వార్థంతో ఇప్పటి రాజాకు కూడా చెప్పలేదు. ఆ రహస్యం వాళ్ళతోనే అంతరించిపోయిందని అంతా అనుకున్నారు. కాని నీకు తెలుసు. నీకు తెలుసని నాకు తెలుసు. అబద్ధాలను తెలుసుకోవటంలో నాకు బాగా అనుభవం వుంది, కాబట్టి నిజం చెప్పెయ్యి దివాన్....వజ్రాలను దాచి వుంచిన ఆ ప్రదేశం ఎక్కడుంది?"

"తెలీదు....నన్ను విసిగించకు....కావాలంటే ఒక్కసారిగా చంపెయ్యి" అన్నాడు దివాన్ అంతా విని.

మళ్ళీ నవ్వాడు జస్వంత్.

"నిన్ను ఒక్కసారిగా చంపను దివాన్....హింసించి చంపుతాను. నువ్వు చచ్చిపోయినా నీ శవం చేతనయినా నిజాన్ని చెప్పిస్తాను....నాలో కోపం ప్రవేశించక ముందే చెప్పు....ఎక్కడ ఆ ప్రదేశం?" ఒక్క అడుగు ముందుకు వేసి అడిగాడు గట్టిగా.

ముసుగు మనిషికి కోపం వస్తున్నట్టు దివాన్ తెలుసుకున్నాడు. కోపం వస్తే అతను ఏం చేస్తాడో ఆయనకు తెలుసు కూడా. ఐనా ఆ రహస్యం గురించి ఎలా చెబుతాడు?

"మాట్లాడవేం?" కాలితో దివాన్ భుజం మీద తన్నాడు.

వెనక్కు పడ్డాడు దివాన్. (సశేషం)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
adn Printed at Kranti Press, Madras-600001.